తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

సోమవారం 10.02.2025 | సంపుటి : 11 సంచిక : 210 | పేజీలు : 12 వెల: రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698




## రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు

**కేంద్రంపై మండిపడ్డ ప్రియాంక**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**దేశ చరిత్రలో తొలిసారిగా కేంద్ర ప్రభుత్వంలోని భాజపా రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచేందుకు ప్రయత్నిస్తుందని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక ఆరోపించారు. వయనాడ్ అసెంబ్లీ నియోజకవర్గంలోని పార్టీ బూత్ స్థాయి నాయకులను ఉద్దేశిస్తూ మాట్లాడిన సమయంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. 'రాజ్యాంగాన్ని,

మిగతా 2లో..



## కేంద్రానివి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు

**జాతీయ విద్యావిధానాన్ని వద్దన్నందుకు రాష్ట్రానికి నిధులు ఆపడం సరికాదు**

**కేంద్రంపై స్టాలిన్ తీవ్ర విమర్శలు**



2లో




# ఒకే వ్యక్తి.. ఒకే పార్టీ

## ఇదే మోదీ అసలు ఎజెండా..

- సుపరిపాలన ఎంత మార్పుతెస్తుందనేందుకు తెలంగాణ ఓ ఉదాహరణ
- రాష్ట్రాన్ని ప్రపంచంలో అత్యుత్తంగా తీర్చిదిద్దాలనుకుంటున్నాం
- హక్కుల రక్షణ కోసం దక్షిణాది రాష్ట్రాలు ఏకం కావాలి: సీఎం రేవంత్

- కాంగ్రెస్ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసింది
- తన పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రానికి చేసిందేమీ లేదు
- తెలంగాణను హైదరాబాద్ కోర్ అర్బన్, సెమీ అర్బన్, రూరల్ అనే మూడు జోన్లుగా విభజిస్తాం
- ప్రపంచంలోనే అత్యుత్తమ నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నాం
- మాతృభూమి ఇంటర్‌నేషనల్ ఫెస్టివల్ ఆఫ్ లెటర్స్ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి

**తిరువనంతపురం (జనంసాక్షి):** ఒకే దేశం.. ఒకే ఎన్నిక నిజానికి ఒకే వ్యక్తి.. ఒకే పార్టీ అనే విధానమని... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రహస్య అజెండా అదే అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గాల పునర్విభజన మరో అంశమని.. కుటుంబ నియంత్రణ విధానంతో పాటు ఉత్తరాది రాష్ట్రాలతో పోల్చితే దక్షిణాది రాష్ట్రాలు మెరుగైన సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినందుకు దక్షిణాదిని శిక్షిస్తున్నారా అని ఆయన ప్రశ్నించారు. మలయాళీ దినపత్రిక మాతృభూమి కేరళ రాజధాని తిరువనంతపురంలో ఆదివారం ఏర్పాటు చేసిన మాతృభూమి ఇంటర్నేషనల్ ఫెస్టివల్ ఆఫ్ లెటర్స్ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించారు. రాజ్యాంగం ప్రసాదించిన గ్యారంటీలను, మన హక్కులను రక్షించుకునేందుకు దక్షిణాది రాష్ట్రాలు చేతులు కలపాలని ముఖ్యమంత్రి



రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. తెలంగాణ రైజింగ్ అనేది నినాదం మాత్రమే కాదని...అది నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల స్వప్నమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. తెలంగాణను భారత దేశంలోనే కాదు ప్రపంచంలోనే అత్యుత్తుమంగా నిలపాలని తాను ఆకాంక్షిస్తున్నట్లు సీఎం తెలిపారు. తెలంగాణ రైజింగ్.. విజన్ -2050,

మిగతా 2లో..

# ప్రజల్లోకి వెళ్లండి

**వారి సమస్యలపై పోరాడండి • ఎమ్మెల్యేలతో భేటీలో కేజ్రీవాల్ సూచన**

**ఢిల్లీ(జనంసాక్షి):** దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ నుంచి గెలుపొందిన ఎమ్మెల్యేలతో ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సమావేశమయ్యారు. దిల్లీలోని ఫిరోజ్‌షా రోడ్‌లోని తన నివాసంలో జరిగిన భేటీలో ప్రజల కోసం పనిచేయాలని వారికి సూచించారు. ఈ సమావేశంలో ఆతిశీతో పాటు 22మంది ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. భేటీ అనంతరం ఆతిశీ మీడియాతో మాట్లాడారు. భాజపా ఇచ్చిన హామీలను నెరవేర్చేలా ఆప్ నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్రను పోషిస్తుందన్నారు. ప్రజల కోసం పనిచేస్తూ.. వారి సమస్యల్ని పరిష్కరిస్తామని తెలిపారు. ఎన్నికల్లో భాజపా ఇచ్చిన హామీలను అమలు జరిగేలా పనిచేస్తామని ఆతిశీ అన్నారు. మార్చి 8 నాటికి మహిళలకు నెలకు రూ.2500 చెల్లించేలా, 300 యూనిట్ల ఉచిత విద్యుత్తు అందించేలా, ప్రజలకు ఇతర సౌకర్యాలు సైతం అందేలా చూస్తామన్నారు. గత పదేళ్లలో ఆప్ సర్కార్ అందించిన ఉచిత



సేవల్ని నిలిపివేయకుండా ప్రజలకు అండగా నిలబడతామని తెలిపారు. అయితే, ఆప్ శాసనసభాపక్ష నేత ఎవరనేది తదుపరి సమావేశంలో ఎన్నుకుంటామని పేర్కొన్నారు.

### ముఖ్యమంత్రి పదవికి ఆతిశీ రాజీనామా

2లో

# నేడు కుంభమేళాకు రాష్ట్రపతి

**త్రివేణీ సంగమంలో స్నానమాచరించనున్న ద్రౌపదీ ముర్ము**

**ప్రయాగ్‌రాజ్‌లో భద్రత కట్టుదిట్టం చేసిన అధికారులు**



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కుంభమేళా పర్యటన ఖరారైంది. సోమవారం ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లనున్నారు. త్రివేణీ సంగమంలో పుణ్యస్నానమాచరించడంతోపాటు స్థానిక ఆలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నారు.రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో కుంభమేళాలో భద్రత కట్టుదిట్టం చేశారు. "రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఫిబ్రవరి 10 ఉదయం ప్రయాగ్‌రాజ్‌కు చేరుకుంటారు. త్రివేణీ సంగమంలో పుణ్యస్నానం, ప్రార్థనలు చేస్తారు. అనంతరం బడే హనుమాన్ ఆలయం

మిగతా 2లో..

**రామరాజ్యానికి మద్దతు ఇవ్వాలని...**

## చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకుడిపై దాడి



**ఘటనలో ఒకరు అరెస్ట్..**

**హైదరాబాద్(జనంసాక్షి):** రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం చిలుకూరు బాలాజీ ఆలయం ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్‌పై దాడి ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. రంగరాజన్ ఇంట్లో ఉన్న సమయంలో ఆయనపై కొందరు దాడి చేసినట్టు స్థానిక పోలీసులకు ఫిర్యాదు అందింది. "నాపై 20 మంది దాడి చేశారు. ఈ ఘటనపై పోలీ సులకు ఫిర్యాదు చేశాం. మిగతా వివరాలు విచారణలో తెలుస్తాయి. ఇంతకు మించి దీనిపై మాట్లాడను" అని రంగరాజన్ తెలిపారు. దాడి ఘటనను వివరించేందుకు ఆయన నిరాకరించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరు బాలాజీ ఆలయం సమీపంలోని రంగరాజన్

మిగతా 2లో..

## కుమారుడిని పొట్టనపెట్టుకున్న మద్యం మత్తు

**తండ్రి తీవ్రంగా కొట్టడంతో మృతి చెందిన బాలుడు**

**యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలంలో దారుణం**

**చౌటుప్పల్(జనంసాక్షి):**యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం ఆరెగూడెంలో విషాదం చోటు చేసుకుంది. మద్యం మత్తులో సైదులు అనే వ్యక్తి తన కుమారుడిని కొట్టి చంపాడు. 9వ తరగతి చదువుతున్న భాను తమ పాఠశాలలో శనివారం నిర్వహించిన ఫేర్‌వెల్ పార్టీకి వెళ్లాడు. అయితే, ఇంటికి ఆలస్యంగా వచ్చాడన్న కోపంతో సైదులు.. విద్యార్థిని చావబాదాడు. ఆ దెబ్బలకు తాళలేక భాను ప్రాణాలు కోల్పోయాడు.



## మళ్లీ నెత్తురోడిన దండకారణ్యం

# భారీ ఎన్‌కౌంటర్

**31 మంది మావోయిస్టుల మృతి.. మరికొందరికి తీవ్రగాయాలు**

**ఎదురుకాల్పుల్లో ఇద్దరు పోలీసులూ మృతి**

**బీజాపూర్(జనంసాక్షి):** ఛత్తీస్‌గఢ్‌లో మరో భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. బీజాపూర్ జిల్లా నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో 31 మంది మావోయిస్టులు మృతిచెందగా.. పలువురు గాయపడ్డారు. మావోయిస్టుల కోసం డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, కోబ్రా బృందాలు గాలింపు కొనసాగిస్తున్నాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఛత్తీస్‌గఢ్ చరిత్రలోనే రెండో భారీ ఎన్‌కౌంటర్‌గా దీన్ని పేర్కొంటున్నారు. గతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో 41 మంది మావోయిస్టులు మృతి చెందారు.ఈ ఘటనపై బస్తర్ ఐజీ పి.సుందర్‌రాజు స్పందించారు. ఎదురుకాల్పుల్లో 31 మంది మావోయిస్టులు మరణించినట్లు ధ్రువీకరించారు. ఈ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు జవాన్లు కూడా ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఘటనా స్థలంలో పెద్ద మొత్తంలో ఆయుధాలు, మందుగుండు సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.పశ్చిమ బస్తర్ ప్రాంతంలో శుక్రవారం మావోయిస్టుల కదలికలకు సంబంధించి భద్రతా దళాలకు కీలక సమాచారం అందింది. దీంతో ఇంద్రావతీ నేషనల్ పార్క్ ప్రాంతంలో ఇవాళ తెల్లవారుజామున భద్రతా దళాలు యాంటీ మావోయిస్టు ఆపరేషన్ చేపట్టాయి. ఈ సమయంలో కాల్పులు మొదలు కావడంతో భద్రతా దళాలు ప్రతిస్పందించాయి. ఆ ప్రదే శంలో కాల్పులు ఇంకా కొనసాగుతున్నట్లు సమాచారం.





## మావోయిస్టులందరినీ హతమారుస్తాం

**అమిత్‌షా పునరుద్ఘాటన**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపుర్ జిల్లాలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 31 మంది మావోయిస్టులు మరణించిన విషయం తెలిసిందే. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం.ఈ ఘటనపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పందిస్తూ.. దేశాన్ని నక్సల్స్ రహితంగా మార్చే దిశగా భద్రతాదళాలు భారీ విజయాన్ని సాధించాయని చెప్పారు. వచ్చే ఏడాది మార్చినాటికి నక్సలిజాన్ని పెకిలించివేస్తామని 'ఎక్స్' వేదికగా పునరుద్ఘాటించారు. "ఛత్తీస్‌గఢ్‌లో చేపట్టిన భారీ ఆపరేషన్‌లో 31 మంది మావోయిస్టులను భద్రతాబలగాలు మట్టుబెట్టాయి. అదేవిధంగా పెద్దఎత్తున ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నాయి. మానవత్వానికి

మిగతా 2లో..

# సైనిక చర్యల కంటే చర్చలకే అధిక ప్రాధాన్యం

**ఇరాన్‌తో నాన్ న్యూక్లియర్ ఒప్పందం చేసుకోవాలని అనుకొంటున్నాం : ట్రంప్**

**2022 నాటికి శ్వేత సౌధంలో ఉండుండే రష్యా,ఉక్రెయిన్ యుద్ధం మొదలయ్యేది కాదు**

**అమాయక ప్రజలు చనిపోవడం పుతిన్ ఆపాలనుకుంటున్నారని వెల్లడి**



**న్యూయార్క్(జనంసాక్షి):**యుద్ధం కారణంగా అమాయక ప్రజలు చనిపోవడం ఆపాలని పుతిన్ కోరుకుంటున్నారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. ఆయన ఇటీవల రష్యా అధ్యక్షుడితో ఫోన్‌కాల్‌లో మాట్లాడారు. ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో న్యూయార్క్ పోస్టు పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆ వివరాలు వెల్లడించారు. "ప్రజలు చనిపోవడం ఆపాలని ఆయన అనుకొంటున్నారు. మరణించిన వారంతా యువత, మంచివాళ్లు. వారు మీ పిల్లల్లాంటి వారే. అకారణంగా లక్షల మంది చనిపోయారు" అని ట్రంప్ వ్యాఖ్యానించారు.ఒక వేళ తాను 2022 నాటికి శ్వేత సౌధంలో ఉండి ఉంటే.. ఈ యుద్ధం ఎప్పటికీ జరిగేది కాదన్నారు. అంతేకాదు గతంలో తనకు రష్యా అధినేతతో ఉన్న బలమైన సంబంధాన్ని ఆయన గుర్తు చేశారు. "నాకు పుతిన్‌తో సత్సంబంధాలున్నాయి.

మిగతా 2లో..

## ఢిల్లీ పీఠంపై సమాలోచనలు

**అమిత్ షాతో నడ్డా కీలక భేటీ..**

**తెరపైకి పలువురి పేర్లు**

న్యూఢిల్లీ(జనంసాక్షి):దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన భాజపా.. ఇప్పుడు ముఖ్యమంత్రి అభ్యర్థి ఎంపికపై ముమ్మర కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా దిల్లీలో భేటీ అయ్యారు. నిన్న సాయంత్రం భాజపా విజయోత్సవ వేడుకల అనంతరం ప్రధాని నరేంద్ర మోదీసహా పలువురు

మిగతా 2లో..



## బీసీలను మోసం చేసిన సీఎం

**వారికి క్షమాపణ చెప్పాలి:కేటీఆర్**



**హైదరాబాద్(జనంసాక్షి):**భారాసకు చెందిన బీసీ ముఖ్యనేతలతో ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలంగాణ భవన్‌లో సమావేశమయ్యారు. తాజా రాజకీయ పరిణామాలపై సీనియర్ నేతలతో చర్చించారు.బీసీ కులగణన, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు సాధన తదితర అంశాలపై సమీక్ష జరిపారు. బీసీ సంబంధిత అంశాలపై కార్యాచరణను భారాస పార్టీ త్వరలోనే ప్రకటిస్తుందని కేటీఆర్ ఈ సందర్భంగా తెలిపారు." కుల గణనలో ఐదున్నర శాతం జనాభాను తగ్గించారు. దాదాపు 22 లక్షల మం ది ఉన్న వారిని లేనట్లు చిత్రీకరిం చారు. జనాభాను తగ్గించడంపై సీఎం రేవంత్‌రెడ్డి బీసీలకు క్షమాపణ చెప్పాలి. కులగణన పూర్తిగా తప్పుల తడక. కులగణన చిత్తుకాగితంతో సమానమని కాంగ్రెస్ ఎమ్మెల్సీ తగుల బెట్టారు. బీసీలకు అన్యాయం చేసి తప్పించుకునే ప్రయత్నం చేయవద్దు. రిజర్వేషన్లు 42 శాతమని బీసీ డిక్లరేషన్‌లో చెప్పిన విధంగా మాట నిలబెట్టుకోవాలి. బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో చట్టబద్ధత కల్పిస్తారని భావించాం. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లు పెట్టాలి. గతంలో బీసీలకు 50శాతానికి పైగా రిజర్వేషన్లు ఇచ్చాం. అసెంబ్లీ, ఎంపీ, స్థానిక ఎన్నికల్లో అత్యధిక సీట్లు కేటాయించాం" అని కేటీఆర్ అన్నారు. రీసర్వే చేసి సరైన లెక్కలు తేల్చాలని డిమాండ్ చేశారు.

## ఎట్టకేలకు మణిపూర్ సీఎం రాజీనామా

**ఇంఫాల్(జనంసాక్షి):**మణిపుర్ ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ రాజీనామా చేశారు. గవర్నర్ అజయ్ కుమార్ భల్లాను కలిసి తన రాజీనామా లేఖను సమర్పించారు. జాతుల మధ్య వైరంతో కొంతకాలంగా మణిపుర్ అట్టుడుకుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అనేక విమర్శలు ఎదు ర్కొన్న బీరెన్ సింగ్.. తాజాగా తన పదవినుంచి వైదొలగడం గమనార్హం.



### రామరాజ్యానికి మద్దతు ఇవ్వాలని...

# 'చిలుకూరు బాలాజీ' ప్రధాన అర్చకుడిపై దాడి

నివాసానికి శుక్రవారం కొందరు వ్యక్తులు వచ్చారు. రామ రాజ్యం స్థాపనకు మద్దతివ్వాలని కోరారు. అందుకు ఆయన నిరాకరించడంతో .. వాగ్వాదానికి దిగి దాడికి పాల్పడ్డారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన అతని కుమారుడిపై కూడా దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. రంగరాజన్‌పై దాడి కేసుకు సంబంధించి ఆదివారం ఒకరిని అరెస్టు చేసినట్టు మొయినాబాద్ పోలీసులు తెలిపారు. దాడికి పాల్పడిన వారిలో వీరరాఘవరెడ్డిని అరెస్టు చేశామని, మిగతా నిందితుల కోసం గాలిస్తున్నామని చెప్పారు.

## ముఖ్యమంత్రి పదవికి ఆతిశీ రాజీనామా



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఢిల్లీ ముఖ్యమంత్రి పదవికి ఆతిశీ రాజీనామా చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ) వి.కె సక్సేనాకు సంబంధిత లేఖను సమర్పించారు. శనివారం వెలువడిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో అధికార ఆమ్‌ఆద్మీని భాజపా ఓడించింది. ఈ నేపథ్యంలో సీఎం పదవికి ఆతీశీ రాజీనామా చేశారు. ఎన్నికల్లో ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ సహా అగ్రనేతలు మనీశ్ సిసోదియా, సత్యేందర్ జైన్ ఓటమి పాలయ్యారు. ముఖ్యమంత్రి ఆతిశీ మాత్రం కాల్‌కాజీ నియోజకవర్గం నుంచి గెలుపొందారు. ఒకదశలో వెనుకంజలో ఉన్న ఆమె.. ఆ తర్వాత పుంజుకుని భాజపా అభ్యర్థి రమేశ్ బిధూరిపై 3,521 ఓట్ల ఆధిక్యంతో నెగ్గారు.ఈ సందర్భంగా ఆతిశీ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి ఆప్‌నకు ఎదురుదెబ్బ అని అన్నారు. తనపై నమ్మకంతో కాల్‌కాజీ ఓటర్లు తనను గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. భాజపా చేస్తున్న అక్రమాలు, అవినీతికి వ్యతిరేకంగా తమ పార్టీ పోరాటం కొనసాగుతూనే ఉంటుందని ఆమె చెప్పారు. అరవింద్ కేజ్రీవాల్ మద్యం కుంభకోణంలో జైలు శిక్ష అనుభవించి గతేడాది సెప్టెంబర్‌లో బయటకు వచ్చాక ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. ప్రజలు మళ్లీ తనకు విశ్వసనీయత సర్టిఫికెట్ ఇచ్చే వరకూ పదవిలో ఉండబోనని పేర్కొంటూ.. నూతన సీఎంగా ఆతిశీని ప్రతిపాదించారు. దీంతో ఆమె అనూహ్యంగా సీఎం పదవిని చేపట్టారు.

## సైనిక చర్యల కంటే చర్చలకే అధిక ప్రాధాన్యం

దేశానికే బైడెన్ ఓ అవమానం" అని వ్యాఖ్యానించారు.ఇక ఇరాన్ విషయాన్ని ట్రంప్ ప్రస్తావిస్తూ.. తాను సైనిక చర్యల కంటే చర్చలకే అధిక ప్రాధాన్యం ఇస్తానని వెల్లడించారు. ఇరాన్‌తో నాన్ న్యూక్లియర్ ఒప్పందం చేసుకోవాలని అనుకొంటున్నట్లు వెల్లడించారు. బాంబు దాడుల కంటే దీనిని తాను ఇష్టపడతానని చెప్పారు.ప్రస్తుతం ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపేందుకు చర్చలు జరుగుతున్నాయని ట్రంప్ తెలిపారు. ఉక్రెయిన్‌తో 500 మిలియన్ డాలర్ల డీల్‌ను ట్రంప్ ప్రతిపాదించారు. కీవ్ ఆధీనంలో అరుదైన ఖనిజాలను దీని కింద అమెరికాకు ఇవ్వాల్సి ఉంటుంది. వీటితోపాటు గ్యాస్‌ను కూడా సరఫరా చేయాల్సి వస్తుంది. వచ్చేవారం మ్యూనిచ్‌లో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఉక్రెయిన్ అధినేత జెలెన్‌స్కీతో భేటీ కానున్నారు.

## సన్నవడ్లకు బోనస్ పేరుతో దగా

### ప్రభుత్వం ఇచ్చిన చెక్కులు ఇప్పటికీ క్లియర్ కాలేదు

### ఆ విషయమై సీఎంకు బహిరంగ లేఖ రాస్తా: హరీశ్‌రావు



**సిద్దిపేట(జనంసాక్షి):**సన్నవడ్లకు బోనస్ పేరుతో రైతులను ప్రభుత్వం దగా చేస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. 'మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాటలు గొప్ప.. చేతలు చేదు' అని ఎద్దేవా చేశారు. సిద్దిపేటలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు బోనస్ బోగస్‌పై సీఎంకు బహిరంగ లేఖ రాస్తానన్నారు. వరంగల్ డిక్లరేషన్‌ను కాంగ్రెస్ తుంగలో తొక్కిందని విమర్శించారు."కాంగ్రెస్ నేతలు గ్రామాల్లో తిరిగితే రైతులే నిలదీస్తారు. ఈ సర్కారు కోతల సర్కార్‌గా మారిపోయింది. ఎంత పండిస్తే అంత కంది పంట కొనుగోలు చేయాలి. క్రాప్ బుక్‌లో నమోదు కాని రైతుల పంటలను కూడా కొనుగోలు చేయాలి. నవంబర్ 30న సీఎం ఇచ్చిన రుణమాఫీ చెక్కు ఇప్పటికీ క్లియర్ కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను, ప్రజలను మోసం చేస్తోంది" అని హరీశ్‌రావు విమర్శించారు.

## మెక్సికో ఘోర విషాదం

### రోడ్డుప్రమాదంలో 40 మంది సజీవ దహనం



**టబాస్కో (జనంసాక్షి):**దక్షిణ మెక్సికోలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. 48 మందితో ప్రయాణిస్తున్న బస్సును ఓ ట్రక్కు ఢీకొంది. దీంతో బస్సులో మంటలు చెలరేగి 40 మంది సజీవ దహనమయ్యారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. టబాస్కో రాష్ట్రంలో శనివారం తెల్లవారుజామున ఈఘటన చోటుచేసుకుంది. బస్సులో మంటలు వ్యాపించడంతో.. 38 మంది ప్రయాణికులతో పాటు ఇద్దరు డ్రైవర్లూ ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో ట్రక్కు డ్రైవర్ కూడా మృతి చెందారు. ఘటనా స్థలంలో ఇప్పటి వరకు 18 మందికి చెందిన అవశేషాలను గుర్తించినట్లు స్థానిక అధికారి వెల్లడించారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయన్నారు. ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టినట్లు వెల్లడించారు.

### ఒకే దేశం.. ఒకే ఎన్నిక పెదాలపైన..

# ఒకే వ్యక్తి.. ఒకే పార్టీ



దక్షిణాది రాష్ట్రాలు ఎందుకు కలిసి పని చేయాలనే దానిపై ముఖ్యమంత్రి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ" కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసింది. 60 ఏళ్ల కలను నెరవేర్చినందున తెలంగాణ ప్రజలు సోనియా గాంధీని ఎంతగానో ప్రేమిస్తున్నారు. తన పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ కోసం చేసింది ఏం లేదు. ఆ పార్టీ నాయకులు ఎన్నో వాగ్దానాలు చేశారే తప్ప వాటిని నెరవేర్చలేదు. తెలంగాణ జీడీపీ సుమారు 200 బిలియన్ యూఎస్ డాలర్లుగా ఉంది.. 2035 నాటికి దానిని ఒక మిలియన్ యూఎస్ డాలర్లుగా మార్చాలనుకుంటున్నాం. తెలంగాణను హైదరాబాద్ కోర్ అర్బన్, సెమీ అర్బన్, రూరల్ అనే మూడు జోన్లుగా విభజించాం. 160 కిలోమీటర్ల పొడవైన అవుటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్) పరిధిలోని కోర్ అర్బన్ ఏరియాలో 1.2 కోట్ల ప్రజలు నివసిస్తున్నారు. ఈ ప్రాంతం సాఫ్ట్ వేర్, ఫార్మా రంగాలకు కేంద్రంగా ఉంది. చార్మినార్, హైదరాబాద్ బిర్యానీ, ముత్యాలకు హైదరాబాద్ ప్రసిద్ధి. ఓఆర్ఆర్ పరిధిలోని ఈ కోర్ అర్బన్ ఏరియాను సర్వీస్ సెక్టార్స్‌తో 100 శాతం నెట్ జీరోగా మార్పు చేయనున్నాం. ప్రపంచంలోనే అత్యుత్తమ నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు మేం పలు కార్యక్రమాలు చేపడుతున్నాం. దేశంలోని ముంబయి, ఢిల్లీ, బెంగళూర్, చెన్నై వంటి నగరాలతో కాకుండా ప్రపంచంలోని ముఖ్య నగరాలైన న్యూయార్క్, లండన్, సింగపూర్, టోక్యో, సియోల్ వంటి నగరాలతో పోటీపడేలా హైదరాబాద్ ఉండాలనుకుంటున్నాం. 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నాం.. ఇది భారతదేశంలోని పూర్తి హరిత, పరిశుభ్రమైన, అత్యుత్తమమైన నగరంగా ఉండనుంది. ప్రపంచంలోని మరే నగరంతో పోల్చుకున్నా ఇది సరైన ప్రణాళిక, జోన్లు ఉన్న నగరంగా ఉండనుంది. అలాగే ఇది మొట్టమొదటి నెట్ జీరో సిటీ..ఫ్యూచర్ సిటీలో మేం ఏఐ సిటీని నిర్మిస్తున్నాం.. యువత కోసం యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ నిర్మిస్తున్నాం.ఈ ఏడాది దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో నేను పాల్గొన్నా. రూ.1,82,000+ కోట్లకుపైగా పెట్టుబడులను తెలంగాణకు తీసుకురాగలిగాం. గతేడాది రూ.40 వేల పెట్టుబడులు వచ్చాయి.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనా కాలంలో రూ.25 వేల కోట్ల పెట్టుబడులను సాధించలేకపోయింది. హైదరాబాద్ పర్యావరణ సుస్థిరతకుగానూ మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు చేపట్టాం..మూసా... ఈసా నదుల కలయికే మూసీ... గత యాభై ఏళ్లుగా కాలుష్యం కోరల్లో చిక్కి మూసీ కనుమరుగయ్యే స్థితికి చేరింది.. మా ప్రభుత్వం మూసీకి పూర్వ వైభవం తేవాలనుకుంటోంది. గోదావరి నీటిని మూసీలో కలపడం ద్వారా త్రివేణి సంగమంగా మార్చనున్నాం.. అక్కడే 200 ఎకరాల్లో గాంధీ సరోవర్‌ను నిర్మిస్తున్నాం.దక్షిణాది రాష్ట్రాల్లో తీర ప్రాంతం లేని ఏకైక రాష్ట్రం తెలంగాణ ఈ నేపథ్యంలో మేం డ్రై పోర్ట్ నిర్మించనున్నాం. దానిని ఆంధ్రప్రదేశ్‌లోని సీ పోర్ట్ (సముద్ర రేవు)కు ప్రత్యేక రైలు, రోడ్డు మార్గం ద్వారా కలుపుతాం. హైదరాబాద్ వృద్ధి చెందితేనే తెలంగాణ రైజింగ్ సాధ్యమవుతుంది. అభివృద్ధి మొదట నగరాలతోనే మొదలవుతుందనేది నా భావన... హైదరాబాద్ రైజింగ్ కావాలంటే అది వేగవంతమైన, పరిశుభ్రమైన, సురక్షితమైన, అవకాశాలు కల్పించే నగరంగా ఉండాలి. × మేం రీజినల్ రింగు రోడ్డును, రీజినల్ రింగు రైల్వే లైను నిర్మించబోతున్నాం...ఈ రెండింటిని రేడియల్ రోడ్ల ద్వారా కలపనున్నాం. మేం ఇటీవల ఎనర్జీ పాలసీని విడుదల చేశాం. ఈవీలపై ఉన్న అన్ని పన్నులను తొలగించాం. ఈవీ ల అమ్మకాల్లో దేశంలోనే తెలంగాణ తొలి స్థానంలో ఉంది. రాష్ట్రంలోని 3 వేల ఆర్టీసీ బస్సులను దశలవారీగా ఈవీలుగా మార్చనున్నాం.ఓఆర్ఆర్-ఆర్ఆర్ఆర్ మధ్య ఉన్న సెమీ అర్బన్ ఏరియాను ఉత్పత్తి (మాన్యుఫ్యాక్చరింగ్) జోన్‌గా మార్చబోతున్నాం. ఇది చైనా+1 అనే మా వ్యూహానికి ప్రపంచానికి సమాధానంగా నిలవనుంది. ఔషధాలు, విత్తనాల ఉత్పత్తిలో తెలంగాణ ముందువరుసలో ఉంది. వాటికి అదనంగా ఎఫ్ఎంసీజీ, రక్షణ, రాకెట్స్, స్పేస్, ఎలక్ట్రిక్ వాహనాలు, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో ముందు వరుసలో నిలవాలనుకుంటున్నాం. భారతదేశానికి డాటా సెంటర్ హబ్ గా, పంప్ స్టోరేజీ హబ్‌గా తెలంగాణ నిలవనుంది. దేశంలోని ఉత్తర, దక్షిణ, తూర్పు, పడమర దిక్కులకు అనుసంధానమై, దక్షిణాది రాష్ట్రాలకు ముఖ ద్వారంగా ఉన్న తెలంగాణ దేశానికి లాజిస్టిక్ సెంటర్ గా ఉండాలని మేం ఆకాంక్షిస్తున్నాం.× ఆర్ఆర్ఆర్ వెలుపల నుంచి రాష్ట్ర సరిహద్దుల వరకు ఉన్న గ్రామాలను మార్చాలనుకుంటున్నాం. గ్రామాల్లోనూ అత్యుత్తమ వసతులు కల్పిస్తాం.. రైతులకు 24 గంటలు ఉచిత విద్యుత్ సరఫరా ఇస్తున్నాం... రైతులకు ఎకరాకు రూ.12 వేలు రైతు భరోసా ఇస్తున్నాం.. భూమి లేని కుటుంబాలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తున్నాం. పంటలకు కనీస మద్దతు ధరతో పాటు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్నాం. దేశంలోనే రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ. 25 లక్షల రైతు కుటుంబాలకు రూ.21 వేల కోట్ల రుణ మాఫీ చేశాం. కేవలం మౌలిక వసతుల వృద్ధితోనే తెలంగాణ రైజింగ్ కాదు... రైతులు, మహిళలు, యువత, పిల్లలు, వయోధికుల అందరి విషయంలోనూ మేం దృష్టి పెడుతున్నాం.. తెలంగాణ రైజింగ్‌లో వారూ భాగమే.రాజీవ్ ఆరోగ్య శ్రీ లో రూ.10 లక్షల మేర హెల్త్ కవరేజీ ఇస్తున్నాం.. ఆరోగ్య సమస్యలతో తెలంగాణలో ఎవరైనా ఏ ఆసుపత్రికి వెళ్లినా మేం చూసుకుంటున్నాం. విద్యా, నైపుణ్యాలు నా ప్రథమ ప్రాధాన్యాలు... అన్ని గురుకులాల్లో మెస్ ఛార్జీలు, కాస్మోటిక్ ఛార్జీలను రెట్టింపు చేశాం.. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటీగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మిస్తున్నాం.× తెలంగాణలో మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించాం.. నా అక్కాచెల్లెళ్లు ఇప్పటికే కోట్లాది బస్సు ప్రయాణాలు ఉచితంగా చేశారు. ఎంతో డబ్బును ఆదా చేసుకున్నారు. అక్కా చెల్లెళ్లకు రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నాం. ఇళ్లకు 200 యూనిట్లు లోపు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షల ఇస్తున్నాం. ప్రతి సంవత్సరం నాలుగు లక్షల ఇళ్లు నిర్మించనున్నాం. 20 లక్షల పేద కుటుంబాలు సొంత ఇళ్ల కల నెరవేరుతుందని నేను హామీ ఇస్తున్నా. సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీ విధానం... దళితులు, ఓబీసీలు, గిరిజనులు, మైనారిటీలకు సామాజిక న్యాయం చేస్తామని మా నాయకుడు రాహుల్ గాంధీ అభయమిచ్చారు.సమగ్ర కుల సర్వే చేసిన తొలి రాష్ట్రం తెలంగాణ.. దానిని అసెంబ్లీలోనూ ప్రవేశపెట్టాం. జనాభా దామాషా ప్రాతిపదికన మేం వనరులు సమకూర్చుతాం.వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా మా మాదిగ సోదరసోదరీమణులు పోరాడుతున్నారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన తర్వాత వర్గీకరణ చేపట్టాలని మేం 2024, ఫిబ్రవరి 4న నిర్ణయం తీసుకున్నాం.. 2025, ఫిబ్రవరి 4న ప్రత్యేక శాసనసభ సమావేశం ఏర్పాటు చేసి దాని అమలుకు తీర్మానం చేశాం. ఫిబ్రవరి 4వ తేదీని ఇక నుంచి తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవంగా జరుపుకోనున్నాం. సుపరిపాలన ఏడాదిలోనే ఎంత మార్పు తెస్తుందనేందుకు తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఒక ఉదాహరణ. కేంద్ర ప్రభుత్వ తాజా ఆర్థిక సర్వే నివేదిక ప్రకారం అతి తక్కువ ద్రవ్యోల్బణం ఉన్న రాష్ట్రం తెలంగాణ గ్లోబల్ ఏఐ యూసేజ్ రిపోర్ట్ ప్రకారం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌లో వినియోగంలో మేం ప్రథమ స్థానంలో ఉన్నాం. తలసరి ఆదాయంలోనూ మేం ప్రథమ స్థానంలో ఉన్నాం.ఇప్పుడు నేను మీ అందరిని ప్రశిస్తున్నాం... మా రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం మద్దతు ఇవ్వకూడదా..?తెలంగాణ ఒక ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థ అయితే అది భారతదేశ వృద్ధికి ప్రయోజనం కాదా..? కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు మద్దతుగా నిలవడం లేదు. ప్రత్యేకించి దక్షిణాది రాష్ట్రాలు, బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాలకు మద్దతుగా నిలవడం లేదు" అని అన్నారు.

## కుమారుడిని పొట్టనపెట్టుకున్న మద్యం మత్తు

ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోస్టుమార్టం లేకుండా ఖననం చేసేందుకు కుటుంబ సభ్యులు ప్రయత్నించగా.. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి మృతదేహాన్ని శవపరీక్ష కోసం పంపించారు. నిందితుడు సైదులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

## ఎట్టకేలకు మణిపూర్ సీఎం రాజీనామా

అందుకు ఆయన నిరాకరించడంతో .. వాగ్వాదానికి దిగి దాడికి పాల్పడ్డారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన అతని కుమారుడిపై కూడా దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. రంగరాజన్‌పై దాడి కేసుకు సంబంధించి ఆదివారం ఒకరిని అరెస్టు చేసినట్టు మొయినాబాద్ పోలీసులు తెలిపారు. దాడికి పాల్పడిన వారిలో వీరరాఘవరెడ్డిని అరెస్టు చేశామని, మిగతా నిందితుల కోసం గాలిస్తున్నామని చెప్పారు.

## మావోయిస్టులందరినీ హతమారుస్తాం

వ్యతిరేకమైన నక్సలిజాన్ని అంతం చేసే ప్రయత్నంలో ఇద్దరు జవాన్లనూ కోల్పోయాం. ఈ అమరవీరులకు దేశం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుంది. 2026 మార్చి 31 నాటికి దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలిస్తామనే సంకల్పాన్ని కూడా పునరుద్ఘాటిస్తున్నాను. దేశంలోని ఏ పౌరుడూ దాని కారణంగా ప్రాణాలు కోల్పోకూడదు" అని అమిత్ షా పేర్కొన్నారు. భద్రతాబలగాల ధైర్యసాహసాలను ప్రశంసిస్తున్నట్లు ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయ్ తెలిపారు. తాము అధికారంలోకి వచ్చినప్పటినుంచి నక్సల్స్‌కు వ్యతిరేకంగా బలంగా పోరాడుతున్నట్లు మీడియాతో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. తాజా ఎదురుకాల్పుల ఘటనలో మరో ఇద్దరు జవాన్లకు గాయాలు కాగా.. వారిని రాయ్‌పుర్‌కు తరలించి, చికిత్స అందిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ చరిత్రలోనే రెండో భారీ ఎన్‌కౌంటర్‌గా దీన్ని పేర్కొంటున్నారు.

## నేడు కుంభమేళాకు రాష్ట్రపతి

, పవిత్రమైన అక్షయవత్ వృక్షాన్ని సందర్శిస్తారు. కుంభమేళా ప్రదేశంలో ఏర్పాటు చేసిన 'డిజిటల్ కుంభ్ అనుభవ్ సెంటర్'ను పరిశీలిస్తారు" అని రాష్ట్రపతి భవన్ వర్గాలు వెల్లడించాయి. ద్రౌపదీ ముర్ము పర్యటన సమయంలో ఆమె వెంట యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఉంటారని సీఎంవో వెల్లడించింది. గతంలో భారత తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ కూడా కుంభమేళాకు హాజరయ్యారు.

# అణ్వాయుధ సంపత్తిని పెంచండి

### అధికారులకు కిమ్ ఆదేశాలు



ప్యాంగ్యాంగ్(జనంసాక్షి):అణ్వాయుధాల తయారీని బలోపేతం చేయాలని ఉత్తరకొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్ తన అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది. కిమ్ ఇలాంటి ఆర్డర్లను గతంలో అనేకసార్లు చేశారు. అయితే, జపాన్ ప్రధాని ఇషిబా, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ల మధ్య తాజాగా ద్వైపాక్షిక భేటీ జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. శనివారం కొరియన్ పీపుల్స్ ఆర్మీ 77వ వ్యవస్థాపక దినోత్సవంలో కిమ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ "న్యూక్లియర్ ఫోర్స్ సహా ప్రత్యర్థులను భయపెట్టే అన్ని రకాల ప్లాన్లను బలోపేతం చేయాలి. అత్యాధునిక అణ్వాయుధాల అభివృద్ధికి పూర్తిస్థాయిలో కట్టుబడి ఉన్నాం" అని కిమ్ తెలిపారు. ఈ సందర్భంగా రష్యాకు తన మద్దతును పునరుద్ఘాటించారు. మాస్కో ప్రజలు, దళాలు వారి దేశ సార్వభౌమాధికారం, భద్రత, ప్రాదేశికతను కాపాడుకునేందుకు కృషి చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.గతంలో ట్రంప్ అధికారంలో ఉన్న సమయంలో కిమ్ విషయంలో కొన్ని సందర్భాల్లో కఠినంగా ఉన్నా.. మరికొన్నిసార్లు చూసీచూడనట్లు వ్యవహరించారు. 2019లో వియత్నాంలో జరిగిన భేటీలో అణ్వాయుధాలు వదిలేసే విషయంలో ఉ.కొరియా వెనక్కి తగ్గలేదు. దీంతో నాటి చర్చలు విఫలం అయ్యాయి. బైడెన్ అధికారంలోకి వచ్చాక ఇరు దేశాల మధ్య దూరం మరింత పెరిగింది. మరోవైపు.. ఇటీవల దక్షిణ కొరియా, జపాన్‌లతో ప్యాంగ్‌యాంగ్ సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. గతేడాది వరుసగా క్షిపణి పరీక్షలు చేస్తూ కిమ్ కవ్వింపు చర్యలకు దిగారు.ద.కొరియా, అమెరికా నుంచి తమకు ముప్పు పొంచి ఉందని ప్యాంగ్‌యాంగ్ ఆరోపించిన సంగతి తెలిసిందే. తమపై దాడికి పాల్పడితే ఎదుర్కోవడానికి అణ్వాయుధాలు సిద్ధంగా ఉన్నాయని హెచ్చరించింది.

## కేంద్రానివి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు

### జాతీయ విద్యావిధానాన్ని వద్దన్నందుకు రాష్ట్రానికి నిధులు ఆపడం సరికాదు.. కేంద్రంపై స్టాలిన్ తీవ్ర విమర్శలు

చెన్నై(జనంసాక్షి):భాజపా నేతృత్వంలోని కేంద్ర సర్కారుపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. కేంద్ర ప్రభుత్వం ఓపెన్ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతోందని మండిపడ్డారు. జాతీయ విద్యావిధానాన్ని తిరస్కరించినందుకు ప్రతీకారంగా రాష్ట్రానికి రావాల్సిన రూ.వేల కోట్ల నిధులను వేరేవాటికి మళ్లించారంటూ 'ఎక్స్' వేదికగా ఆరోపణలు చేశారు."తమిళనాడు విషయంలో కేంద్ర ప్రభుత్వ అన్యాయాలకు హద్దుల్లేకుండా పోతోంది. జాతీయ విద్యావిధానాన్ని, త్రిభాషా సూత్రాన్ని వ్యతిరేకించినందుకు బహిరంగ బెదిరింపులకు పాల్పడుతోంది. తమిళనాడు విద్యార్థులకు ఉద్దేశించిన రూ.2152 కోట్లను ఇతర రాష్ట్రాలకు మళ్లించింది. మాపై జులుం ప్రదర్శిస్తోంది. హక్కుల కోసం నిలబడినందుకు విద్యార్థులను శిక్షిస్తోంది. దేశ చరిత్రలో ఏ ప్రభుత్వం కూడా ఒక రాష్ట్రంపై రాజకీయ ప్రతీకారం కోసం విద్యను అడ్డుకునేంత క్రూరంగా వ్యవహరించలేదు. తమిళనాడు, ఇక్కడి ప్రజల విషయంలో ద్వేషం, అన్యాయాలకు ప్రతిరూపంగా భాజపా మరోసారి తనను తాను నిరూపించుకుంది" అని స్టాలిన్ విమర్శలు గుప్పించారు. మహాకుంభమేళాలో సరైన ఏర్పాట్లు చేయకపోవడంతోనే తొక్కిసలాట జరిగిందని సీఎం స్టాలిన్ ఆరోపించారు. 30 మందే మృతి చెందినట్లు ప్రభుత్వం వెల్లడించినా.. ఈ సంఖ్య మరింత ఎక్కువ ఉంటుందని స్థానిక నేతలే చెబుతున్నారన్నారు. అక్రమ వలసదారులను వెనక్కి పంపుతున్న అమెరికా ఆ క్రమంలో వారికి సంకెళ్లు వేయడాన్ని క్రూరమైన చర్యగా పేర్కొంటూ.. వారి కష్టాలు కన్నీళ్లు తెప్పించాయన్నారు. దీనిపై అమెరికాతో చర్చించాల్సిన విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ సైతం ఆ దేశ చర్యలను సమర్థించే విధంగా వివరణ ఇచ్చారని విమర్శించారు.

## ఢిల్లీ పీఠంపై సమాలోచనలు

కీలక నేతలు ఇదే అంశంపై చర్చించగా.. తాజా భేటీ కీలక ప్రాధాన్యం సంతరించుకుంది. కొత్త సీఎం ఎంపిక విషయంలో అనేక సమీకరణాలను దృష్టిలో ఉంచుకొని కమలనాథులు విస్తృత సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. అయితే, సీఎం ఎంపిక విషయంలో రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో అనుసరించిన రాజకీయ వ్యూహం దిల్లీకి మినహాయింపు కాకపోవచ్చని పలువురు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. మరోవైపు, సీఎం పదవి కోసం ఆప్ అధినేత కేజ్రీవాల్‌ను ఓడించిన జాట్ వర్గానికి చెందిన నేత పర్వేశ్ వర్మతో పాటు సతీశ్ ఉపాధ్యాయ్, విజయేందర్ గుప్తా, ఆశిష్ సూద్, పవన్ శర్మ వంటి పలువురు నేతల పేర్లు ప్రచారంలో ఉన్నాయి. అయితే, ప్రజలకు పెద్దగా పరిచయం లేని కొత్త నేతలను సైతం సీఎం పదవిని కట్టబెట్టిన చరిత్ర భాజపాకు ఉండటంతో.. ఎవరి పేరును ఖరారు చేస్తారోననే ఉత్కంఠ కొనసాగుతోంది. అయితే, పూర్వాంచల్ నేపథ్యం కలిగిన ఎమ్మెల్యే, సిక్కు లేదా మహిళను సైతం పరిగణనలోకి తీసుకొనే అవకాశం ఉండొచ్చని భాజపా నేత ఒకరు అన్నట్లు పీటీఐ పేర్కొంది.మరోవైపు, గత అనుభవాలను పరిశీలిస్తే.. 2023లో మధ్యప్రదేశ్, రాజస్థాన్, గతేడాది ఒడిశా అసెంబ్లీ ఎన్నికల్లో విజయం తర్వాత సీఎం ఎంపిక తీరును బట్టి ఊహాగానాలకు అవకాశం తక్కువగా ఉంది. మధ్యప్రదేశ్‌లో మోహన్ యాదవ్, రాజస్థాన్‌లో భజన్‌లాల్ శర్మ, ఒడిశాలో మోహన్ చరణ్ మాఝీలను సీఎం పదవులకు ఎంపిక చేసిన భాజపా.. రాజకీయ పరిశీలకులను సైతం ఆశ్చర్యానికి గురిచేసిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా.. భాజపా దిల్లీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి అభ్యర్థి ఎంపికపై పార్టీ కేంద్ర నాయకత్వమే నిర్ణయం తీసుకుంటుందన్నారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలందరూ తమకు కేటాయించిన బాధ్యతల్ని నిర్వర్తించగలిగేవారేనని తెలిపారు. నూతన సీఎంగా ఎవరిని ఎన్నుకున్నా.. ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా పర్యటన ముగించుకొని వచ్చాకే ప్రమాణస్వీకారోత్సవం నిర్వహించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

## ట్రాక్టర్ బోల్తాపడి నలుగురు మహిళలు మృతి

### పల్నాడు జిల్లాలో ఘోర ప్రమాదం..

**ముప్పాళ్ల(జనంసాక్షి):** పల్నాడు జిల్లాలో ఆదివారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ట్రాక్టర్ బోల్తాపడి నలుగురు మహిళలు ప్రాణాలు కోల్పోయారు. వ్యవసాయ పనుల కోసం ట్రాక్టర్‌పై వెళ్లిన దాదాపు 20 మంది కూలీలు.. తిరిగి వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. పలువురికి గాయాలయ్యాయి, క్షతగాత్రులను సత్తెనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు



ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే పనిలో మన కేంద్రం ఉంది. ఇది దేశ చరిత్రలోనే తొలిసారి. ప్రస్తుతం మనం చేస్తున్న పోరాటం మన సొంత రాజకీయాల కోసం కాదు. దేశ రక్షణ కోసమని మీరు గుర్తుంచుకోవాలి' అని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మానవ - జంతు సంఘర్షణలను గురించి ప్రస్తావించారు. 'ఈ సమస్య పరిష్కారమయ్యేందుకు చర్యలు తీసుకుంటాను. ఈ అంశాన్ని ఇప్పటికే అనేక సార్లు లేవనెత్తా. మెరుగైన భద్రతా చర్యల కోసం నిధులు చాలా కీలకం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వాటిని రాబట్టడం చాలా కష్టంగా ఉంది' అని ప్రియాంక తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వాటిని రాబట్టడం చాలా కష్టంగా ఉంది' అని ప్రియాంక తెలిపారు.ఇక, నిధుల కేటాయింపుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తాను లేఖ రాస్తానని వెల్లడించారు.

# కమిషనర్‌నే ఏమారుస్తున్న ఆ ఘనుడెవరు?



- కిందిస్థాయి ఉద్యోగులపై వేధింపులు
- నలిగిపోతున్న సిబ్బంది

ఖమ్మం జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిపాలన కొందరు అధికారుల తీరుతో భ్రష్టుపడుతోంది. ఐఏఎస్ సారథ్యంలో అవినీతిరహిత, ఆహ్లాదకర వాతావరణంలో పాలన సాగాలి. అందుకు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అగస్త్య బాటలు వేసినప్పటికీ, కొందరు అధికారులు తమ సొంత ప్రయోజనాల కోసం కార్పొరేషన్ లో పాలనను అస్తవ్యస్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఇంజనీరింగ్ విభాగంలో అసలు ఏం జరుగుతుందో ఎవరికీ తెలియని పరిస్థితి నెలకొంది. మున్సిపల్ కమిషనర్, ఉన్నతాధికారులను సైతం ఏమారుస్తూ ఓ ఘనుడు రాజ్యమేలుతున్నాడు. తనకు నచ్చిన వారికి, తన సొంత ప్రయోజనాలకు వత్తాసు పలికే వారికి ప్రాధాన్యత ఇస్తూ, విధుల కోసం కష్టపడే వారిని ఇబ్బందులకు గురి చేయడం పరిపాటిగా మారింది.




### స్పెషల్ డ్యూటీలు వేశారు.. డేటా ఇవ్వటం మరిచారు

ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న 13 మంది వర్క్ ఇన్స్పెక్టర్ లలో 12 మంది పేర్లతో జనవరి 18వ తేదీన ఒక ఆర్డర్ ను విడుదల చేశారు. దానిలో వర్క్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ పేరు మినహా మిగతా 12 మందికి స్పెషల్ డ్యూటీ కేటాయించారు. దీనిలో దీర్ఘకాలికంగా పేరుకుపోయిన కుళాయి పన్నులను వసూలు చేయడం ప్రధాన విధి. ప్రతి ఏడాది ఈ తంతు కొనసాగటం షరా మామూలే. అయితే స్పెషల్ డ్యూటీలు కేటాయించినప్పటికీ ఉన్నతాధికారులు ఈ 12 మంది వర్క్ ఇన్స్పెక్టర్లకు కుళాయి పన్నులను వసూలు చేసేందుకు సంబంధించి ఎలాంటి డేటాను ఇవ్వకపోవడం గమనార్హం. దీంతో వారు చేసేదేమీలేక యధావిధి విధుల్లోనే కొనసాగుతున్నారు. జనవరి 31వ తేదీన కమిషనర్ అభిషేక్ అగస్త్య నగరపాలక సంస్థ కార్యాలయంలోని డిబి సెక్షన్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గతంలో కమిషనర్ ఇచ్చిన ఆర్డర్ ప్రకారం రెవిన్యూ సెక్షన్ కు వెళ్లకుండా డిబి సెక్షన్ లోనే ఉన్న వర్క్ ఇన్స్పెక్టర్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పెషల్ డ్యూటీ విధుల్లో భాగంగా పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారంటూ వర్క్ ఇన్స్పెక్టర్లు శ్రీకాంత్, శ్రీనివాస్, పవన్ లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత ఏఈకి షోకాజ్ నోటీస్ జారీ చేశారు. ఇక్కడ విచిత్రం ఏమిటంటే వర్క్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ కు అసలు స్పెషల్ డ్యూటీనే కేటాయించలేదు. అలాంటిది ఆయన ఎలా నిర్లక్ష్యం ప్రదర్శించారో అర్థంకాని పరిస్థితి. ఈ విషయంలో నగర మేయర్ జోక్యం చేసుకోవడంతో 31వ తేదీన వర్క్ ఇన్స్పెక్టర్లకు స్పెషల్ డ్యూటీ లకు సంబంధించి డేటా ఇచ్చారు.

### 13 రోజులకే ఆర్డర్ మారింది..!

జనవరి 18వ తేదీన కమిషనర్ ఇచ్చిన ఆర్డర్లో 12 మంది వర్క్ ఇన్స్పెక్టర్లకు స్పెషల్ డ్యూటీలు కేటాయించగా, వారిలో డిబి సెక్షన్లో దీర్ఘకాలికంగా పనిచేస్తున్న ఇద్దరు వర్క్ ఇన్స్పెక్టర్లు స్వతంత్రరావు, కొండల్ ను రెవిన్యూ సెక్షన్ కు అటాచ్ చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా, తిరిగి 31వ తేదీన ఇచ్చిన ఆర్డర్ లో కొండల్ ను మరల డిబి సెక్షన్ కు కేటాయించారు. ఇది తెలియగానే కార్పొరేషన్ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది ఆశ్చర్యానికి గురయ్యారు. 13 రోజుల తేడాతోనే వర్క్ ఇన్స్పెక్టర్ కొండల్ తిరిగి డిబీ సెక్షన్ కు రావడం గమనార్హం.

### ఏమారుస్తున్న ఘనుడెవ్వరు..?

నగరపాలక సంస్థలోని ఇంజనీరింగ్ విభాగంలో ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు దృష్టి సారించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. స్పెషల్ డ్యూటీలు కేటాయించి డేటా ఇవ్వకపోవడం, అసలు విధులే కేటాయించబడని వర్క్ ఇన్స్పెక్టర్ పేరు చేర్చి కమిషనర్ కు అసలు విషయం తెలియజేయకుండా ఆర్డర్ ఇప్పించి అబాసుపాలు చేయడం వెనుక దాగి ఉన్న కుట్రను తెలియజేస్తోంది. 13 రోజులు తిరగకుండానే ఒక ఇన్స్పెక్టర్ ను సెక్షన్ మార్చి, తిరిగి మరల అదే సెక్షన్లోకి తీసుకురావడం వెనుక ఉన్న ఆ ఘనుడు ఎవరో కార్పొరేషన్ కార్యాలయంలో ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే కింది స్థాయి సిబ్బంది అందరికీ తెలుసు అనేది జోరుగా సాగుతున్న ప్రచారం. నకరపాలక సంస్థ కమిషనర్ అగస్త్య కు వాస్తవాలు తెలియజేయకుండా, ఆయనను ఏమార్చి తాము అనుకున్న విధంగా ఇంజనీరింగ్ విభాగంలో పాలన సాగేలా తిష్ట వేసిన అధికారి తీరు కింది స్థాయి ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుంది. దీనిపై కమిషనర్ పూర్తిస్థాయి దృష్టి సారించి పరిపాలనను చక్కదిద్దని పక్షంలో ఉద్యోగులు మరింత ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉంది.

# తునికాకు సేకరణ పనులు చేపట్టాలి

- టెండర్లు పూర్తిచేయాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



హైదరాబాద్, ఫిబ్రవరి 9 (జనంసాక్షి) : తునికాకు సేకరణ పనులను తక్షణం చేపట్టాలని, టెండర్లు పూర్తిచేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. గిరిజనులు, గిరిజనేతర పేదలకు ఉపాధిని కల్పిస్తున్న తునికాకు సేకరణ పనులను ప్రతి సంవత్సరం జనవరి నాటికే టెండర్ల ప్రక్రియను అటవీశాఖ పూర్తిచేస్తోందని, ఈ సంవత్సరం తాత్సారం చేసిందని, టెండర్ల పనులు పూర్తవలేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో దాదాపు 14 జిల్లాల్లో తునికాకు సేకరణను అటవీశాఖ చేపడుతోందని, దాదాపు 10లక్షల మంది దీనిపై ఆధారపడి లబ్దిపొందుతున్నారని తెలిపారు. లోడింగ్, అన్‌లోడింగ్ తదితర పనులతో పరోక్షంగా వేలాది మందికి ఉపాధి లభిస్తోందని, ప్రతి ఏటా టెండర్ల ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత ఫిబ్రవరిలో ప్రూనింగ్ చేస్తారని తెలిపారు. ఫలితంగా ఎక్కువగా దిగుబడి వస్తుందని, కానీ ఈ పని సకాలంలో జరగలేదు. అటవీశాఖ స్పందించడంలో నిర్లక్ష్యం కన్పడుతున్నది. ఈ సీజన్‌ద్వారా వచ్చే ఆదాయంలో గిరిజనులు అనేక ఆర్థిక కార్యకలాపాలను, శుభకార్యాలను నిర్ణయించుకుంటారు. జాప్యం జరుగుతున్నందువల్ల గిరిజనులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో తునికాకు దొరికే ఏరియాల్లో కార్మికులు, గిరిజనులు ఉపాధి కోల్పోకుండా తక్షణమే చర్యలు చేపట్టాలని, టెండర్లు నిర్వహించకపోతే అటవీశాఖ ద్వారానైనా సేకరించడానికి తగిన ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# గార్లలో సూపర్‌ఫాస్ట్ రైలు ఆగేలా చూడండి

- ఎంపీ వద్దిరాజుకు గార్ల వాసుల విజ్ఞప్తి



హైదరాబాద్, ఫిబ్రవరి 9 (జనంసాక్షి) : రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రను మహబూబాబాద్ జిల్లా గార్లకు చెందిన పలువురు కలిసి మణుగూరు-సికింద్రాబాద్ సూపర్ ఫాస్ట్ రైలు ఇక ముందు కూడా తమ స్టేషన్ ఆగేలా చూడాలని కోరారు.ఎంపీ రవిచంద్రను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ దిండిగాల రాజేందర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ గార్ల మండల శాఖ మాజీ అధ్యక్షుడు పానుగంటి రాధాకృష్ణ, మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్, నాయకులు బుడిగ మురళి,శ్రీరామ్ విజయ్ తదితరులు ఆదివారం మధ్యాహ్నం కలిసి పుష్పగుచ్ఛమిచ్చారు.ఈ సందర్భంగా వారు ప్రతిరోజు మణుగూరు-సికింద్రాబాద్ స్టేషన్స్ మధ్య ఏడాదిన్నరగా నడుస్తున్న సూపర్ ఫాస్ట్ రైలు ఇక ముందు కూడా గార్ల స్టేషన్ లో ఆగే విధంగా తగు చర్యలు తీసుకోవలసిందిగా కోరుతూ ఎంపీ రవిచంద్రకు వినతిపత్రం అందజేశారు.ఈనెల 15వతేదీ నుంచి సూపర్ ఫాస్ట్ రైలును గార్ల స్టేషన్ లో ఆపొద్దని సంబంధిత అధికారులు నిర్ణయించినట్లు తెలిసిందని పేర్కొన్నారు.ఈ సూపర్ ఫాస్ట్ రైలు తమ మండలానికి చెందిన రైల్వే ప్రయాణికులకు చాలా సౌకర్యవంతంగా ఉందని,ఇది గార్ల స్టేషన్ లో ఆగనట్లయితే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.వారి విజ్ఞప్తి పట్ల ఎంపీ వద్దిరాజు సానుకూలంగా స్పందించి రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి రైలు ఇక ముందు కూడా ఆగే విధంగా చూస్తానని హామీనిచ్చారు.

# ముస్లింలతో బీసీలకు పోలికేలా?

- బీసీల్లో ముస్లింలను ఎట్లా చేరుస్తారు?
- బీసీ సంఘాలు ఏం చేస్తున్నాయి?
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ను చిత్తుగా ఓడించండి
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మరోసారి సంచలన వ్యాఖ్యలు




నల్లగొండ, ఫిబ్రవరి 9 (జనంసాక్షి) : "బీసీ జాబితాలో ముస్లింలను ఎట్లా కలుపుతారు? మీ జాతి ఏందన్నా.... మీ అయ్య జాగీరనుకుంటున్నారా? మేం బొట్టు పెట్టుకుంటాం. మాకు జన్మ నక్షత్రం ఉంటుంది. గోత్రనామాలుంటాయి. మొలదారం కట్టుకుంటాం. ఇది మా జాతి. ఒక జాతికి, ఇంకో జాతికి తేడా తెలుసుకోలేని మూర్ఖత్వపు పార్టీ కాంగ్రెస్. అసలు హిందువులకు, ముస్లింలకు పోలికేమిటి? హిందువులు అడుక్కోవాలా? బిచ్చగాళ్లను చేద్దామనుకుంటున్నారా?" అంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. అసలు బీసీ సంఘాలు ఏం చేస్తున్నాయి? ఎవరు అధికారంలో ఉంటే వాళ్లకు వత్తాసు పలుకుతారా? అంటూ మండిపడ్డారు. ఇదే పరిస్థితి కొనసాగితే రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లోనూ బీసీ స్థానాల్లో ముస్లింలు పోటీ చేస్తారు? వారి ఆధిపత్యమే కొనసాగుతుందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అధికారం చెలాయిస్తున్న కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎందుకు ఓటేయాలని ప్రశ్నించారు. ఓట్లు అడిగేందుకు వచ్చే కాంగ్రెస్ నేతలను హామీలెందుకు అమలు చేయలేదో నిలదీస్తూ గల్లాపట్టి అడగాలని పట్టభద్రులు, టీచర్లకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా నల్లగొండ జిల్లా కేంద్రానికి వచ్చిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ బీజేపీ జిల్లా కార్యాలయంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల కార్యశాలలో పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపుపై దిశానిర్దేశం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీపైన, బీసీ సంఘాల తీరుపైన నిప్పులు చెరిగారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సరైన అభ్యర్థులే కరువయ్యారు. దేశ చరిత్రలో అధికార పార్టీకి మంచి అభ్యర్థులు కరువైపోవడం విచిత్రంగా ఉంది. ఈ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటైనయ్. ఆ రెండు పార్టీల మధ్య లోపాయికారీ ఒప్పందం కుదిరింది. కాళేశ్వరం, డ్రగ్స్, ఫార్ములా ఈ రేస్ సహా పలు అవినీతి కేసుల్లో ఇరుక్కుపోయిన బీఆర్ఎస్ నేతలు అరెస్ట్ కాకుండా రక్షించేందుకు కాంగ్రెస్ సిద్ధమైందని, అందుకు ప్రతిఫలంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిని నిలబెట్టకుండా కాంగ్రెస్ ను గెలిపించడమే లక్ష్యంగా బీఆర్ఎస్ పనిచేస్తోంది. రెండు పార్టీలు కలిసి బీజేపీని గెలవనీయకూడదని కుట్ర పన్నాయి. రెండు పార్టీల మధ్య ఒప్పందం లేకపోతే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని ఎందుకు నిలబెట్టలేదో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు.

# తల్లితో సహజీవనం చేస్తూనే.. ఇద్దరు కూతుళ్లతో పాడు పని..



సూర్యాపేట, ఫిబ్రవరి 9 (జనంసాక్షి) : సూర్యాపేటలో దారుణ ఘటన వెలుగు చూసింది. కట్టుకున్న భార్య చనిపోవడంతో పరాయి మహిళతో సహజీవనం చేస్తున్న ఓ ప్రబుద్ధుడు.. ఆమె కూతుళ్లపై సైతం అత్యాచారానికి పాల్పడ్డాడు. తండ్రి స్థానంలో ఉండి కూడా ఆడపిల్లలపై దారుణానికి పాల్పడిన ఈ దుర్మార్గుడు.. ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు కావడం గమనార్హం. ఇద్దరు బాలికలపై అత్యాచారానికి ఒడిగట్టిన దుర్మార్గుడికి హెచ్ఐవీ పాజిటీవ్ గా తేలడంతో ఈ దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. దీంతో.. ఈ ఘటన తీవ్ర సంచలనంగా మారింది.

సూర్యాపేటకు చెందిన జాటోత్ సునీల్ కుమార్ ప్రభుత్వ హైస్కూల్లో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. పది మందికి సంస్కారం, విలువలు చెప్పాల్సిన ఈ వ్యక్తి.. కనీస సమాజ విలువలు లేకుండా ప్రవర్తించాడు. మనిషి అని మర్చిపోయి, మృగంలా మారిపోయాడు. తన భార్య చనిపోవడంతో స్థానికంగా మరో మహిళతో అక్రమ సంబంధం కొనసాగిస్తున్నాడు. ఆ మహిళ సైతం.. భర్తను విడిచిపెట్టి నగరానికి వచ్చి ఉంటోంది. ఆమెకు అప్పటికే ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. వారంతో సూర్య పేటలో నివసి స్తుండగా, ఆ మహి ళకు దగ్గరైన సునీల్ కుమార్.. తరచూ వాళ్లింటికి వచ్చి వెళు తుండే వాడు. సునీల్ కుమార్ వ్యవహారం 2018 నుంచి నడుస్తోంది. భర్త తోడు లేకుండా సిటీలో ఉంటున్న మహిళ కూడా అతనిపై ఆధారపడి ఉండడంతో.. వ్యవహారం సాగిపో తుంది. కానీ.. ఈ దుర్మార్గుడు.. తనలోని నీచ త్వాన్ని బయటపెట్టుకున్నాడు. సదరు మహిళతో సహజీవనం చేస్తూ.. ఆమె ఇద్దరు ఆడపిల్లలు వరుసకు కూతుళ్లు అవుతారనే ఇంగిత జ్ఞానం కోల్పోయాడు. తల్లి ఇంట్లో లేని సమయాల్లో వారిని లొంగదీసుకున్నాడు. వారిపై తరచూ అత్యాచారా నికి పాల్పడుతూ.. ఆ విషయం వారి తల్లికి చెబితే చంపేస్తానని బెదిరించాడు. దాంతో.. ఆ బాలికలు ఈ దారుణాన్ని వాళ్లమ్మకు చెప్పకుండా ఆగిపో యారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఈ వ్యక్తి.. పిల్లల్ని జాగ్రత్తగా చూసుకోవాల్సింది పోయి వారిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అంతే కాక.. ఆ బాలికలకు 19, 15 ఏళ్ల వయసే కావడం గమనార్హం. చిన్న వయసులోని బాలికల్ని, తండ్రి స్థానంలోని వ్యక్తి ఇంతటి దారుణానికి ఒడిగడతాడని ఎవరూ ఊహించలేదు. కానీ.. ఇలాంటి ఘటన జరగడంతో అంతా సునీల్ కుమార్ పై దుమ్మెత్తిపోస్తున్నారు.

### నిందితుడికి ఎయిడ్స్ నిర్ధరణ..

బాలికలపై దారుణానికి పాల్పడిన ప్రబుద్ధుడికి ఎయిడ్స్ సోకినట్లు నిర్ధరణ అయ్యింది. ఇటీవలే వైద్య పరీక్షలు చేయించుకున్న సునీల్ కుమార్ కు హెచ్ఐవీ ఎయిడ్స్ సోకినట్లుగా తెలిసింది. ఈ విషయం బాలికలకు తెలియడంతో తీవ్రంగా బయటపడిపోయారు. తనకూ ఆ వ్యాధి సోకుతుందని ఆందోళన చెందారు. దాంతో.. వారిపై గత కొన్నాళ్లుగా జరుగుతున్న దారుణాన్ని తల్లి దృష్టికి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న తల్లి ఆశ్చర్యపోయింది. ఇన్నాళ్లు తనకు తెలియకుండా జరుగుతున్న దారుణానికి ఉలిక్కిపడింది. ఆ దుర్మార్గుడిని ఎలాగైనా శిక్షించాలని, అతడు చేసిన దారుణాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లింది.దాంతో.. పోలీసులు ప్రభుత్వ ఉపాధ్యాయుడు సునీల్ కుమార్ పై కేసు నమోదు చేశారు. పోక్సో యాక్ట్ కింద అతనిపై పలు సెక్షన్లు మోపారు.

# కన్నీటితో నమ్ముకున్న భూమికి వీడ్కోలు

- మూడు గ్రామాల్లో రైతుల లడాయి సమాప్తం
- కోర్టు కేసులు వారి పాలిట శాపం
- నెరవేరిన ప్రభుత్వ లక్ష్యం
- ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు లైన్ క్లియర్...





వికారాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 9 (జనం సాక్షి) : వేదనలు రోదనల మధ్య ప్రజా ప్రతినిధులకు శాపనార్థాలు పెడుతూ రైతులు భూమాతకు తుది వీడ్కోలు ఇచ్చి తప్పుకుంటున్నారు. వచ్చే ఖరీఫ్ రబ్బి సీజన్ నాటికి రైతుల భూములు వారి చేతుల్లో ఉండవనే విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. నయాన నో భయాన నో రైతులను దారికి తెచ్చుకొని అధికారులు భూ సేకరణ తంతు వేగవంతం చేశారు. గుండె నిండా భారం కడుపునిండా పుట్టెడు దుఃఖంతో కన్నీటి పర్యంతమవుతూ రైతులు భూములను వదులుకుంటున్నారు. కడసారిగా భూమాతకు తుది వీడ్కోలు పలుకుతున్నారు. నిన్నటి వరకు పొలాల గట్ల మధ్య సాగిన జీవన వైవిద్యం ఇకనుంచి వారికి కనిపించదు. పచ్చని పొలాల మధ్య ఇండస్ట్రియల్ కారిడార్ ప్రాజెక్ట్ ఒక వెలుగు వెలగనుంది. వివరాల్లోకి వెళితే వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల హకీంపేట రోటి బండ తండ రైతుల పరిస్థితి ఇది. గత మూడు రోజులగా ఇండస్ట్రియల్ కారిడార్ ప్రాజెక్టు నిర్మాణం కోసం పోలీస్ బందోబస్తు మధ్య రెవెన్యూ యంత్రాంగం భూ సేకరణ కార్యక్రమం చేపట్టింది. రైతుల పట్టా భూమి జోలికి వెళ్లకుండా ప్రభుత్వ భూములను గుర్తించి భూ సర్వే నిర్వహించి హద్దులు నమోదు చేసి భూ సేకరణ చేపట్టే కార్యక్రమాన్ని అధికార యంత్రాంగం వేగవంతం చేసింది. ఇప్పటివరకు అధికారులు 249.26 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించారు. ఈ కారిడార్ నిర్మాణం కోసం 650 ఎకరాలు అవసరం ఉంటుందని ప్రభుత్వం అంచనా వేసింది. లగ చర్ల రోటిబండ గ్రామ శివారులో సర్వే నంబర్లు102.117.120.121. లో110.32 ఎకరాలు గుర్తించగా హకీంపేట గ్రామంలో సర్వే నంబర్237. నుండి 251 వరకు భూ సర్వే నిర్వహించి 146.34 ప్రభుత్వ భూమిని గుర్తించారు. ఈ గ్రామంలో సర్వే నంబర్ 187 కు అధికారులు మినహాయింపు ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. తాత ముత్తాతల నాటి నుంచి సాగు చేసుకుంటూ జీవనోపాధి గడుపుతున్న రైతులు ఇప్పుడు భూములు వదులుకోవడాన్ని జీర్ణించు కోలేకపోతున్నారు. గుండెల్లో పుట్టెడు దుఃఖాన్ని దిగమింగుకొని సర్వే సందర్భంగా భూములు వదిలేసి ఇంటి దారి పట్టారు. నిన్న మొన్నటి వరకు పొలాల గట్ల మధ్య అలసి సొమ్మసిల్లిపోయి పలకరింపుల మధ్య వ్యవసాయం చేసిన రైతులు భూముల వదులుకోవడానికి ఇష్టం లేకపోయినా తప్పనిసరి పరిస్థితిలో భూములు వదులుకొని బతుకుదెరువు కోసం కొత్త మార్గాన్ని అన్వేషించే పనిలో పడ్డారు. మూట ముల్లె సర్దుకొని బత్యం కట్టుకొని బతుకుదెరువు కోసం పట్టణాలకు వలస వెళ్లే పనిలో పడ్డారు. గద్దెనెక్కిన పెద్దలు సమస్యను సమరస్యంగా పరిష్కరించకుండా సమస్యను మరింత జటిలం చేసి అధికారులను పురమాయిస్తే తమ గోడును ఎవరికి చెప్పుకోవాలో తెలియక వలస బాట పట్టినట్లు కొందరు గిరిజనులు తెలియజేశారు. కాగా ఇప్పటివరకు జరిగిన సంఘటనలపై రైతుల మెడకు కోర్టు కేసులు ఉన్నాయి. అవి వారి పాలిట శాపంగా మారాయి. వారు భూములు వదులుకున్న ఇప్పటివరకు జరిగిన సంఘటనలపై రైతులు న్యాయ విచారణ ఎదురుకోవలసిన గత్యంత ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇండస్ట్రియల్ కారిడార్ కోసం రైతుల భూములు ప్రభుత్వానికి అప్పగించడానికి సమ్మతించిన కారణంగా ఇప్పటివరకు రైతులపై నమోదైన కేసులను ప్రభుత్వం బే షరతుగా కేసులను ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం కేసులు ఉపసంహరిస్తే వలస వెళ్లిన పట్టణాల్లో తన జీవన ఉపాధి సాఫీగా సాగుతుందని అన్నారు. కేసుల కారణంగా కోర్టు ఇచ్చిన గడువు ప్రకారం వలస వెళ్లిన తప్పనిసరిగా కోర్టుకు హాజరు కావలసిన పరిస్థితి నెలకొంటుందని ఫలితంగా రవాణా ఖర్చులు వృధా కావడమే కాకుండా రోజు పని చేసుకునే అవకాశం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సకాలంలో నిధులు సమకూరుస్తే కొడంగల్ నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ కారిడార్ ప్రాజెక్ట్ ఒక వెలుగు వెలగనుంది.


# ఒక వైపు ఎస్సీ వర్గీకరణ.. మరొక వైపు బీసీ కులగణన..

- అన్నివర్గాలకు సామాజిక న్యాయం కాంగ్రెస్ తోనే సాధ్యం..
- దశాబ్దాల డిమాండ్లను పరిష్కరిస్తూ చరిత్రలో నిలిచే విధంగా సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయాలు : నీలం మధు ముదిరాజ్..
- ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణనతో సమన్యాయం సాధ్యం: షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..



నందిగామ, ఫిబ్రవరి 9 (జనంసాక్షి) : దశాబ్దాలుగా సుదీర్ఘమైన డిమాండ్లను పరిష్కరిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు చరిత్రలో నిలిచిపోయే విధంగా నిర్ణయాలు తీసుకున్నారని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఆదివారం షాద్ నగర్ నియోజకవర్గం నందిగామ మండల కేంద్రంలో ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణన అసెంబ్లీలో ఆమోదం పొందిన సందర్భంగా నిర్వహించిన ర్యాలీ, సంబరాలో షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ మాదిగ జాతి సోదరుల చిరకాల డిమాండ్ అయిన ఎస్సీ వర్గీకరణ ఒకవైపు, బీసీలకు రాజకీయంగా లబ్ధి చేకూర్చేందుకు బీసీ కులగణన మరోవైపు నిర్వహించి సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మరోసారి రుజువైందన్నారు. బీసీలకు విద్యాపరంగా రాజకీయపరంగా అవకాశాలను పెంపొందించేందుకు నిర్వహించిన బీసీ కులగణన సర్వేలో కేసీఆర్ ఆయన కుటుంబ సభ్యులు ఎందుకు పాల్గొనలేదని ప్రశ్నించారు. బీసీలు రాజకీయంగా ఎదగడాన్ని ఓర్వలేకనే బిఆర్ఎస్ పార్టీ బీసీ కుల గణన సర్వేపై అవాకులు చవాకులు మాట్లాడుతున్నారని విమర్శించారు. కెసిఆర్ కుటుంబం సర్వేలో వివరాలు ఎందుకు నమోదు చేయలేదో కారణం తెలంగాణ ప్రజానీకానికి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన ఆరు నెలల్లోనే తెలంగాణ ప్రభుత్వం ఏకసభ్య కమిషన్ ద్వారా సమగ్ర అధ్యయనం చేయించి అసెంబ్లీ వేదికగా ఎస్సీ వర్గీకరణకు శ్రీకారం చుట్టిందని వివరించారు. అన్ని వర్గాలకు సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని అందుకు తగినట్లుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయాలు తీసుకుంటూ బలహీనవర్గాల అభ్యున్నతి కోసం విశేషంగా కృషి చేస్తున్నారని కొనియాడారు. షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ బీసీల దశాబ్దాల పోరాటంతో బీసీ కులగణన, మాదిగల చిరకాల కోరిక ఎస్సీ వర్గీకరణ బిల్లును కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం తెలంగాణ అసెంబ్లీలో ఆమోదించడం హర్షనీయమన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
10 ఫిబ్రవరి 2025
తెలంగాణ




# ఎన్నికలు మ్యూజికల్ చైర్ అయ్యాయి!

భారత దేశంలోలో ఎన్నికలు మ్యూజికల్ చైర్ అయ్యాయి. సామ, దాన,దండోపాయలు అంటే మొత్తంగా ఓటర్లను మభ్యపెట్టడం, అంగ బలం, ఆర్థిక బలం, సామాజిక అంశాల సమాహారం, అంతా ఇప్పుడు ఎన్నికల్లో పని చేస్తున్నాయి. ఎన్నికల్లో గెలువాలంటే ఏమైనా చేయాలి. కులం, మతం, మందిర్, మస్జిద్, చర్చ్ గురుద్వారా, ఎలా అన్నింటి సపోర్ట్ తీసుకోవాలి. ఎలా విద్వేషాలను రెచ్చగొట్టాలి! అందుకు సంబంధించిన విద్వేషపు స్క్రిప్టెడ్ స్పీచ్ ప్రచారం టూల్ కిట్ ను చేర్చడం, మొత్తం పార్టీ, పార్టీ సపోర్ట్ సంస్థలను, యూట్యూబ్ లను ఇతర మాధ్యమాలను అలర్ట్ చేయడం, మూడ, అమాయక జనం నమ్మే, విశ్వసించే, భారీగా దొంగ బాబాల మద్దతు తీసుకోవడం, చేస్తారు.

జైలు నుంచి ఎన్నికల రంగంలోకి.. వారు ఎక్కడున్నా రప్పిస్తారు!యువతుల రేప్ కేసులో, ఒక జర్నలిస్టు హత్య కేసులో జైలులో యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్న, గుర్మిత్ అలియాస్ రామ్ రహీం అలియాస్ డెరబాబా లాంటి వారిని జైలు నుంచి పెరోల్ మీద తీసుకుని వచ్చి, అతని బాబా బయటికి వచ్చి బీజేపీకి మద్దతు పలికాడు. గుజరాత్ లో బీజేపీ బిల్కిస్ బాను కేసులోని 11మంది శిక్ష అనుభవిస్తున్న వారిని జైలు నుంచి క్షమాభిక్ష ఇచ్చి విడుదల చేయించిన తర్వాత, మళ్ళీ కోర్టు ఆదేశాల అనంతరం జైలు కు పంపారు. వీళ్ళను కూడా ఎన్నికల్లో బీజేపీ వాడుకున్నది. తమ వేదికలు ఎక్కించింది. ఉపన్యాసాలు ఇప్పించింది. వారు జైలు నుంచి విడుదల అయినపుడు వారికి హారతులు పట్టారు.

**ఏటా రెండు కోట్ల ఉద్యోగాల పేరిట అధికారంలోకి!**

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సంవత్సరానికి రెండుకోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి గడచిన 11 ఏండ్ల లో 22 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాలి, కానీ ఈ 11 ఏండ్ల లో కనీసం కోటి ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు. పకోడీలు అమ్మడం కూడా ఉపాధి కదా అంటారు నరేంద్ర మోడీ! దేశంలో అసలు సమస్యగా ఉన్న నిరుద్యోగం కు సంబంధించి, రాష్ట్ర ప్రభుత్వాలు ( విపక్ష ప్రభుత్వాలు) ఒకరి మీద ఒకరు భక్తుల ద్వారా ఓట్లు వేయించే పరిస్థితి కూడా ఉన్నది. హర్యానా, పంజాబ్, మొన్న డిల్లీ ఎన్నికల అప్పుడు, మధ్యప్రదేశ్ ఎన్నికల సందర్భంగా ఈ ఉద్యోగాలకు సంబంధించి ఆరోపణలు చేసుకోవడం తప్ప ఆచరణలో చిత్తశుద్ధి లేదు! రెండు లక్షల ఉద్యోగాలు ఏవి అని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి నీ కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశ్నిస్తారు!ధరలు భారీగా పెరుగుతున్నప్పటికి పట్టింపు లేదు!

**రూపాయి విలువపై మాట్లాడని మోడీ!**


రూపాయి విలువ పడిపోతున్నప్పటికి ఒకప్పుడు రూపాయి విలువ మీద రాద్ధాంతం చేసిన పీఎం మోడీ ఆ వైపు కూడా చూడనట్లు చేస్తున్నారు.మన వాళ్ళను అక్రమంగా చొరబడి ఉద్యోగాలు చేస్తున్నారని, చేతులకు గొలుసులు, కాళ్ళకు బేడీలు వేసి మన ఇండియాకు అమెరికా తరలించినప్పటికి నోరుమెదుపని పీఎం ఈనెల 13 న అమెరికా అధ్యక్షులు ట్రంప్ తో భేటీ కానున్నారు.డిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన జోష్‌లో విదేశీ పర్యటనకు పీఎం మోడీ వెళుతున్నారు. ఇటీవల మధ్యతరగతి కుటుంబాలకు 12 లక్షల ఆదాయం కు సంబంధించి ఐటి మినహాయింపు ఇచ్చారు. మరి జిఎస్టి సంగతి ఏమైందీ? ఈ మోత ఇంకా ఎన్నాళ్ళు?

**రైతుల బతుకుల్లో మార్పు ఏది?**

రైతుల బతుకుల్లో మార్పు లేదు, వారి ఆదాయం డబుల్ చేస్తామని చెప్పిన హామీ అమలు ఏది? మోడీజీ? కార్పొరేట్లకు 16 లక్షల కోట్ల రుణ మాఫీ ఇస్తారు. రైతులకు అప్పు మాఫీ, పంటకు గిట్టుబాటు ధరలు లేవు! సామాన్యు నికి విద్య, వైద్యం అందించడం లో మీద శ్రద్ధ లేదు! కేవలం ఎన్నికలు, వాటిని గెలువడం, అనంతరం దోచుకో వడం, షరా మామూలు అయిపోయింది. ప్రజలు అటు రాష్ట్రాల్లో అయిన, కేంద్రం లో అయినా తమ పాలనలో సంతృప్తి గా ఉన్నారా, లేదా అని పరిశీలించేది లేదు! జనం ను కలిసేది లేదు. వారి సమస్యలు పరిష్కరించేది లేదు! ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలు, గ్యారంటీ లు అమలు చేసేది లేదు! ఇదీ పార్టీల వ్యవహారం, అధికారం మీద వ్యామోహం! ఎంత కాలం ఇలా? నైతికత లేని, ఒక నీతి నియమం లేని, మభ్య పడి పోయి, లొంగిపోయి, డబ్బు, ఉచితాలకు లొంగి పోయే ఓటరు తీర్పులను అక్కడక్కడ చూసి ఓటు సిగ్గుపడు తున్నది! అవినీతి గెలుస్తున్నదని, మ్యూజికల్ చైర్ ఆందోళన పడుతున్నది. అన్ని ఆటలు బేఇమాన్ అయిపోయాయి అంటూ కుర్చీ ఆవేశంతో ఊగిపోతూ ఉన్నది ! ఇంతకన్నా నేను ఏమి చేయగలను అంటున్నది!



ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు,
9951865223,



## గూట్లో చిక్కుకున్న ప్రేమ పక్షి!

ప్రేమగా ప్రేమించాను
ప్రేమే జీవితమనుకున్నాను
అందుకే ప్రేమించిన వాడినే పెళ్లాడాను

పెళ్లయ్యాకే తెలిసింది,
అది ప్రేమ కాదని!
అది తెలిసొచ్చేనాటికి,
ఓ రెండేళ్ల పాప చేతికొచ్చింది

పొద్దు పొడవక ముందే సాన్పేసి,
పొద్దు పొయినాక గుల్లెడు రొట్టెలు గొట్టి,
రోజంతా గుండెల్లో గునపాలు దింపుకొని,
సాపైన పతంగికి మల్లె నా జీవితం,
దినదినం దిగులు దివిటీలార్పుకొని
దిగజారిపోయింది

చదువుకున్నది పదే అయినా,
ఏం చేయాలో తెలియని అయోమయం
స్వేచ్ఛగా ఉండాల్సిన నా జీవితం,
ఓ రాక్షసుడి చేతిలో నలిగిన చీమయిపోయింది

తండ్రిని – తల్లి వదిలేసి చాన్నాళ్లైంది,
తండ్రి ఇంకొకరిని పెళ్లాడీ చాన్నాళ్లైంది
ఇలా నా జీవితం అగమ్యగోచరమైంది

తాతయ్య నాయనమ్మలు ఉన్నా,
లేనట్టే తోచింది
ఎండిపోతున్న చెట్టుకి నీళ్లు పోసే వాడే
ప్రేమికుడని నమ్మాను,
ఫలాలు పండాకే తెలిసింది,
అంగట్లో నన్ను అమ్మే వ్యాపారస్తుడని
మోసపోయానని తెలిశాక,
ఈ గందరగోళ జీవితాన,
నాకు దిక్కేది, దారేది?
ఆడపిల్లగా పుట్టి పెద్ద పాపమే
చేశాను,
అందునా అంటరాని అతివగా
విడాకుల చిట్టా విసిరి,
విడివడుటే మిగిలింది



మౌనిక నీరుడి
9059945330

## అమెరికాలో ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌తో స్వేచ్ఛా భావవ్యక్తీకరణకు ముప్పు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల హమాస్ మద్దతుదారులను దేశం నుండి బహిష్కరించేందుకు ఒక కార్యనిర్వాహక ఉత్తర్వు (ఎగ్జిక్యూటివ్ ఆర్డర్)ను జారీ చేశారు. యూద్ వ్యతిరేకతను (యాంటీ సెమిటిజమ్) అరికట్టేందుకు తీసుకున్న ఈ నిర్ణయం విదేశీ విద్యార్థుల వీసాలను రద్దు చేసి, పాలస్తీకు మద్దతుగల నిరసనల్లో పాల్గొన్న వారిని పంపించివేయాలనే నిబంధనలను కలిగి ఉంది. ఈ ఉత్తర్వు అమెరికాలోని పౌర హక్కుల సంఘాలు, న్యాయ నిపుణుల, అంతర్జాతీయ విశ్లేషకుల తీవ్ర విమర్శలను ఎదుర్కొంటోంది. హమాస్ మద్దతుదారులుగా గుర్తించిన వారిని అమెరికా నుండి బహిష్కరించే అధికారాన్ని ఫెడరల్ ఏజెన్సీలకు ఇచ్చారు. విదేశీ విద్యార్థులు, వీసాలపై ఉన్న ఇతర వ్యక్తులు పాలస్తీనాకు మద్దతుగల నిరసన ప్రదర్శనలలో పాల్గొంటే, వారి వీసాలను రద్దు చేసి బహిష్కరించనున్నారు.

**పౌరహక్కుల సంఘాల తీవ్ర వ్యతిరేకత:**

ఈ ఉత్తర్వుపై పౌర హక్కుల సంఘాలు తీవ్రంగా స్పందించాయి. అమెరికాలోని ప్రముఖ ముస్లిం హక్కుల సంస్థ "కౌన్సిల్ ఆన్ అమెరికన్–ఇస్లామిక్ రిలేషన్స్" (సీఏఐఆర్) ఈ ఉత్తర్వును ప్రజాస్వామ్య విరుద్ధమని, ఇది రాజకీయ వ్యతిరేకులను అణచివేయడానికి ఉపయోగపడుతుందని విమర్శించింది. విద్యార్థుల వీసాలను రద్దు చేయడం ప్రభుత్వానికి నచ్చని భావజాలాన్ని అణిచివేసేందుకు మార్గం చేస్తుందని ఫౌండేషన్ ఫర్ ఇండివిడ్యువల్ రైట్స్ ఇన్ ఎడ్యుకేషన్ (ఎఫ్ఐఆర్) సంస్థ హెచ్చరించింది. అమెరికా విశ్వవిద్యాలయాలలో స్వేచ్ఛాయుత భావవ్యక్తీకరణను నిలువరించేందుకు ఈ నిర్ణయం దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**చట్టపరమైన నిపుణుల అభిప్రాయాలు:** కొలంబియా యూనివర్సిటీకి చెందిన నైట్ ఫస్ట్ అమెండ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్ఎఫ్ఏఐ) న్యాయవాది కెరీ డెసెల్ ఈ ఉత్తర్వును రాజ్యాంగ విరుద్ధమని అభివర్ణించారు. విదేశీయులను వారి రాజకీయ అభిప్రాయాల కారణంగా బహిష్కరించడాన్ని సుముఖంగా చూస్తే, అది అమెరికా రాజ్యాంగంలోని మొదటి సవరణ హక్కులను ఉల్లంఘించడం అవుతుందని న్యాయ నిపుణులు అంటున్నారు.

**అంతర్జాతీయ మీడియా స్పందన:** ఈ ఉత్తర్వుపై అంతర్జాతీయ స్థాయిలో తీవ్ర విమర్శలు వచ్చాయి. "ది గార్డియన్"పత్రిక : ఈ వార్తాపత్రిక ప్రకారం, ఈ ఉత్తర్వు విశ్వ విద్యాలయాలలో రాజకీయ స్వేచ్ఛను కోల్పోయేలా చేస్తుందని తెలిపింది. **"టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్" పత్రిక:** ఈ నిర్ణయం పర్యవసానంగా విదేశీ విద్యార్థులు తమ వీసాలను కోల్పోయే ప్రమాదం ఉందని పేర్కొంది. "అల్–జజీరా" నివేదిక: దీని ప్రకారం, అమెరికా రాజ్యాంగం మానవ హక్కుల పరిరక్షణను ప్రోత్సహిస్తుంది కానీ, ఈ ఎక్జిక్యూటివ్ ఆర్డర్ మానవ హక్కులకు వ్యతిరేకంగా పనిచేస్తుందనే విమర్శలు వచ్చాయి. ఈ ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులు విద్యాసంస్థలలో స్వేచ్ఛాయుత, భావవ్యక్తీకరణను అణిచివేయడానికి దారి తీస్తుందని విశ్వవిద్యాలయ వర్గాలు ఆందోళన వ్యక్తం చేశాయి. విద్యార్థులు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా ప్రకటించడానికి భయపడే పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉంది. విశ్వవిద్యాల యాలు స్వేచ్ఛగా వివిధ భావజాలాల ను చర్చించే వేదికలుగా ఉండాలి. కానీ, ఈ నిర్ణయం వల్ల ఆ స్వేచ్ఛ కోల్పోతుందని విశ్లేషకులు హెచ్చరిస్తు న్నారు. విదేశీ విద్యార్థులు తమ అభిప్రాయాలను వ్యక్తపరిస్తే,లేదా ప్రదర్శిస్తే, వీసా రద్దు, బహిష్కరణ వంటి బెదిరింపులు తలెత్తే అవకాశముందని విశ్వవిద్యాలయ నిపుణులు పేర్కొన్నారు. ట్రంప్ తీసుకున్న ఈ ఉత్తర్వు అమెరికాలో భావప్రకటనా స్వేచ్ఛకు, విద్యాసంస్థల స్వేచ్ఛా స్వాతంత్ర్యానికి భయానక ముప్పుగా మారిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. యూద్ వ్యతిరేకతను అరికట్టాల్సిన అవసరం ఉన్నా, అది స్వేచ్ఛా భావవ్యక్తీకరణను అణచివేసే విధంగా మారడం ప్రమాదకరం. ఈ ఉత్తర్వు ద్వారా అమెరికా తన ప్రజాస్వామ్య విలువలకు వ్యతిరేకంగా వెళ్తుందని విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి. ఇప్పటికైనా భావస్వేచ్ఛను పరిరక్షించే దిశగా ఈ ఉత్తర్వును సమీక్షించాలని పౌర హక్కుల సంఘాలు, న్యాయ నిపుణులు అమెరికా ప్రెసిడెంట్ డోనాల్డ్ ట్రంప్ ను డిమాండ్ చేస్తున్నారు.


డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్,
9849328496.

## ఆదర్శ జీవులు!

ఆలోక్ సాగర్
రిటైర్డ్ ప్రొఫెసర్
అమెరికా హుస్టన్
యూనివార్సిటీ
పి హెచ్ డి గ్రహీత!
రఘురామ్ రాజన్
రిజర్వు బ్యాంక్
మాజీ గవర్నర్!
ప్రొఫెసర్ ఆలోక్ వద్దే
చదువుకున్నాడు!
ఆలోక్–భారత్ ఇచ్చే
పద్మశ్రీ తిరస్కరణ!
మధ్య ప్రదేశ్ లోని
ఆదివాసీల సేవకే
జీవితం సమర్పణ!
అది ఆయన ఆదర్శం
పద్మశ్రీ కంటే ముందు
ప్రజలకు'సేవ'చేయటం
ముఖ్యమనుకున్నాడు!
కొనసాగిస్తున్నాడు!
అవార్డులు రివార్డులు
వేదికలు కండువాలు
మురిపించలేదు!
లక్ష్య సాధనకు అవి
ఆటంకమనుకున్నాడు!
మణిపూరే కాదు
దేశమంతా నేడు
ఆదివాసీ సమస్య
అగ్నిహోత్రమై
మండుతోంది!
భౌగోళికంగా
నా దేశం గొప్పది!
కవులు పొగిడారు
కవిత్వమల్లారు!
సంతోషించాము!
ఆర్థిక రాజకీయ
సామాజిక సాంస్కృతిక
రంగాలలో మాత్రం
భారత దేశాన్ని
ఎవ్వరు పొగడలేదు!
అడవులు మైదానాలు
భూములు సంపదలు
దోచుకు తినేవాళ్ళు!
పోరాడే వాళ్ళను
మట్టుబెట్టే 'కగార్ '!
అదే 'ఆలోక్' బాధ
దోపిడి రాజకీయం!
ఆర్థిక దోపిడి!
నిచ్చెనమెట్ల
కుల వ్యవస్థ!

-తమ్మినేని అక్కిరాజు

# భాస్కర కిరణాలు




*తెలుగు పద్యానికి 1000 ఏళ్లకు పైబడిన చరిత్ర ఉంది. పద్యం తెలుగు వాడి సంపద,సంతకం అంటారు. అది పేదవాడి సంగీతం అని కూడా అంటారు. ఇలా తెలుగు పద్యాన్ని గురించి ఎన్నో విషయాలు చెప్పుకోవచ్చు. పిల్లల్లో మన భాషా సంస్కృతుల పట్ల, నాగరికత పట్ల అవగాహనను, నైతిక విలువలను పెంపొందించడానికి చిన్నతనంలో శతక పద్యాలను నేర్పేవారు. తద్వారా పిల్లలు చిన్నప్పటి నుండే నేర్చుకున్న పద్యాల స్ఫూర్తి ద్వారా కాలక్రమేణ ఉత్తమ పౌరులుగా రాణించేవారు. కనుక వ్యక్తిత్వ వికాసంలో పద్యం చూపిన పాత్ర గణనీయమైనది.*

ఈ నేపథ్యంలో నేటికీ ఎన్నో పద్య కావ్యాలు, శతకాలు వెలువడుతూనే ఉన్నాయి. ఆధునిక భావజాలానికి పద్యం వాహిక కాలేదని కొందరు అభిప్రా యపడినా పద్య కావ్యాలు మాత్రం వస్తూనే ఉన్నాయి. త్రిలింగ దేశం గా పేరొందిన తెలుగునాట తెలంగాణలోని కాళేశ్వరానికి చెందిన మిత్రులు, విశారదులు డాక్టర్ మాడుగుల భాస్కర శర్మ గారు ఇప్పటికే 2007లో శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర శతకాన్ని రచించి, కిరణశ్రీ అనే ఖండకావ్యాన్ని వెలువరించారు. అవి భాస్కర కిరణాలై పాఠకులను ప్రభావితం చేస్తున్నాయి. భాస్కర శర్మ గారి నివాసమైన కాళేశ్వరంలో గోదావరి, ప్రాణహిత, సరస్వతీ నదుల త్రివేణి సంగమం లాగా వారి కిరణశ్రీ దైవప్రీతి, దేశభక్తి,సామాజిక అనురక్తి సంగమంగా సాగుతోంది. 101 పుటలతో కూడిన ఈ కావ్యం లో షోడశోపచారాల లాగా 16 ఖండికలు ఉన్నాయి. శర్మగారు పద్య రచనల్లో చేయితిరిగిన కవి కావడం వల్ల పద్యాలు అలవోకగా సాగాయి. తెలుగు, హిందీ, సంస్కృత భాషలు ముప్పేటగా ఆయనలో ముడి వేసుకున్నాయి. వృత్తిరిత్యా నవోదయలో హిందీ భాష ఉపాధ్యాయులుగా పనిచేసి జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా పురస్కారాన్ని పొందారు. ఆకాశవాణి వరంగల్, ఆదిలాబాద్, హైదరాబాద్ కేంద్రాల ద్వారా వారి కవితలు ప్రసారం అయ్యాయి, తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జరిగిన కవి సమ్మేళనాలలో వారు పాల్గొని తమ కవితల్ని వినిపించి సన్మాన సత్కారాలు పొందారు. హిందీ– తెలుగు కవిత్వాన్ని తులనాత్మకంగా పరిశోధన చేసి డాక్టరేట్ డిగ్రి అందుకున్నారు. ఈ కావ్యం ఆరంభంలోనే అటు ఇష్టదేవతారాధన, ఇటు వస్తు సూచన చేయటం గమనార్హం. మలిన హరము, ధర్మయుతము, అజ్ఞానహరము అయిన కిరణశ్రీ ప్రాతఃస్మరణం అయింది. గణపతి, సరస్వతి దేవి స్తుతులను చేసిన కవి భరత మాతను స్తుతిస్తూ, అమ్మ నీ ప్రేమ వాత్సల్య మందచేసి, కన్న బిడ్డలను ఎప్పుడు కలిసి ఎప్పుడ, సిరులు కీర్తియు నందనాశీస్సు లిచ్చి చల్లగా చూసి రక్షించు తల్లి మమ్ము. అని సమాజ ప్రతినిధిగా వేడుకుంటాడు. కలిసిమెలిసి ఉన్నప్పుడే కదా కలిమి బలిమి. కవి జాతీయ సమైక్యత భావానికి ఇదొక ఉదాహరణ. మానవుడు శాస్త్ర సాంకేతిక రంగాలలో సాధించిన ప్రగతి వల్ల చంద్రమండల యాత్రనే కాదు చివరకు మన దేశం నుండి చంద్రయాన్ వరకు ప్రయోగాలు సాగాయి అయితే ఈనాడు మనిషి సాధించిన పురోగతి వల్ల సముద్రంలో చేపలా ఈదినా, ఆకాశంలో పక్షుల ఎగిరినా, మనిషి నేలపై మనిషిగా మనుగడ సాగించలేకపోతున్నాడని ఆవేదన పడుతూ, నేల మీద చాలా నేరములను చేసి, చంద్ర తలము వరకు సాగి వచ్చి, చెడును గగన సీమ చేర్చి నా మేనును కలుషితంబు చేయు తలపుతోడ అని జాబిల్లి ఆత్మకథలో భావుకంగా వినిపించారు. పర్యావరణ స్పృహను పంచిన పద్య ఖండిక ఇది. నాలుక నానారకాల సమస్యలు సృష్టిస్తుంది. జిహ్వాచాపల్యం అనారోగ్య కారణము అవుతుంది. నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది అని సామెత. పరులను తిట్టకుండా పరపక్షము చేరకుండా వాక్కును అదుపులో పెట్టుకుంటే విజయేందిర వాని వరించు నాలుక అన్నాడు. అలాగే నాలుగు గొప్పతనాన్ని గురించి వర్ణిస్తూ మానవుల కోవెలలో వసించు దేవత అని స్తుతించాడు. తేదీ 20-10-2000 న బమ్మెర గ్రామంలో నిర్వహించిన పోతన జయంతి ఉత్సవాలలో పాల్గొన్న భాస్కర శర్మ ఆ కవిని స్తుతిస్తూ పోతనను మించు కవి ఇక పుట్టగలడె పుట్టినంతట భావన పొందగలడె. అని ప్రశంసించారు.ఈ పద్యాలలో పోతన కావ్యాలను, ఆయన వ్యక్తిత్వాన్ని, అక్కడి ప్రత్యేకతను ప్రశంసించారు. పోతన చరిత్రను కావ్యంగా మలచి అభినవ పోతనగా పేరొందిన వానమామలై వరదాచార్యులను స్తుతించారు. ఆయన కావ్యం లోని పల్లె జీవితాన్ని రైతు కష్టాలను వివరించారు. ముఖ్యంగా గుజరాత్ రాష్ట్రంలో, భుజ్ ప్రాంతంలో వచ్చిన భూకంపం పట్ల శర్మగారు మానవీయ కవిగా స్పందించి భూప్రకంపనం శీర్షికన 16 పద్యాలు రాశారు. ఉన్నట్టుండి పైకప్పులు కూలటం,పూరి గుడిసెలు ఇండ్లు నేలమట్టం అవడం చిన్న పెద్ద, ఆడ మగ తేడా లేకుండా శిధిలాల కింద సమాధి అయిన వారిని తలచుకుం టూ భూప్రకంపనరక్కసి భోక్తయయ్యే, కన్న బిడ్డల నెత్తురు కళ్ళజూసే అని విలపించారు. అంతేకాదు ఆపన్న హస్తాన్ని అందించడానికి ప్రపంచ దేశాలన్నీ మంచు గుండెలతో ప్రవహించరండి అని పిలుపునిచ్చారు. ఋతు వర్ణన అనేది మన కావ్య సంప్రదాయం. నాటి కాళిదాసు నుండి నేటి కవుల వరకు ప్రకృతికి సంబంధించి ఋతు వర్ణన చేస్తూనే ఉన్నారు.ఆధునిక కవులైన సినారె ఋతుచక్రం శేషేంద్ర ఋతుఘోష వంటి కావ్యాలు రాశారు. వర్ణనా నిపుణులైన శర్మగారు, ఈ కావ్యం లో ఆరు ఋతువులను అందంగా వర్ణించారు. భారతదేశానికి పెట్టని కోటగా ఉన్న హిమాలయాలను చూసి ఉత్తర ప్రాంత మందునొక.. విశ్వమందునన్ అన్న పద్యం, అలనాటి అల్లసాని పెద్దన రాసిన మను చరిత్రలోని అటజనిగాంచె.. అనే పద్యాన్ని స్ఫురింపచేస్తుంది. నేర చరితులంత నేతలై సాగటం, భూకబ్జాల వల్ల కడుపేద భూమికి గండమయ్యే, నిలువ నీడయు లేక వలస పొయె. మొదలైన పద్య పాదాలన్నీ అతని సామాజిక స్పృహకు అద్దం పడుతున్నాయి. విరులశరుడు, స్మిత వస్త్ర ప్రశస్తి లాంటి మంచి పద బంధాలు కూడా ఇందులో ఉన్నాయి. ఇలా తెలుగు పద్యానికి నేటి కాలంలో సొగసును, సొబగును అద్దుతున్న మాడుగుల భాస్కర శర్మ గారి కలం నుండి మరెన్నో కావ్యాలు వెలువడాలని ఆశిస్తూ, ఆకాంక్షిస్తూ అభినందిస్తున్నాను.



డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్
99 891 48 305



# నులిమేద్దాం

(10 ఫిబ్రవరి 2025 , జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం)

*పిల్లలు తరచుగా కడుపునొప్పితో గానీ, కాళ్ళు ముఖం ఉబ్బటం గానీ, ఆకలి మందగించడం, నీరసంగా, మందకొడిగా, బరువు తగ్గడం, రక్తహీనత, మలద్వారం చుట్టూ దురద మొదలగు ఏదైనా ఒక లక్షణంతో శారీరకంగా లేదా మానసికంగా అనారోగ్యంతో బాధపడుతుంటే కడుపులో నట్టలు ఉన్నట్టు అనుమానించవచ్చు. కడుపులో క్రిములతో (పొట్టలో నట్టలు) కలిగే అనారోగ్యం వల్ల పిల్లలు సక్రమంగా పాఠశాలకు హాజరు కాకపోవడానికి ఒక కారణమని తెలుసుకుని భారత ప్రభుత్వం 2015 సం. నుండి "జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం (ఎన్.డి.డి.)" కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఆనాటి నుంచి ప్రతి ఏటా రెండు సార్లు ఫిబ్రవరి, ఆగస్టు మాసాలలో ఆరు నెలలకో సారి ఎన్.డి.డి.రోజున అన్ని రాష్ట్రాలలో డీవార్మింగ్ ప్రోగ్రాం నిర్వహిస్తూ పిల్లలకు నులిపురుగుల నిర్మూలన మాత్రలు (ఆల్బెండజోల్ టాబ్లెట్స్) నమిలి మింగించడం జరుగుతుంది. బడిలోపలి పిల్లలతో ప్రారంభించిన ఎన్.డి.డి. కార్యక్రమం ఆ తర్వాత బడిబయట పిల్లలకు మరియు 1సం.చిన్నారుల నుండి 19 సం.ల వయసు పిల్లలందరికీ డీవార్మింగ్ టాబ్లెట్స్ వేయడం జరుగుతుంది. వైద్య ఆరోగ్య శాఖతో పాటు విద్యాశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ (ఐసిడిఎస్) శాఖల సమన్వ యం, సహకారం, సౌజన్యంతో సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. ఎన్.డి.డి. రోజు,10 ఫిబ్రవరి 2025న 1 నుంచి19 సం.ల పిల్లలకు ఆల్బెండజోల్ 400 ఎం.జి. మాత్రలను నమిలి మింగించడం జరుగుతుంది.*

**1. ఏలిక పాములు (రౌండ్‌వార్మ్):**
**వీటి శాస్త్రీయ నామం: అస్కారిస్ లంబ్రి కాయిడ్స్ (ూాంఘ్మతీఱం శ్రీబఎఎతీఱఅషశీఱఎవం). ఇవి 10నుంచి 20సెం.మీ. పొడవుంటా యి. రోజుకు రెండు లక్షలకు పైగా గుడ్లు పెడతాయి. ఎక్కువ సంఖ్యలో ఏలిక పాములు ఉండటం వల్ల ప్రేవులలో అడ్డు గోడలుగా నిలుస్తాయి. వీటివల్ల అజీర్తి, కడుపు నొప్పి, నీరసం, పోషకాహార లోపం ఏర్పడుతుంది.**

**2. నులి పురుగులు (పిన్‌వార్మ్ /థ్రెడ్ వార్మ్):**
**ఈ పురుగులు తెల్లని రంగులో సన్నగా దారం పోగులాగా అర అంగుళం పొడవుంటాయి. వీటి శాస్త్రీయ నామం: ఎంటరోబియస్ వెర్మికులారీస్. ఈ వ్యాధి సంక్రమించిన వ్యక్తి బహిరంగ ప్రదేశంలో మల విసర్జన చేయడం వల్ల మట్టి కలుషితమై ఆ గుడ్లు చేతుల ద్వారా నీరు, ఆహారం ద్వారా ఇతరులకు వ్యాపించును. వీటివల్ల మలద్వారం చుట్టూ దురద, రాత్రిపూట ఎక్కువగా మూత్ర విసర్జన జరుగుతుంది.**

**3. కొంకి పురుగులు(హుక్ వార్మ్):**
**వీటి శాస్త్రీయ నామం: ఎన్సైలో స్టోమ డ్యుయోడినాల్. ఇవి నోటి ద్వారా కాకుండా పాదచర్మం ద్వారా సంక్రమిస్తా యి. కొంకి పురుగులు తమ నోటి దంతాల ద్వారా పేగులకు రంధ్రాలు చేసి రక్తాన్ని పీలుస్తాయి. వీటి గుడ్లు మట్టిలో చేరి ఎనిమిది రోజుల్లో లార్వాగా సన్నని దారం వలె రూపొందుతాయి.**

నులిపురుగులు అంటే ఏమిటి? నులి పురుగులనేవి మానవుని ప్రేగులోంచి పోషకాలను,రక్తాన్ని గ్రహించి అభివృద్ధి చెందే పరాన్న జీవులు (parasites). మనిషి అతిదేహి అనగా ఆతిథ్యం ఇచ్చేవాడు. నులి పురుగు అతిథి. నులి పురుగులు మూడు రకాలు. ఏలిక పాములు (రౌండ్ వార్మ్), నులి పురుగులు (పిన్ వార్మ్), కొంకి పురుగులు (హుక్ వార్మ్).

ఈ దశలో పాదాల చర్మం ద్వారా శరీరంలోకి వెళ్తాయి. వీటివల్ల రక్తహీనత, నీరసం, ఇస్నోఫీలియా ఎక్కువగుట, పిల్లలలో శారీరక, మానసిక పెరుగుదల లోపం, కాళ్లవాపులు, ముఖం ఉబ్బడం జరుగుతుంది. నులిపురుగుల సంక్రమణ వేటి ద్వారా వ్యాపిస్తుంది? పరిసరాలు పరిశుభ్రంగా లేని ప్రాంతాలలో మానవ మలంలో ఉన్న హెల్మిన్తీస్ పరాన్నజీవుల గుడ్ల ద్వారా మట్టి కలుషితం అయి 'మట్టి ద్వారా సంక్రమించే హెల్మిన్తీస్' వ్యాప్తి చెందుతాయి. ఆరుబయట చెప్పులు లేకుండా వట్టి కాళ్ళతో మట్టిలో ఆడుకోవడం. అపరిశుభ్రమైన సురక్షితం కాని నీరు, ఆహారం తీసుకోవడం. భోజనం చేసే ముందు, మలవిసర్జన తర్వాత చేతులు సబ్బు నీటితో కడుక్కోపోవుట. బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయుట. పెరిగిన గోళ్లను కత్తిరించక పోవడం. వ్యక్తిగత పరిశుభ్రత మరియు పరిసరాల పారిశుధ్యం లోపించడం. అపరిశుభ్రమైన ఆకు కూరలు, కాయగూరలు, పండ్లు తీసుకోవడం ద్వారా నులి పురుగులు నోటిద్వారా లేదా అరికాళ్ళ చర్మం ద్వారా సంక్రమిస్తాయి.

ఎవరెవరికి ఎక్కడ మాత్రలు వేస్తారు? జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం అనగా 10 ఫిబ్రవరి 2025 రోజున అంగన్వాడీ కేంద్రాలలో నమోదు చేయబడిన ఒకటి నుంచి ఐదు సం.ల వయస్సు గల చిన్నారులకు మరియు 6 నుంచి 19 సం.ల వయస్సు గల బడి బయట పిల్లలకు అంగన్వాడీ/ఆషా కార్యకర్తలు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తారు.

ప్రభుత్వ మరియు ప్రైవేటు ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, కాలేజీలలో నమోదు చేయబడిన 6 నుంచి 19 యేళ్ళ పిల్లలందరికీ ఎన్.డి.డి. రోజు ఏ.ఎన్.ఎం.లు, ఉపాధ్యాయులు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తారు. ఆ రోజు పాఠశాలకు వెళ్లని మిస్ అయిన పిల్లలకు 17 ఫిబ్రవరి 2025 (మాప్ అప్ డే) రోజున తిరిగి మాత్రలు వేస్తారు. యింకా అనాథ ఆశ్రమాలు, చైల్డ్ కేర్ సెంటర్లు మరియు చదువుకునే, ఆటలాడుకునే, పనిచేసే అన్ని ప్రదేశాలలో 1 నుంచి 19 సం. వయసున్న పిల్లలకు ఆరోగ్య సిబ్బంది మాత్రలు వేస్తారు. నులిపురుగుల ప్రభావం ఎక్కువగా ఉన్న పిల్లలలో ఈ మాత్ర వేసుకున్న తర్వాత కొందరికి వికారం, స్వల్ప కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు కలుగవచ్చు. కంగారుపడాల్సిన పనిలేదు. వెంటనే స్థానిక వైద్యారోగ్య సిబ్బందికి తెలియజేయాలి. పిల్లలు ఈ మాత్రను డైరెక్ట్ మింగకుండా బాగా నమిలి మింగే విదంగా చూడాలి. నమలకుండా మింగితే నిర్మూలనా ప్రభావం తగ్గే అవకాశం ఉంది.

**ఆల్బెండజోల్ మాత్రల మోతాదు:** 1 నుంచి 2 సం.ల చిన్నారులకు ఆల్బెండజోల్ సగం మాత్ర (200mg) రెండు స్పూన్ల మధ్య నలిపి, నీటితో కలిపి మింగిస్తారు. 2 నుంచి 3 సం.ల పిల్లలకు పొడి చేసిన ఒక పూర్తి మాత్ర (400 ఎమ్.జి.) మరియు 3 నుంచి 19 సం.ల వయసు పిల్లలు ఆల్బెండజోల్ మాత్ర (400 ఎమ్.జి.) భోజనం చేసిన తర్వాత నమిలి నీటితో మింగాలి. యన్.డి.డి. నిర్వహణ సమయంలో అంగన్ వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కాలేజీల్లో శుభ్రమైన త్రాగు నీరు, గ్లాసులు ఏర్పాటు చేసుకొని కార్యక్రమం విజయవంతం చేయాలి. ప్రార్థన సమయంలో విద్యార్థులకు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం మరియు చేతులను సబ్బు నీటితో కడుక్కునే పద్ధతులను (హ్యాండ్ వాషింగ్ టెక్నిక్స్) నేర్పిస్తారు.

ఆల్బెండజోల్ మాత్రలు ఎవరు వేసుకోకూడదు? జబ్బులున్న వారు, దీర్ఘకాలికంగా మందులు వాడుతున్న పిల్లలు ఈ మాత్రలు వేసుకోరాదు. ఖాళీ కడుపుతో మాత్రలు వేసుకోరాదు. ఎట్టి పరిస్థితుల్లో టాబ్లెట్ పిల్లవానికి యింటికి యివ్వకూడదు. ఆల్బెండజోల్ మాత్ర పిల్లలకు, పెద్దలకు కూడా సురక్షితమైనది.

**నులి పురుగులు రాకుండా నివారణ చర్యలు:** బయటకు వెళ్లినప్పుడు చెప్పులు ధరించాలి. సురక్షితమైన నీరు, పరిశుభ్రమైన ఆహార పదార్థాలు తీసుకోవాలి. భోజనం,ఇతర ఆహార పదార్థాలు తినే ముందు, మలవిసర్జన తర్వాత చేతులు సబ్బు నీటితో కడుక్కోవాలి. బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయకుండా, మరుగు దొడ్లని వాడాలి. పెరిగిన గోళ్లను కత్తిరించి, శుభ్రంగా ఉంచుకోవాలి. పరిశుభ్రంగా కడిగిన ఆకు కూరలు, కాయగూరలు, పండ్లు తీసుకోవాలి. పరిసరాల పారిశుధ్యం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా నులి పురుగులు రాకుండా నివారించవచ్చు.

ఆరోగ్యవంతమైన సమాజం, ఆనందకర బాల్యం కోసం ఒక్క మాత్రతో వేలాది నులిపురుగులను నలిపేసి, పిల్లల శారీరక, మానసిక వికాసానికి తోడ్పడే ఈ కార్యక్రమం వంద శాతం కవరేజ్ అయ్యేలా, విజయవంతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉంది. (10 ఫిబ్రవరి 2025 జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా)

బి నాశబోయిన నరసింహ (నాన),
కవి, రచయిత, ఆరోగ్య విస్తరణ అధికారి,
8555010108

# నిరుపేద విద్యార్థుల కోసం విద్యానిధి ఏర్పాటు

- పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి



**మక్తల్, ఫిబ్రవరి 9 (జనంసాక్షి) :** జిల్లాలోని నిరుపేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం విద్యానిధిని ఏర్పాటు చేసినట్లు మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి వెల్లడించారు. ఆదివారం రోజు మక్తల్ పట్టణంలోకి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి కళ్యాణమండపంలో 1984 -85 -87 ఎస్ఎస్సి ఇంటర్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం లో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధి కోసం ప్రత్యేక కార్యచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం లక్ష్యంగా తాను పనిచేస్తున్నట్లు చెప్పారు. సుదీర్ఘకాలం తర్వాత స్థానికుడిగా తనకు ఎమ్మెల్యేగా ఎన్నుకున్న నియోజకవర్గ ప్రజలకు అన్ని రంగాలలో అభివృద్ధి చేసి నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తానని అన్నారు. రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధి కోసం పాటుపడుతున్నట్లు చెప్పారు. ప్రత్యేకంగా ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు గురుకుల పాఠశాల విద్యార్థుల కోసం ఎస్ఎస్సి పరీక్షలకు సిద్ధం కావడానికి 2డి 3డి యానిమేషన్ పుస్తకాలను 30 లక్షల రూపాయల వ్యయంతో సొంతంగా తయారుచేసి నియోజకవర్గం లోని 3,500 మంది విద్యార్థులకు అందించినట్లు చెప్పారు.రానున్న రోజుల్లో విద్యార్థుల కోసం విద్యా నిధి ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు .40 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులంతా కలిసి ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకొని తమ అనుభవాలను పంచుకోవడం అభినందనీయమని అన్నారు. ఇలాంటి కార్యక్రమంలో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరు తమ వంతుగా సహకరించాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. విద్యాపరంగా పూర్తిగా వెనుకబడిన మక్తల్ నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. త్వరలోనే సొంత భవనాన్ని కూడా నిర్మించనున్నట్లు తెలిపారు .అదే విధంగా కోర్టును మంజూరు చేయించడం జరిగిందని తన క్యాంపు కార్యాలయాన్ని కోర్టు కోసం కేటాయించినట్లు చెప్పారు. ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయడం జరిగిందని 150 పడకల ఆసుపత్రి నిర్మాణానికి ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. విద్య వైద్య పరంగానే కాకుండా అన్ని రంగాలలో నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి జి. లక్ష్మారెడ్డి, పూర్వ విద్యార్థులు రుమాళ్ళ రాజశేఖర్, కట్ట సురేష్ కుమార్, అనుగొండ జగదీష్, డాక్టర్ శ్రీరామ్, మహేశ్వరం ఏసిపి లక్ష్మీకాంత్ రెడ్డి, బి.ఆంజనేయులు సూర్య, బి.శ్రీనివాసులు, ఈ.నారాయణ గౌడ్, నీలి శ్రీనివాసులు, నజీర్ అహ్మద్, ఎంఎస్.గోపి, పి.ప్రాణేషాచార్య, శంకర్ లింగం, మల్లారెడ్డి, తిరుపతి, హరిదాసు, వి.బాబు, జి.నరేందర్ సుగుణ, హేమలత, జ్యోతి, అనురాధ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి పూర్వ విద్యార్థులు శాలువాతో ఘనంగా సత్కరించారు.

## తల్లునూరు బీటీ రోడ్డుకు 5.20 కోట్లు నిధులు మంజూరు

**రెవల్లి, ఫిబ్రవరి 9 (జనంసాక్షి) :** తూడుకుర్తి నుండి తల్లునూరు, రేవల్లి వరకు బీటి రోడ్డు నిర్మాణానికై జీవో నెంబర్ 59తో ఐదు కోట్ల 20 లక్షలు, ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల నుండి డ్రైనేజీ నిర్మాణం కోసం 10 లక్షల నిధులు వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి మంజూరు చేశారు. తల్లునూర్ గ్రామంలోని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం భవనాన్ని ఈ నెల 12న ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే మేఘారెడ్డి హాజరు కానున్నారు. కావున కార్యక్రమానికి గ్రామ ప్రజలు పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఉమ్మడి గోపాల్పేట్ మండల వైస్ ఎంపీపీ ఎక్క వెంకటేష్ కోరారు. గ్రామానికి నిధులు మంజూరు చేసినందుకు గ్రామ ప్రజలు పార్టీ కార్యకర్తలు ఎమ్మెల్యే మెగా రెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

## శస్త్ర చికిత్స పొందుతూ బ్రెయిన్ డెత్‌తో యువ వైద్యురాలు మృతి

**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 9 (జనంసాక్షి) :** ఫిబ్రవరి 1న శంకర్పల్లి లో తన సన్నిహితుల వివాహానికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో బాచుపల్లి చెందిన కామినేని హాస్పిటల్ వైద్యుడు జశ్వంత్ అతివేగంతో డివైడర్ను ఢీ కొట్టి దుర్మరణం చెందిన విషయం తెలిసిందే. ఆయనతోపాటు అతని కారులో ఎల్బీనగర్ కు చెందిన సహ వైద్యురాలు భూమిక (24)ను కాంటినెంట్ హాస్పిటల్ లో అత్యవసర మెరుగైన వైద్యం అందించినా కూడ డాక్టర్లు ఆమె తలకు బలమైన గాయం అవడంతో ఆదివారం బ్రెయిన్ డేత్ అయ్యి ప్రాణం విడిచింది.కన్నీటి పర్యంతమైన కుటుంబ సభ్యులు ముందుకొచ్చి



హాస్పటల్ వారికి అవయవదానం చేశారు. దీంతో నలుగురికి పునర్జీవనం పొందారు.

# ప్రజా వ్యతిరేక బడ్జెట్‌కు నిరసనగా ధర్నా జయప్రదం చేయండి

- సిపిఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య

**హయత్‌నగర్, ఫిబ్రవరి 9 (జనంసాక్షి) :** భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) హయత్ నగర్ సర్కిల్ జనరల్ బాడీ సమావేశం మనసురాబాద్ డివిజన్‌లోని జడ్జెస్ కాలనీలో సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య హాజరైనారు. ఈ సందర్భంగా పగడాల యాదయ్య మాట్లాడుతూ నేడు దేశంలో బిజెపి ప్రభుత్వము తన 55 లక్షల కోట్ల బడ్జెట్లో 12 లక్షల కోట్ల రూపాయలు వడ్డీలకే సరిపోతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి ఎలాంటి కేటాయింపులు లేవన్నారు, ఉపాధి హామీ పథకానికి రెండున్నర లక్షలు కేటాయించాలని డిమాండ్ చేస్తుంటే, 25 వేల కోట్లకు తగ్గించింది కేంద్ర ప్రభుత్వం. కార్మికుల సంక్షేమానికి, ప్రజల సంక్షేమానికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని అన్నారు. రైతాంగానికి గిట్టుబాటు ధరలు లేవు, గిట్టుబాటు ధరల కొరకు కేటాయింపులు లేవని ఎద్దేవ చేశారు. ప్రజా వ్యతిరేకమైన ఈ బడ్జెట్, రైతులకు, వ్యవసాయ కూలీలకు, ప్రజలకు కానీ ఎలాంటి




ప్రయోజనాలు లేకుండా బడ్జెట్ ప్రవేశపెట్టిందని చెప్పారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రానికి వ్యతిరేకమైన బడ్జెట్ గా ఉందని అన్నారు. కేంద్ర ప్రభుత్వము తన ఇష్టం వచ్చిన పద్ధతిలో తన అధికారంలో ఉన్నచోట విచ్చల విడిగా ఖర్చు పెట్టి, వ్యతిరేక పార్టీలు అధికారంలో ఉన్నచోట ఆ నిధులు కేటాయించకుండా రాష్ట్రాలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని అన్నారు. రాష్ట్రాల అసెంబ్లీ ఆమోదం పొందిన బిల్లులను సైతం తొక్కిపెట్టి గవర్నర్లను పావులుగా వాడుకుంటుందని అన్నారు. ఎస్సీ జనాభా 17% ఉంటే 5 శాతం నిధులు కేటాయించారని, గిరిజనులు ఏడు శాతం ఉంటే మూడు శాతం కేటాయించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రానికి రావలసిన వాటా అసలే లేదని, ప్రాజెక్టుల కేటాయింపులు లేవని, ఈ బడ్జెట్లో కార్పోరేట్ శక్తులకు అనుకూలంగా వేలకోట్ల రూపాయల డిజైన్వెస్ట్మెంట్ చేసి ప్రభుత్వ ఆస్తులని కార్పొరేట్లకు కట్టబెట్టుటకు బడ్జెట్ కేటాయింపులు చేశారని అన్నారు. ఉపాధి హామీ కోట్లాది మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తుంటే వారికి నిధులు కేటాయించక పోగా తగ్గించారు. తక్షణమే ఈ "ప్రజా వ్యతిరేకమైన బడ్జెట్"కి వ్యతిరేకంగా ఫిబ్రవరి 10న ఇందిరా పార్కు వద్ద జరుగుజరిగే నిరసన ప్రదర్శన, ధర్నాని ప్రజలు, ప్రజాతంత్ర వాదులు, రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు పెద్ద మొత్తంలో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక బడ్జెట్ కు నిరసనంగా ఈ నెల 10న జయప్రదం చేయవలసిందిగా విజ్ఞప్తి. ఈ కార్యక్రమంలో సిపిఎం సర్కిల్ కార్యదర్శి కీసరి నర్సిరెడ్డి, సర్కిల్ కమిటీ సభ్యులు బి భాస్కర్, సిహెచ్ కృష్ణయ్య, సిహెచ్ మల్లేశం, సంధ్య కనకయ్య, శాంతి కుమార్, రాజు, శ్రీనివాస్, మూర్తి, ఏబూసి నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

## రచయిత ప్రతాప్‌కు ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ అవార్డు




**బిజినేపల్లి, ఫిబ్రవరి 9 (జనంసాక్షి) :** సైన్స్, సాహిత్యంలో రెండు దశాబ్దాలుగా వివిధ రచనల ద్వారా సైన్స్ లోని నిగూఢ అంశాలను విశ్లేషణాత్మకంగా పరిశోధిస్తునందుకు ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ అవార్డును సాహితీవేత్త డాక్టర్ ప్రతాప్ కౌటిళ్య అందుకున్నట్లు ఆదివారం అయన తెలిపారు. ప్రతియేటా డాక్టర్ చిన్నారావు వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన వారికి అందించే ఈఆవార్డును ప్రతాప్ కౌటికల్ సైన్స్‌లో చేసిన కృషిని గుర్తించి ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ అవార్డుల ప్రధానోత్సవం చేసి ప్రశంస పత్రం, మెమోంటో అందజేసి ప్రోత్సహిస్తున్నట్లు సంతోషం వ్యక్తం చేశారు. వరుసగా రెండో ఏడాది కూడా ఈ అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందని, అవార్డు ఇచ్చి సత్కరించిన నిర్వహకులు డాక్టర్ దోమన చిన్నారావు. డాక్టర్ అలపాటిలకు కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ స్థాయి ఏపీజే అబ్దుల్ కలాం అవార్డు అందుకున్న ప్రతాప్ కౌటిల్యను తెలంగాణ రాష్ట్ర మల్లీ జోనల్ ఉన్నత విద్యా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ డీఎస్ఆర్ రాజేందర్ సింగ్, కుటుంబ సభ్యులు ఉపాధ్యాయులు సునీత, ఎస్వీ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, గ్రామస్తులు అభినందించారు. పాపులర్ సైన్స్లో ఆయన చేసిన రచనలు ఎంతో ఆలోచనలను రేకెత్తించేవిగా, నూతన ఆవిష్కరణలకు మార్గదర్శంగా, రాబోయ్యే కొత్త తరాల శాస్త్రవేత్తలకు ఈయన సైన్స్ పిక్షన్ రచనలు ఎంతో ఉపయోగపడుతాయని మల్లి జోనల్ ఉన్నత విద్యా జాయింట్ డైరెక్టర్ డీఎస్ఆర్ రాజేంద్రసింగ్ కొనియాడారు. భవిష్యతుల్లో సైన్స్లో మానవాళికి ఉపయోగపడే ఎన్నో రచనలు. ఆవిష్కరణ చేయాలని కోరారు.

## కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు పొలిటికల్ రిలేషన్‌షిప్ పెట్టుకున్నాయి

- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

**నల్గొండ బ్యూరో, ఫిబ్రవరి 9 (జనంసాక్షి) :** తెలంగాణలో కాంగ్రెస్, బిఆర్ఎస్‌లు పొలిటికల్ రిలేషన్ షీప్ పెట్టుకున్నాయని కేంద్ర హెూంశాఖ సహా మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. కాళేశ్వరం,డ్రగ్స్,ఫోన్ టాపింగ్, ఈ ఫార్ములా కేసులు ఏమీ అయ్యాయని, ఎందుకు అరెస్టే యలేదన్నారు.ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలో బిజెపి కార్యాలయంలో టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల కార్యశాల సమావేశంలో దిశానిర్దేశం చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ జాబితాలో బీసీల్లో, ముస్లింలను ఎట్లా కలుపుతారని..మీ జాతి ఏందన్నా...మీ అయ్య జాగీరనుకుంటున్నారా..! మేం హిందువులం, బొట్టు పెట్టుకుంటాం. మాకు జన్మ నక్షత్రం ఉంటుంది. గోత్రనామాలుంటాయి. మొలదారం కట్టుకుంటాం.ఇది మా జాతి. ఒక జాతికి,ఇంకో జాతికి తేడా తెలుసుకోలేని మూర్ఖత్వపు పార్టీ కాంగ్రెస్‌ది అన్నారు. అసలు హిందువులకు, ముస్లింలకు పోలికేమిటి.. హిందువులు అడుక్కోవాలా..బిచ్చగాళ్లను చేద్దామనుకుంటున్నారా.. అని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దుయ్యబట్టారు.బీసీ సంఘాలు, నాయకులు ఏం చేస్తున్నారు,ఎవరు అధికారంలో ఉంటే వాళ్లకు వత్తాసు పలుకుతారా...ఎలక్షన్స్ వచ్చినప్పుడు వస్తారా..ఇదేం పద్ధతని విమర్శించారు. ఈ పరిస్థితి కొనసాగితే రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లోనూ బీసీ స్థానాల్లో ముస్లింలు పోటీ చేస్తారని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీసీ స్థానాల్లో ముస్లింలు పోటీ చేసి, హిందువులకు అన్యాయం చేశారని గుర్తు చేశారు. హిందుత్వ వాదులు,బీసీ సంఘాలు స్పందించకపోవడంతో ప్రస్తుతం ఒవైసీ,రేవంత్ గ్యాంగ్ కలిసి బీసీలను దెబ్బతీయాలని చూస్తున్నారని, ముస్లింలను బీసీ జాబితాలో కలిపే కుట్రకు తెరదీశాయన్నారు. అగ్రకులాల ప్రజలు కూడా బీసీలకు జరిగిన అన్యాయంపై సానుభూతి తెలుపుతుంటే...బీసీ సంఘాలు ఎందుకు నోరు మూసుకున్నాయని మండిపడ్డారు. బీసీలు, హిందువులంతా ఏకమై కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అధికారం చెలాయిస్తున్న కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎందుకు ఓటేయాలని




ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీపై, బీసీ సంఘాల తీరును తప్పుపట్టారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సరైన అభ్యర్థులే లేరు, దేశ చరిత్రలో అధికార పార్టీకిఅభ్యర్థులు ఎందుకు రావడం లేదు.ఈ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్,బీఆర్ఎస్ లు,ఈ రెండు పార్టీల మధ్య లోపాయికారీ ఒప్పందం కుదిరిందన్నారు. తెలంగాణలో రెగ్యులర్ ఎంఈఓలు, డిప్యూటీ ఈవోలు, రెగ్యులర్ డిఇవోలు లేక పర్యవేక్షణ కరువై పాఠశాలలు దారుణంగా తయారయ్యాయని అన్నారు. విద్యాశాఖకు మంత్రి లేదన్నారు.కుల గణన పేరుతో బీసీ జనాభాను తగ్గించే కుట్రకు తెరతీసారని, కేసీఆర్ సర్కార్ చేపట్టిన ఎస్కేఎస్ సర్వేలో 51 శాతం బీసీల జనాభా ఉంటే,రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసిన కుల గణన సర్వేలో 46 శాతం ఎట్లాఅన్నారు.ఎన్నికల సంఘం రాష్ట్రంలో 3.35 కోట్ల మంది ఓటర్లున్నారని చెబుతోంది.రేవంత్ సర్కార్ మాత్రం 3.7 కోట్ల మంది జనాభా మాత్రమే ఉన్నారని, మేధావులు,గణాంకాలు మాత్రం రాష్ట్ర జనాభా 4.3 కోట్లుందని అంటున్నారు.ఈ లెక్కన 60 లక్షల మంది ఎటుపోయినట్లు,కాంగ్రెస్ ప్రభుత్వం చంపేసిందా.. అన్నారు.ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర నాయకులు గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగిడి మనోహర్ రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, పులి సరోత్తమ్ రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్,జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి, కంకణాల నివేదితా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిందితులను కఠినంగా శిక్షించాలి

- సామాజిక అధ్యయన వేదిక కన్వీనర్ ఎల్.భద్రయ్య



**సూర్యాపేట ప్రతినిధి, ఫిబ్రవరి 9 (జనంసాక్షి) :** ఇటీవల సూర్యాపేట జిల్లా కేంద్రంలో వడ్లకొండ కృష్ణ హత్యకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని సామాజిక అధ్యయన వేదిక కన్వీనర్ ఎల్.భద్రయ్య డిమాండ్ చేశారు.ఆదివారం జిల్లా కేంద్రంలోని టీపిటిఎఫ్ కార్యాలయంలో కుల మతాంతర ప్రేమ వివాహాలలో పరువు హత్యను నివారించడం ఎలా అనే అంశంపై ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంటి కుటుంబానికి ప్రభుత్వం రక్షణ కల్పించాలని కోరారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయం అందించాలని అన్నారు. బంటి భార్య భార్గవికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.కుల, మతాంతర వివాహం చేసుకున్న వారికి ప్రభుత్వం రక్షణ చట్టం చేయాలన్నారు. ఎస్సీ,ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం 1989ని అమలు చేయాలని కోరారు. ఈ హత్య కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపించాలన్నారు. కుల, మతాంతర వివాహాలు చేసుకున్న దంపతులకు తక్షణ సహాయం కింద ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయాలని కోరారు. బహుజన మహాసభ రాష్ట్ర నాయకులు నారబోయిన వెంకట్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందారి డేవిడ్ కుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు, సిపిఐ సీనియర్ నాయకులు దంతాల రాంబాబు,సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కమిటీ సభ్యులు పేర్ల నాగయ్య, సామాజిక అధ్యయన వేదిక కో కన్వీనర్ రేపాక లింగయ్య, సియుసి నాయకులు షేక్ కరీం, డిటిఎఫ్ నాయకులు ఎస్ కె.ఉమర్, టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వీరన్న, ఐఎఫ్టియు జిల్లా నాయకులు కునుకుంట్ల సైదులు, పిడిఎస్యు రాష్ట్ర ఉపాధ్యక్షులు పోలబోయిన కిరణ్, సామాజిక కార్యకర్త గుండు వెంకన్న, సిపిఐ ఎంఎల్ రాష్ట్ర నాయకులు బుద్ధ సత్యనారాయణ, డిటీఎఫ్ జిల్లా నాయకులు ఆనంద భాస్కర్, సామాజిక ఉద్యమకారులునామ నాగయ్య, మాల మహానాడు జిల్లా నాయకులు మురళి తదితరులు పాల్గొన్నారు.

## పురాతన దేవాలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే జారె



**దమ్మపేట ఫిబ్రవరి 9 (జనంసాక్షి) :** దమ్మపేట మండలం గురువాయిగూడెం గ్రామ సమీపంలో గల అతి పురాతన కాకతీయుల కాలంనాటి శంకరగిరి దుర్గేశ్వర ఆలయ0(దుర్గమ్మ గట్టు)ను సందర్శించారు. ఆలయం వద్దకు వాహనాలకు దారి లేకపోవడంతో కాలినడకతో ప్రకృతి అందాన్ని ఆస్వాదిస్తూ గుడి వద్దకు చేరుకున్నారు.అనంతరం చుట్టుపక్కల పరిసరాలను ఆలయ కమిటీ పెద్దలు కమిటీ సభ్యులతో కలసి దుర్గమ్మ గట్టు ఆవరణాన్ని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పూర్తిగా పరిశీలించి పెద్దల సహకారంతో పురాతన సంస్కృతులు ఆలయాల విశిష్టతలను క్షుణ్ణంగా తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె మాట్లాడుతూ ఆలయాల చరిత్రను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పూర్వ వైభవం తీసుకొచ్చి దేవాలయాలను అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

## స్వయం కృషితో ఎదిగి వ్యాపార రంగంలో రాణించాలి



**హైదరాబాద్, ఫిబ్రవరి 9 (జనంసాక్షి) :** స్వయం కృషితో ఎదిగి వ్యాపార రంగంలో రాణించాలని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు.
ఆదివారం కొత్త పేట లోని మోహన్‌నగర్‌లో జైపూరీ కాలనీ ప్రెసిడెంట్ రవి కుమార్ నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ పార్వతి పరమేశ్వర టిఫిన్స్, మిల్స్‌నీ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు వ్యాపార రంగంలో రాణించాలని ఆయన సూచించారు. మంచి ఆహారం అందించి కస్టమర్లకు అన్ని విధాలా అందుబాటులో వుండేలా చూసుకోవాలి అని ఆయన అన్నారు.

# రేవంత్ రెడ్డి పట్టుదలతోనే కులగణన పూర్తి

- రాహుల్ గాంధీ ఇచ్చిన మాటను నిలబెట్టిన ముఖ్యమంత్రి
- కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అన్నింటిని పూర్తి చేస్తాం
- విజయోత్సవ సంబరాల్లో షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**నందిగామ, ఫిబ్రవరి 9 (జనంసాక్షి) :** రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ రాష్ట్రంలో కులగణనను పూర్తి చేయడం జరిగింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయన పట్టుదలతో రాష్ట్రంలో బీసీ కులగణనతో సామాజిక న్యాయం జరుగుతుందని, అలాగే 30 ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న ఎస్సీ ఏబిసిడి వర్గీకరణ సైతం సుప్రీంకోర్టు తీర్పు అనంతరం వన్ మ్యాన్ కమిషన్ ఏర్పాటుతో దళితులు అందరికీ న్యాయం చేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఎస్సీ వర్గీకరణ, బీసీ కుల గణన అసెంబ్లీలో ఆమోదం పొందిన శుభ సందర్భాన్ని పురస్కరించుకొని ఆదివారం కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు జంగ నరసింహులు ఆధ్వర్యంలోనందిగామ మండల కేంద్రంలో విజయోత్సవ సంబరాలు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ జరిగిన కాంగ్రెస్ సంబరాల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతుందని చెప్పారు. దేశంలో సుదీర్ఘ కాలం తర్వాత కుల గణన చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అది కాంగ్రెస్ అజెండాలో భాగమన్నారు. దేశవ్యాప్తంగా కుల గణన చేసి తీరాలని చేయాలని రాహుల్ గాంధీ కాంగ్రెస్ మేనిఫెస్టోలో చేర్చడం జరిగిందన్నారు. పదేళ్ల కాలంలో నియంతృత్వ, కుటుంబ పాలన, మోసపూరిత వాగ్దానాలతో బురిడీ కొట్టించిన కెసిఆర్ టిఆర్ఎస్ ప్రభుత్వం చూశారని, నల్లమల పులిబిడ్డ, పాలమూరు మట్టి పరిమళం సీఎం రేవంత్ రెడ్డి హయాంలో ఆరు గ్యారెంటీ పథకాలు అమలు జరిగి ఇందిరమ్మ పాలన రావడం ఖాయం అన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత నీలం మధు మాట్లాడుతూ లక్షల కోట్ల రూపాయలు అప్పు తెచ్చి తెలంగాణ రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు, బిఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. 7 లక్షల కోట్ల రూపాయలు అప్పు చేసి కెసిఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని కోలుకోలేని విధంగా నాశనం చేశారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేత జిల్లెల్ల రామ్ రెడ్డి, ఉమ్మడి మండలాల మాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్ కాంగ్రెస్ యువనేత అందే మోహన్, డైరెక్టర్ సి మల్లేష్, కొత్తూరు కాంగ్రెస్ పార్టీఅధ్యక్షుడు హరినాథ్ రెడ్డి, మాజీ ఎంపిటిసి లు కొమ్ము కృష్ణ, చంద్రపాల్ రెడ్డి, కుమారస్వామి గౌడ్, పసుల బుచ్చయ్య, కావలి కృష్ణ, సీతారాం,బుయ్యని వీరేందర్ గౌడ్, గుండాల వేణుగోపాల్, బుగ్గ నరసింహులు, కుందారం వెంకట్ రెడ్డి,బుగ్గ శ్రవణ్, గడ్డం జంగయ్య, చికుర్తీ సుదర్శన్, జ్ఞానేశ్వర్, ఉమ్మెత్తల అంతయ్య, జంగారి రాములు, రాధకృష్ణ,శివ గళ్ళ సుమన్, తడకల జంగయ్య, సి మల్లేష్ ,తదితరులు పాల్గొన్నారు.



## బస్సు సర్వీసును ప్రారంభించిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



**కృష్ణ, ఫిబ్రవరి 9 (జనం సాక్షి) :** మండలం తంగడిగి గ్రామానికి బస్సు సర్వీసును మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మక్తల్ వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ తంగిడి నాగరాజు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్ల నుంచి బస్సు సౌకర్యం నోచుకొని గ్రామాలకు బస్సు సర్వీసు మొదలు కావడంతో గ్రామస్తులలో సంబరంగా ఉందని అన్నారు, పాఠశాల, కళాశాలలకు వెళ్లే తమ పిల్లలకు ఈ బస్సు సౌకర్యం వల్ల చాలా మేలు జరుగుతుందని, ,సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ఏఎస్ఐ సురేందర్ బాబు, మండల అధ్యక్షుడు రాజప్ప గౌడ్, ఆనంద్ గౌడ్, పల్లె సురేష్, వాకిటి నారాయణ, యూత్ అధ్యక్షులు షేక్ సర్ఫరాజ్ , మాజీ సర్పంచులు, మాజీ వార్డ్ మెంబర్స్, తంగడిగి, కుసుమూర్తి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు శాఖ విధిగా గస్తీ నిర్వహించాలి

- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూరు, ఫిబ్రవరి 9 (జనంసాక్షి) :** పట్టణంలో గత రెండు రోజుల క్రితం వరుస దొంగతనాలు జరగడంతో, బాధిత కుటుంబాలు పాత్రికేయులు బస్వరాజు మరియు పట్టోళ్ళ వెంకట్ రెడ్డి వారి ఇండ్లను ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. బాధిత కుటుంబ సభ్యుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం పట్టణంలో ఎవరైనా ఊరెళ్తే పోలిసు వారికి సమాచారం అందించాలని సూచించారు.పోలీసులు విధిగా గస్తీ నిర్వహిస్తూ, ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ టౌన్ ఎస్సై రమేష్ తో సీసీ కెమెరాల పనితీరు, పట్టణంలో సీసీ కెమెరాలు ఎంత వరకు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు.

## తుంకిమేట్లలో నిరుపయోగంగా ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అతిథి గృహం



**బొంరాస్‌పేట, ఫిబ్రవరి 9 (జనంసాక్షి) :** మండల పరిధిలోని తుంకిమెట్ల గ్రామ శివారులోని హైదరాబాద్ బీజాపూర్ 163వ జాతీయ రహదారి సమీపంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో అటవీశాఖ వారు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నివాసం ఉండేందుకు అతిథి గృహాన్ని నిర్మించారు. ప్రస్తుతం అటవీశాఖ వారు అతిథి గృహాన్ని వినియోగించుకోకపోవడంతో నిరుపయోగంగా మారి చుట్టూ పిచ్చి మొక్కలు ముళ్ళ పొదలు పెరిగాయి.

## ఖనిజ సంరక్షణ వారోత్సవ ముగింపు వేడుకలు




**మేళ్లచెరువు, ఫిబ్రవరి 9 (జనంసాక్షి) :** రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన 30వ గనుల పర్యావరణము ఖనిజ సంరక్షణ వారోత్సవ ముగింపు వేడుకలు ఇండియన్ బ్యూరో మైన్స్ హైదరాబాద్ రిజియన్ శ్రీ జయ జ్యోతి సిమెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ( మై హోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ అనుబంధ సంస్థ వారి ఆధ్వర్యంలో మల్లికా కన్వెన్షన్ సెంటర్ శంషాబాద్ హైదరాబాదులో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మై హోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేళ్ల చెరువు లైమ్ స్టోన్ మైన్స్ కి వివిధ విభాగంలో 8 బహుమతులు లభించాయి. ఓవరాల్ పెర్ఫార్మెన్స్ విభాగంలో మై హోమ్ లైన్ స్టోన్ మైన్స్ మేళ్లచెరువు రాష్ట్రస్థాయి ద్వితీయ బహుమతి లభించింది. ఈ బహుమతులను ముఖ్య అతిథి పి.ఎన్.శర్మ చీఫ్ కంట్రోల్ ఆఫ్ మైండ్స్ ఐబీఎం నాగపూర్ చేతుల మీదుగా సంస్థ టెక్నికల్ డైరెక్టర్ వి. యస్.నారంగ్ డైరెక్టర్ ఆపరేషన్స్ శ్రీ చంద్రశేఖర్ పాండే అందుకున్నారు. ఈ సందర్భంగా టెక్నికల్ డైరెక్టర్ నారంగ్ మాట్లాడుతూ మై హోమ్ ఇండస్ట్రీ ప్రైవేట్ లిమిటెడ్ మొదటి నుంచి గనులయందు పాటిస్తున్న ఉత్తమ పద్ధతులు నియమ నిబంధనలకు లోబడి పర్యావరణ పరిరక్షణ అనుసరిస్తున్న పద్ధతులకు ఖనిజను సరైన రీతిలో ఉపయోగించుట కంపెనీ చేస్తున్న కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమములకు ఈ అవార్డు లభించింది అని అన్నారు.ఈకార్యక్రమంలో మైన్స్ జిఎం శ్రీనివాసరావు, అప్పలరాజు, సూర్య నారాయణరాజు, మైన్స్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఖమ్మంవాసి టీవీ పుల్లం రాజుకు డాక్టరేట్



**ఖమ్మం, ఫిబ్రవరి 9 (జనంసాక్షి) :** చెన్నై ఎగమోర్ లోనీ రాజా అన్నామలై మందిరంలో అమెరికాలోని సౌత్ వెస్టన్ యూనివర్సిటీ వారు నిర్వహించిన స్నాతకొత్సవంలో ఖమ్మం నివాసి టి. వి. పుల్లంరాజుకు సోషల్ సర్వీస్ విభాగంలో గౌరవ డాక్టరేట్ అవార్డు అందించారు. ఈ అవార్డ్‌ను తమిళనాడు మాజీ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి వర్యులు హెచ్. వి. హాండే, గ్లోబల్ అఛీవర్స్ ఛైర్మెన్ డాక్టర్ ఆర్ సెల్వం,జిల్లా మెజిస్ట్రేట్ హరిదాసు, ఏసిపి రాజారాం, చేతుల మీదుగా పుల్లం రాజు గౌరవ డాక్టరేట్ ను సోషల్ సర్వీస్ విభాగంలో అందించారు. పుల్లంరాజు హైస్కూల్ విద్యాభ్యాసం లోనే విద్యార్థి సంఘ ఉద్యమాలలో చురుకైన పాత్ర పోషించారు. రెండువేల సంవత్సరం నుండి రెండువేల ఐదవ సంవత్సరం వరకు ప్రస్తుత మహబూబాబాద్ జిల్లా బయ్యారం కోదండరామచంద్రాలయం దేవస్థానం అధ్యక్షులుగా సేవలందించి దేవాలయం వద్ద ఒక ఫంక్షన్ హాల్ నిర్మించారు. ఆ ఫంక్షన్ మీద వచ్చే ఆదాయంతో దేవాలయంలో దూప దీప నైవేద్యాలకు ఉపయోగిస్తున్నారు. తొలిసారిగా పంథొమ్మిది వందల తొంబై మూడవ సంవత్సరం లో అయ్యప్ప స్వామి మాల ధరించి అప్పటినుంచి వేల సంఖ్యలో అయ్యప్ప స్వామి నిత్యపూజా విధానం పుస్తకాలు ముద్రించి భక్తులకు ఉచితంగా అందిస్తూ గురుస్వామిగా అనేక సంఘాలలో బాధ్యతాయుతంగా పనిచేస్తున్నారు. రెండువేల పన్నెండో సంవత్సరంలో శ్రీ ధర్మశాస్తా అన్నదాన సేవాసమితి లో సభ్యులు గారి చేరి సంస్థలో చురుకైనా పాత్ర పోషిస్తూ రెండు వేల పదహారవ సంవత్సరంలో సంస్థ ను ట్రస్ట్‌గా రిజిస్ట్రేషన్ చేయించడంలో ప్రధాన పాత్ర పోషించి ట్రస్ట్ కోశాధికారిగా ఉండి సేవలందిస్తూ వస్తున్నారు. అదేవిదంగా శ్రీ దివ్య మణికంఠ అన్నదాన సేవాసమితి ట్రస్ట్ ఏర్పాటు చేయుటకు ప్రధాన సలహా దారునిగా సేవలందిస్తున్నారు. రెండువేల పంతోమ్మిదవ సంవత్సరంలో శ్రీశ్రీశ్రీ సమర్థ సద్గురు సాయినాధ మందిరం నిర్మాణంలో భగస్వాములై దేవాలయ కమిటీ సహాయ కార్యదర్శిగా నిత్యం దేవాలయంలో నిర్వహించే కార్యక్రమాలలో సేవాలందిస్తున్నారు. రెండువేల ఇరవైయవ సంవత్సరంలో అఖిల భారతీయ అయ్యప్పధర్మ ప్రచారసభ ట్రస్ట్‌లో సభ్యులుగా చేరి ఖమ్మం జిల్లా కార్యదర్శిగా, తెలంగాణా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా, రాష్ట్ర కార్యదర్శిగా అనేక సేవా కార్యక్రమాలలో చురుకైన పాత్ర పోషించి ప్రస్తుతం తెలంగాణా రాష్ట్ర అధ్యక్షులు గా సేవా సేవాలందిస్తున్నారు. అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ జాతీయ అధ్యక్షులు అయ్యప్పదాసు ఆధ్వర్యంలో శబరిమల వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఎరుమేలి నుండి పంబ వెళ్లే మార్గమధ్యంలో నారాయణతోడు ప్రాంతంలో సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన మందిరం నిర్మాణ కమిటీ జాయింట్ సెక్రటరీగా అక్కడ నిర్వహించే అన్నదాన కార్యక్రమాలకు వర్కింగ్ కమిటీ చైర్మన్‌గా సేవలందిస్తున్నారు. ఈ అన్నదాన కేంద్రంలో మండల, మకర విళక్కు సమయాల్లోనే కాకుండా శబరిమల దేవాలయం తెరిచి ఉండే ప్రతినెలా ఐదు రోజులు కూడా అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా తెలంగాణ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్వగ్రామం అయిన బయ్యారం గ్రామం లో స్కూల్ పూర్వ విద్యార్థులతో యస్‌యస్‌సి ఆలంని సోసైటీ సెక్రటరీగా తోటి పూర్వ విద్యార్థులతో కలిసి పలు సేవా కార్యక్రమాలలో సేవాలం దిస్తున్నారు. ఈ సందర్భంగా పుల్లంరాజు మాట్లాడుతూ ఈ అవార్డు రావడానికి అవార్డు కమిటీ వారికి తన యొక్క సేవలను తెలియపరిచి అవార్డుకు ఎంపిక చేయడంలో సహకరించిన ఏబిఏపి జాతీయ ప్రధాన కార్యదర్శి బేతి తిరుమల రావుకి కృతజ్ఞతలు తెలిపారు.

# మిర్చి రైతులను ఆదుకోండి

- సామాజిక కార్యకర్త శాంతకుమార్



**మానవపాడు, ఫిబ్రవరి 9 (జనం సాక్షి) :** మిర్చి పంటకు క్వింటాలుకు రూ.25 వేలకు తక్కువ లేకుండా ధరలు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వాన్నికి అలాగే మన జిల్లా కలెక్టర్ కి, జల్లాపురం గ్రామ రైతుల తరుపున డిమాండ్ చేస్తున్నాను అని ఆదివారం అన్నారు. మిర్చి పంటను విదేశాలకు ఎగుమతి చేసేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి మిర్చి రైతుల ప్రయోజనాలను కాపాడాలని పేర్కొన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా , మానవపాడు మండల పరిధిలో జల్లాపురం గ్రామం ఈ గ్రామంలో ఈ సంవత్సరం దాదాపు 7వందల ఎకరాల దాక సొంత భూమి కలిగిన రైతులు మరియు కౌలు రైతులు మిర్చి పంటలు వేసి పండించడం జరిగిందని. సామాజిక కార్యకర్త శాంతకుమార్ గారు అన్నారు మిర్చి పంటకు క్వింటాలుకు రూ.25 వేలకు తక్కువ లేకుండా ధరలు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వాన్నికి అలాగే మన జిల్లా కలెక్టర్ గారికి జల్లాపురం గ్రామ రైతుల తరుపున డిమాండ్ చేస్తున్నానుమిర్చి పంటను విదేశాలకు ఎగుమతి చేసేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి మిర్చి రైతుల ప్రయోజనాలను కాపాడాలని పేర్కొన్నారు. రైతు ఒక ఎకరాని దుక్కిదున్ని విత్తనం వేసిన నాటి నుండి ఒక ఖర్చు అయితే విత్తనం మొలిచిన నాటి నుండి పంట కాపు చేతికి వచ్చేంత వరకు మొక్క అడుగు భాగాన ఫెర్టిలైజర్ , ఆకుల పైన స్ప్రే మందులు మొక్క ఎదుగుదలకు పంట కాపు పట్టడానికి ఇలా 9 రౌండ్ల వరకు బలమైన మందులు వాడి ఒక్కో రౌండుకు రైతు 30వేలు ఖర్చు చేసి పండించాడు.ఈ సంవత్సరం మిర్చిపంటకు నల్లతామర, ఎమిని వైరస్ వంటి తెగుళ్లు వచ్చి దిగుబడి తగ్గిందన్నారు. విత్తనం మొదలు పంట కోత వరకు ఎరువులు, క్రిమిసంహారక మందులు, ఇతర పెట్టుబడి ఖర్చులు విపరీతంగా పెరిగి ఎకరాకు రెండున్నర లక్షలకు పైగానే పెట్టుబడి పెట్టాల్సి వచ్చిందన్నారు. పంట దిగుబడి తగ్గిపోవడం, పెట్టుబడి ఖర్చులు పెరిగిపోవడం, మార్కెట్లో ధరలు కూడా పడిపోవడంతో మిర్చి రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. 2023 డిసెంబరులో క్వింటాలు రూ.23 వేల నుంచి రూ.26 వేల వరకు ధర పలికిందని, ఇప్పుడు రూ.9 వేల నుంచి రూ.12 వేల మధ్యలో ధర పలుకుతోందన్నారు.ఈ ఏడాది పండిన పంటను నిల్వ చేసేందుకు ఈ గ్రామంలో ప్రభుత్వ గిడ్డంగులు సరిపడా స్థలం కూడా లేదన్నారు. ఈ పరిస్థితుల్లో క్వింటాలుకు కనీసం రూ.25 వేలు ధర వస్తే కానీ మిర్చి రైతుకు గిట్టుబాటు కాదన్నారు.

## కాప్రా డివిజన్‌లో జోరుగా అక్రమ నిర్మాణాలు

- టౌన్ ప్లానింగ్ అధికారుల అండదండలు



**కాప్రా, ఫిబ్రవరి 9 (జనం సాక్షి) :** అక్రమ నిర్మాణాన్ని కూల్చవలసిన టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణదారులకు అండగా నిలుస్తున్నారని స్థానిక ప్రజలు వాపోతున్నారు. కాప్రా డివిజన్ పరిధిలోని విజయ హై స్కూల్ పక్కన అక్రమంగా భారీ షెడ్ నిర్మాణం జరుగుతున్న కాప్రా టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. పేదవారు చిన్నపాటి నిర్మాణం చేపడతానే వెంటనే వచ్చి టౌన్ ప్లాంట్ అధికారులు కూల్చివేస్తారు. కానీ కాప్రా డివిజన్ లో భారీ షెడ్డు నిర్మిస్తున్నారు.తమకు టౌన్ ప్లానింగ్ అధికారులు అండదండలు ఉన్నాయని నిర్మాణదారుడు చెప్తున్నాడని స్థానికులు అంటున్నారు. పేదవాడికి ఒక న్యాయం, ఉన్నవాడికి మరొక న్యాయమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కాప్రా టౌన్ ప్లానింగ్ కిందిస్థాయి అధికారి అండదండలు పుష్కలంగా ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నంత అధికారులు స్పందించి.ఈ అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## కాటేదాన్ పారిశ్రామిక వాడలో అగ్ని ప్రమాదం

- బ్యూటీ కాన్సెప్ట్ సెలూన్ చైర్స్ తయారు చేసే కంపెనీలో అగ్ని ప్రమాదం
- షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం సంభవించిందని పోలీసులు అంచనా
- సుమారు మూడు కోట్ల వరకు నష్టం



**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 9 (జనంసాక్షి) :** రాజేందర్ నగర్ నియోజకవర్గంలోని మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని కాటేదాన్ పారిశ్రామిక వాడలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఆదివారం మధ్యాహ్నం కాటేదాన్ పారిశ్రామిక వాడలో ని ఆర్కే బ్యూటీ కాన్సెప్ట్ సెలూన్ చైర్స్ తయారు చేసే కంపెనీలో మధ్యాహ్నం ఒకటి గంట ప్రాంతంలో అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో కాటేదాన్ ప్రాంతమంతా ఉవ్వెత్తున ఎగిసి పడిన మంటలతో ఆ ప్రాంతం అంతా దట్టమైన పొగలు అలుముకొని మబ్బులు కమ్ముకు పోవడంతో ప్రజలందరూ భయభ్రాంతులకు గురైనారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక ప్రత్యేక అధికారి చంద్ర నాయక్ ఘటన స్థలానికి చేరుకొని రెండు ఫైర్ ఇంజన్ల సహాయంతో అవిశ్రాంతంగా శ్రమించారు. కంపెనీలో ప్లాస్టిక్ లెదర్ స్పాంజ్ లు ఉండడంతో వంటలు వెను వెంటనే ఫ్యాక్టరీ మొత్తం వ్యాపించాయి. రెండు ఫైర్ ఇంజన్లతో పోలీసులు అవిశ్రాంతంగా సాయంత్రం 6 గంటల వరకు శ్రమించి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదం షార్ట్ సర్క్యూట్ వల్లనే జరుగుతుందని అగ్నిమాపక పోలీసులు అంచనా వేస్తున్నారు. ఆదివారం కావడంతో ఈ ప్రమాదంలో అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. ప్రమాద ఘటనతో సదరు యజమాని కి సుమారు మూడు కోట్ల వరకు నష్టం జరిగిందని యజమాని వాపోయారు.ఈ కార్యక్రమంలో అగ్నిమాపక అధికారులు సిబ్బంది పాల్గొని పంటలను అదుపు చేశారు.

## ఈ నెల 12,13 తేదీలలో నాగపూర్‌లో ఏబీకే ఎమ్మెస్ మహాసభలు



**ప్రత్యేక ప్రతినిధి, ఫిబ్రవరి 9 (జనంసాక్షి) :** అఖిల్ భారతీయ ఖదాన్ మజ్దూర్ సంఘ్ 19వ త్రైవార్షిక మహాసభలు 12,13 ఫిబ్రవరి 2025 తేదీలలో నాగ్‌పూర్‌లోని రేషింబాగ్‌లో జరుగుతుందని తెలిపినారులి భారత ప్రభుత్వంలోని బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి మహాసభలను ప్రారంభిస్తారు,ముఖ్య అతిథిగా సురేంద్ర కుమార్ పాండే బిఎమ్మెఎస్ ఆల్ ఇండియా ఉప ప్రధాన కార్యదర్శి హాజరవుతారని, బిఎమ్మెఎస్ ప్రధాన కార్యదర్శి, బొగ్గు పరిశ్రమల బిఎంఎస్ ఇంచార్జి కె.లక్ష్మారెడ్డి గౌరవ అతిథిగా పాల్గొంటున్నారులి. కోల్ ఇండియా, సింగరేణి కాలరీస్, నైవేలి లిగ్నైట్ కంపెనీలకు చెందిన 8 అనుబంధ సంస్థలు, సీఎంపీఎఫ్‌కు చెందిన 8అనుబంధ సంస్థల్లో పనిచేస్తున్న మహిళలు సహా 700 మంది ప్రతినిధులు మహాసభలకు హాజరుకానున్నారు. భద్రత, వేగంగా క్షీణిస్తున్న శాశ్వత మానవశక్తి, కాంట్రాక్ట్/అవుట్‌సోర్సింగ్ లేబర్, కాలుష్యం మరియు పర్యావరణ పరిరక్షణ, మెడికేర్ మరియు సిఎంపిఎఫ్/పెన్షన్ మొదలైన సమస్యలపై మహాసభలలో చర్చిస్తుంది మరియు భవిష్యత్ ఆందోళన కార్యక్రమాలను చర్చిస్తుందని తేది 12.2.25న నాగపూర్‌లో భారీ ర్యాలీ చేపడతారు తేది 13.2.25న ఆఫీస్ బేరర్ల ఎన్నిక జరుగుతుందని యాదగిరి సత్తయ్య అధ్యక్షులు, యతిపతి సారంగపాణి ప్రధాన కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపినారు.

# మాదాపూర్ డివిజన్ అభివృద్ధికై ముందుకు సాగుతా..

- పీఏసీ ఛైర్మన్ అరికపూడి



**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 9 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం మాదాపూర్ డివిజన్ అభివృద్ధికి తాను నిజాయితీగా ముందుకు సాగుతానని, డివిజన్ ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వ అండతో అంచలంచలుగా కార్యక్రమాలను కొనసాగిస్తానని రాష్ట్ర ప్రజాపతుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ స్పష్టం చేశారు. ఈ మేరకు మాదాపూర్ డివిజన్ పరిధి శిల్ప పార్కు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 9.20 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన 48 సిసి కెమెరాలను జిహెచ్‌ఎంసి స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్, మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తోకలిసి ఆదివారం ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిల్ప పార్క్ కాలనీవాసులు తన విజ్ఞప్తి మేరకు ముందుకు వచ్చి కాలనీ పరిధిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. మాదాపూర్ డివిజన్ తోపాటు శేరిలింగంపల్లి నియోజక వర్గం పరిధిలోని అన్ని ప్రాంతాలలో ఎక్కడైతే సిసి కెమెరాలు లేవో అక్కడివారు సమిష్టి సహకారంతో సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ శేరిలింగంపల్లి పరిధిలో ఉండడం హర్షించదగ్గ విషయమని, పోలీసు అధికారులు శాంతి భద్రతల పరిరక్షణలో ఎంతో చొరవ చూపడంవల్ల నియోజకవర్గ అభివృద్ధికి మరింత ఆస్కారం లభిస్తుందన్నారు. ఒక్క సిసి కెమెరా 100 మంది పోలీసులతో సమానమని, నేర పరిశోధనకు, శాంతి భద్రతల పరిరక్షణకు సీసీ కెమెరాల తోడ్పాటు ఎంతో ఉంటుందన్నారు. నియోజకవర్గ పరిధిలో ఆయా ప్రాంతాలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు తన వంతు సహకారంగా కోటి రూపాయల ఎమ్మెల్యే పండుగ కేటాయించడం జరిగిందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ఆయా కాలనీలు, పరిసరాలు 24 గంటలు నిఘానేత్రం నీడలో క్షేమంగా ఉండాలంటే ప్రతి కాలనీకి సీసీ కెమెరాల ఆవశ్యకతను చెప్పకనే చెబుతుందన్నారు. మాదాపూర్ డివిజన్ కు సంబంధించిన సమస్యలు, చేపట్టవలసిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై తనకు పూర్తి అవగాహన ఉందని, త్వరలోనే డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో విస్తృతంగా పర్యటించి ప్రజల ద్వారా సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రధానంగా ఆయా కాలనీలలో అసంపూర్తిగా మిగిలిపోయిన సిసి రోడ్ల నిర్మాణం, విద్యుత్తు సమస్యలు తన దృష్టికి వచ్చాయని, మౌలిక వసతుల కల్పనలో ప్రాధాన్యత క్రమంలో ముందుకు సాగుతుందన్నారు. శిల్ప పార్క్ కాలనీలో నెలకొన్న పలు సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని, దశల వారిగా అన్ని పనులు పూర్తిచేయడానికి నీ బద్దతతో ముందుకు సాగుతానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, శిల్పా పార్క్ కాలనీ అసోసియేషన్ ప్రెసిడెంట్ నవీన్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ రామరాజు, సెక్రటరీ లవ కుమార్, ట్రెజరర్ అమర్నాథ్, జాయింట్ సెక్రెటరీ గుప్త, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# వనస్థలిపురం రైతు బజార్ చిరు వ్యాపారుల కడుపులు కొట్టొద్దు

సంక్షేమ సంఘాల ప్రతినిధులకు సిఐటియు విజ్ఞప్తి

**హయత్ నగర్, ఫిబ్రవరి 9 (జనం సాక్షి)**



వనస్థలిపురం రైతు బజార్ దగ్గర చిరు వ్యాపారస్తులతో సిఐటియు ఎల్ బి నగర్ సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో తోపుడు బండ్లు, చిరు వ్యాపార కార్మికులతో జనరల్ బాడీ సమావేశానికి సిఐటియు ఎల్బీనగర్ సర్కిల్ కన్వీనర్ ఆలేటి ఎల్లయ్య అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యం చంద్రమోహన్ హాజరైనారు. ఈ సందర్భంగా చంద్రమోహన్ మాట్లాడుతూ గత 40 సంవత్సరాల నుండి వనస్థలిపురం రైతు బజార్ ముందు చిరు వ్యాపారం చేసుకుంటూ దాదాపు 130 కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నారు. ఈరోజు వ్యాపారం చేస్తేనే కడుపులు నిండని చిరు వ్యాపారస్తులు వారు, వారి "కడుపులు కొట్టొద్దు" అని అన్నారు. ఐదు నెలల క్రితం చుట్టుపక్కల కాలనీవాసులు, సంక్షేమ సంఘాలు ట్రాఫిక్ ఇబ్బందులు అవుతున్నాయని జిహెచ్ఎంసి అధికారులకు, ట్రాఫిక్ అధికారులకు కంప్లీట్ ఇచ్చారు. దాని మూలంగా చిరు వ్యాపారస్తులను, తోపుడుబండ్లను తొలగించారు. సిఐటియు ఆధ్వర్యంలో ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ కి ప్రభుత్వ తరపున ప్రత్యామ్నాయం చూడాలని కోరగా వారి సహకారంతో జిహెచ్ఎంసి, పోలీసు ట్రాఫిక్ అధికారులతో మాట్లాడి ఫిబ్రవరి 7న తిరిగి తిరిగి వ్యాపారాలను పునర్ ప్రారంభించారు. చిరు వ్యాపారస్తుల్ని తొలగించాలని సంక్షేమ సంఘాల పేరుతో కాలనీవాసులు కాంగ్రెస్ పార్టీ ఎల్బీనగర్ ఇన్చార్జి మధుయాస్ ని విమర్శిస్తూ వార్తలు పెడుతున్నారు. దయచేసి రాజకీయాలు వ్యాపారస్తుల పైన రుద్దవద్దని ఎమ్మెల్యే జోక్యం చేసుకొని టిఆర్ఎస్ పార్టీ సంబంధించిన నాయకులతో వార్తలు ఇప్పించవద్దని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. ప్రజలకు, చిరు వ్యాపారస్తులకు ట్రాఫిక్ అంతరాయం, ఇబ్బందులు రాకుండా చూడాలని ఎమ్మెల్యే ని ఈ సందర్భంగా కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో భారతమ్మ, చిన్న, శ్రీను, కోటేశ్వరరావు, జయమ్మ, నరసమ్మ, లక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# రైతు నిరసన దీక్షా కార్యక్రమం విజయవంతం చేయండి

మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి

**కొడంగల్, ఫిబ్రవరి 09 (జనం సాక్షి)**



కొడంగల్ నియోజకవర్గం కోస్గి మున్సిపల్ కేంద్రంలో కళాశాల మైదానంలో సోమవారం 10 గంటలకి రైతు నిరసన దీక్ష కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బిఆర్ఎస్ ముఖ్య నాయకులు విచ్చేయుచున్న సంధర్భంగా కొడంగల్ పట్టణ కేంద్రంలో కొడంగల్ మండల ముఖ్య నాయకులు కార్యకర్తలు మాజీ ప్రజాప్రతినిధులు యువకులు రైతులతో సమావేశ ఏర్పాటు చేశారు. రేపటి కార్యక్రమానికి అనుసరించాల్సిన విధివిధానాలను దిశ నిర్దేశం చేసి కార్యక్రమములో రైతులు,నాయకులు కార్యకర్తలు అదిక సంఖ్యలో తరలివచ్చి విజయ వంతంచేయాలి కోరారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# గురునాథం చెరువు సుందరీకరణకు కట్టుబడి ఉన్నా..

**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 09 (జనంసాక్షి) :**



మియాపూర్ డివిజన్ పరిధి గురునాథమ్ చెరువు సుందరికరణ విషయంలో రాజీలేని పోరాటం చేస్తూ ముందుకు సాగుతానని రాష్ట్ర ప్రజాపతుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. నెక్సస్ సెలెక్ట్ మాల్స్ పరిశ్రమ తన సోషల్ కార్పొరేట్ రెస్పాసిబుల్ ఫండ్స్ ద్వారా మల్లిగవాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా నిర్వహిస్తున్న చెరువు పునర్జీవనంలో భాగంగా సుందరికరణ మరియు పునరుద్ధరణ పనులను మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తోకలిసి ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ అరెకపూడి మాట్లాడుతూ గురునాథం చెరువు పునరుద్ధరణ ప్రభుత్వం, పరిశ్రమలు మరియు సమాజంమధ్య భాగస్వామ్య ప్రయత్నాలు అర్థవంతమైన పర్యావరణ పురోగతిని ఎలా నడిపించగలదో చెప్పడానికి ఒక శక్తివంతమైన ఉదాహరణగా నిలుస్తుందన్నారు. ఈ ప్రాజెక్ట్ కీలకమైన సహజ వనరులను పునరుజ్జీవింపజేయడమే గాకుండా రాష్ట్రవ్యాప్తంగా భవిష్యత్తులో సుస్థిరమైన అభివృద్ధికోసం ఒక గొప్ప ఉదాహరణగా నిలుస్తుందనడంలో సందేహం లేదన్నారు. గురునాథం చెరువుకు ఈ సుందరీకరణ పనులవల్ల దశ దిశ తిరిగినట్లేనని, సుదీర్ఘ ఎదురుచూపుకు నేటితో శాశ్వత పరిష్కారం లభించినట్టేనని భావించవచ్చన్నారు. చెరువుల పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు అయినప్పుడే మెరుగైన ఫలితాలు ఉంటాయని ఈ సందర్భంగా అరికపూడి పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో నెక్సస్ సెలెక్ట్ మాల్స్ ఐటి సంస్థ ప్రతినిధులు రామ్ బొట్ల, చైతన్య, కాలనీ వాసులు రమేష్, అవినాష్, లోకేష్, నాగసుబ్బరెడ్డి, కార్తికేయ శ్రీనివాస్, రామకృష్ణ, సాయి ప్రశాంత్, వివేకానంద, రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ మాస్టర్స్ పోటీ విజేతలకు పతకాలు

**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 09 (జనంసాక్షి)**



కేరళలో నిర్వహించిన జాతీయ మాస్టర్స్ పోటీల్లో విజేతలుగా నిలిచి పథకాలను సాధించిన ఆయా క్రీడాకారులను తెలంగాణ సంయుక్త కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా మాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కొండా విజయ్ కుమార్ ఆదివారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊహించినట్టుగానే కేరళ రాష్ట్రంలో నిర్వహించిన జాతీయ మాస్టర్స్ పోటీల్లో పలువురు క్రీడాకారులు విజేతలుగా నిలిచి పథకాలను ఒడిసి పట్టడం జరిగిందన్నారు. చందానగర్ హుడాకాలనీ లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని వివిధ క్రీడాంశాలలో పథకాలు సాదించిన వారిని ప్రత్యేకంగా అభినందిస్తూ రానున్న రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి పోటీల్లో మరిన్ని పథకాలు సాధించడానికై జిల్లా పరిధిలోని ఆయా స్టేడియాలలో నిపుణులైన శిక్షకులచే ప్రత్యేక శిక్షణ అందచేస్తామని కొండా విజయ్ తెలిపారు. చందానగర్ సర్కిల్ పరిధి పిజెఆర్ స్టేడియం తోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో శిక్షణ పొందిన అజయ్ కుమార్, రామారావు, ఏసురత్నం, నాగలక్ష్మి, స్వాతి, మానసపతి, శివాలీలరెడ్డి, స్వాతి గౌడ్, జయలక్ష్మి, మల్లేశ్వరి, శైలజ, భావాని తదితరులు పథకాలు సాదించిన వారిలో ఉన్నారు. మొత్తం 21 పథకాలు రాగా అందులో 7 బంగారు, 7 రోజంతా, 7 కాంస్య పథకాలు ఉండడం గమనార్హం. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నూనె సురేందర్, ట్రెజరర్ స్వాతి తోపాటు మాస్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రసన్న హరికృష్ణకు పట్టభద్రుల నీరాజనం

**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 09 (జనంసాక్షి) :**





**మద్దతు ప్రకటించిన ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ అసోసియేషన్**

**హుజూరాబాద్, జమ్మికుంట, సిద్దిపేటలో ఆత్మీయ సమ్మేళనాలు**

కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్ధి ప్రసన్న హరికృష్ణకు పట్టభద్రులు, నిరుద్యోగులు, ఉద్యోగులు నీరాజనం పట్టారు. ఆదివారం ఆయన హుజూరాబాద్, జమ్మికుంట, సిద్దిపేటలో నిర్వమించిన ఆత్మీయ సమ్మేళనాల్లో పాల్గొన్నారు. ఈ సమ్మేళనాల్లో ఆయన మాట్లాడుతూ... ప్రపంచ చరిత్రలో ఎక్కడ లేని ఎలక్షన్లు చూసిన , బై ఎలక్షన్లను బైపాస్ సర్జరీ చేసిన పట్టభద్రులు ప్రపంచంలో ఎక్కడ లేనివిధంగా ఒక ఓటుకు పదివేల చొప్పున మిమ్మల్ని ప్రలోభలకు గురిచేసినప్పటికి అప్పుడున్న ప్రభుత్వానికి బుద్ధి చేప్పిన నేపధ్యం జమ్మికుంట, హుజూరాబాద్ ప్రాంతావాసులకు ఉందని ఇప్పుడు కూడ మీ తీర్పు అదే రూపంలో, అదే కోణంలో పునరావృతం కావాలన్నారు.పట్టభద్రులకు అనేక సమస్యలున్నాయని విద్యా వ్యాపారం చేసే వారికి పట్టభద్రుల సమస్యలపై ఎలాంటి అవగాహన లేదు. తమ విద్యా వ్యాపారాన్ని పెంచుకోవడానికి, పేద, మధ్యతరగతి విద్యార్థుల నుండి అధిక ఫీజులు వసూలు చేసి సంపాధించిన ఆస్తులను కాపాడుకోవడానికే రాజకీయాల్లోకి వచ్చిన వ్యక్తులు ఇప్పుడు పట్టభద్రుల గురించి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. తన విద్యాసంస్థలో పని చేస్తున్న వారికి తక్కువ జీతాలు ఇస్తు వారి పొట్టలు కొడుతూ వెట్టిచాకిరి చేయించుకున్న వ్యక్తులు ఇప్పుడు పట్టభద్రులు, నిరుద్యోగుల గురించి, వారి సమస్యల గురించి మాట్లాడడాన్ని ఆయన ఎద్దేవా చేసారు. విద్యారంగ ప్రొఫెసర్‌గా పట్టభద్రుల సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉండి వారి సమస్యల పరిష్కారానికి ప్రశ్నించే గొంతుకగా మారి ఈ ఎన్నికల బరిలో నిలిచిన తనను ఆదరించి ఆశీర్వదించాలని కోరారు. మీరు ఉన్నరనే భరోసాతో తన 19 సంవత్సరాల ప్రభుత్వ ఉద్యోగ జీవితానికి రాజీనామా చేసి నిరుద్యోగులు, ఉద్యోగులు, యువత పక్షాన ప్రశ్నించే గొంతుకనై వారి సమస్యలను పరిష్కరింప చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలిచాన్నారు. ఈ సమ్మేళానాల్లో హుజూరా బాద్ , జమ్మికుంట, సిద్దిపేట స్థానిక పట్టభద్రులు, హరికృష్ణ టీమ్ సభ్యులు, నిరుద్యోగులు, భారీ సంఖ్యలో పాల్గోని ప్రసన్న హరికృష్ణకు మద్దతు ప్రకటించారు.

# ట్రాఫిక్ నియంత్రణకు రూ.7032 కోట్లు

**హైదరాబాద్, ఫిబ్రవరి 09 (జనంసాక్షి)**



**హైదరాబాద్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ట్రాన్స్పరెన్సీ ఇన్నోవేటివ్ ప్రక్రియకు శ్రీకారం**

**హెచ్ సిటి ద్వారా చేపట్టనున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించిన కమిషనర్ ఇలంబర్తి**

హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజా పాలన ప్రభుత్వం రథసారథి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినూత్న అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారు. నగరంలో ముఖ్యంగా ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని హెచ్-సిటి (హైదరాబాద్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ట్రాన్స్పరెన్సీ ఇన్నోవేటివ్ ) ద్వారా నగర నలువైపులా ట్రాఫిక్ నియంత్రణకు రూ.7032 కోట్ల వ్యయంతో చేపట్టేందుకు శ్రీకారం చుట్టారు. నగరంలో ట్రాఫిక్ రద్దీ ప్రాంతాలను ముందస్తుగా గుర్తించి అక్కడ ట్రాఫిక్ నియంత్రణ కొరకు ఫ్లైఓవర్లు, అండర్ పాస్ లు, రైల్వే అండర్ బ్రిడ్జిలతో పాటు రోడ్డు విస్తరణ పనులను ప్రతిపాదించారు. ఈ నేపథ్యంలో అవసరమైన నిధులు ముఖ్యమంత్రి పరిపాలన అనుమతి ఇప్పటికే ఇవ్వడం జరిగింది.చేపడుతున్న పనులను ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి సమీక్షిస్తూ అధికారులకు తగిన సూచనలతో దిశ నిర్దేశం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి శనివారం మున్సిపల్ అధికారులతో పాటు జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించి పనుల వేగవంతానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించిన విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఆదేశాల మేరకి జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి ప్రాజెక్టు సిఈ, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి కమిషనర్ ప్రతిపాదించిన ప్రాంతాల్లో పర్యటించి పరిశీలించారు. నానల్ నగర్, రేతిభౌలి, ఖాజాగూడ జంక్షన్, ట్రిపుల్ ఐటి, విప్రో జంక్షన్ డివల్ ఎఫ్ జంక్షన్ ప్రతిపాదించిన స్థల పరిశీలన చేసి అట్టి పనులకు టెండర్ పక్రియని వేగవంతంగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన భూసేకరణ పనులను పూర్తిచేసి పనులను చేపట్టేందుకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతున్న సరోజినీ దేవి కంటి ఆసుపత్రి నుండి రాడ్ సన్ బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 1 చింతల్ బస్తీ మీదుగా ఖైరతాబాద్ వరకు రోడ్డు విస్తరణలో భాగంగా సరోజినీ దేవి, చింతలబస్తీ వద్ద కమిషనర్ అధికారులతో పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ ఇలాంబర్తి మాట్లాడుతూ... ప్రజాపాలన ప్రభుత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన వాగ్దానం మేరకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఆర్థికంగా ఆదుకుంటున్నారని అదే విధంగా గ్రేటర్ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేస్తున్న నేపథ్యంలో హెచ్-సిటి ద్వారా రూ. 7032 కోట్ల రూపాయలను మంజూరు చేశారు. ఇట్టి నిధులతో 25 పనులలో ఫ్లై ఓవర్లు, అండర్ పాస్ లు, ఆర్ ఓ బి ల నిర్మాణాలు చేపట్టనున్నామని, మరో 13 పనులు రోడ్డు విస్తరణ చేపట్టనున్నట్లు తెలిపారు. ఇట్టి పనులను టెండర్ పక్రియను పూర్తిచేసి పనులను చేపట్టేందుకు సిద్ధం చేస్తున్నట్లు కమిషనర్ వివరించారు.

# వైద్యులు జయప్రసాద్‌కు ఉత్తమ అవార్డు

**తాండూరు ఫిబ్రవరి 9(జనంసాక్షి)**



పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ జయప్రసాద్ (జనరల్ సర్జన్)కు ఉత్తమ అవార్డు దక్కింది. రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా ఉత్తమ వైద్యుడిగా అవార్డును అందుకున్నారు. శనివారం రాత్రి హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ బిష్ణుదేవ్ వర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ వైద్యులు.జయప్రసాద్ కు ఉత్తమ అవార్డును అందజేశారు.గత నెల జనవరి 26 గణతంత్ర దినోత్సవ సందర్భంగా డాక్టర్ జయప్రసాద్ జిల్లా ఉత్తమ వైద్యుడుగా అవార్డును పొందారు. నెల రోజుల వ్యవధిలోనే మరోసారి ఉత్తమ అవార్డును దక్కించుకున్నారు. తాండూ రు వైద్యుడికి దక్కిన గౌరవానికి పలువురు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్.జయప్రసాద్ మాట్లాడుతూ ఉత్తమ అవార్డులు తనపై గౌరవాన్ని, బాధ్యతను పెంచాయన్నారు. ప్రజలకు మరిన్ని వైద్య సేవలు అందించేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

# పొలంలో కూలి పని చేస్తూ ఫిట్స్ వచ్చి వ్యక్తి మృతి

**శామీర్ పేట (జనం సాక్షి ) :**



పొలంలో కూలి పని చేస్తున్న వ్యక్తి ఫిట్స్ వచ్చి మృతిచెందిన సంఘటన శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసు కుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మూడు చింతలపల్లి మండలం కేశవరం గ్రామానికి చెందిన తప్పట్ల రాములు కు చెందిన వ్యవసాయ పొలంలో కూలి పని చేయడానికి వచ్చిన బొగ్గుల గణేష్ (32) వృత్తి కూలి పని చేస్తూ జీవిస్తున్నాడు. ఆదివారం కూలి పని చేస్తుండగా ఫిట్స్ రావడంతో బురద పొలంలో పడిపోయి ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న శామీర్ పేట పోలీసులు శవపంచనామ నిర్వహించి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు శామీర్ పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# సహకార సంఘం బలోపేతానికి కృషి



**మాగనూరు ఫిబ్రవరి 9 (జనం సాక్షి)**

ప్రాథమిక సహకార సంఘం బలపేతానికి కృషి చేస్తానని మహబూబ్నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ అన్నారు. ఆదివారం మండలంలోని నల్లగట్టు మారమ్మ దేవాలయం 86 లక్షల రూపాయలతో నిర్మించిన ఉమ్మడి మండల ప్రాథమిక సహకార సంఘం నూతన భవన ప్రారంభోత్సవానికి విచ్చేసి మాట్లాడారు పిఎసిఎస్ సొసైటీ ద్వారా వచ్చిన లాభాలతో రూపాయి అప్పు లేకుండా నిర్మించడం అభినందించదగ్గ విషయమని అన్నారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్ష పాలకవర్గ సభ్యులను సొసైటీ అధికారులను అభినందించారు. గోధుమల నిర్మాణం కొరకు నా వంతు సహకారం అందిస్తానని అన్నారు. అదేవిధంగా ఉమ్మడి జిల్లా డీసీసీబిచైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా లేనివిధంగా ఈ సొసైటీలో రూపాయి అప్పు లేకుండా నూతన భవన నిర్మాణం చేపట్టడం గర్వించదగ్గ విషయం అన్నారు. సబ్సిడీ ద్వారా గొర్లు, బర్లు, ఎడ్యుకేషన్. హౌసింగ్ ఎటువంటి లోన్లైన మంజూరు చేస్తామని ఆయన తెలిపారు ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇదివరకు తీసుకున్న ఎల్ టి లోన్లలో వన్ టైం సెటిల్మెంట్ ద్వారా 15 రోజుల వరకు అవకాశం ఉందని రైతులు తీసుకున్న రుణాలు చెల్లించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఎంపీ డీకే అరుణ, డిసిసిబి బ్యాంక్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ వెంకట్ రెడ్డి .పాలకవర్గ సభ్యులను సొసైటీ అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి కొండయ్య, సోమశేఖర్ గౌడ్, శంకరొల రవి కుమార్, బలరాం రెడ్డి, బీజేపీ ఉమ్మడి మండల అధ్యక్షులు నల్లే నర్సప్ప, సొసైటీ సీఈవో ఆంజనేయులు కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, సగరం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# కొడంగల్‌ను దత్తత తీసుకొని ఏమి వొరగబెట్టారని వస్తున్నావు..



పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి

**కొడంగల్ ,ఫిబ్రవరి 09(జనం సాక్షి ):-**

కొడంగల్ నుదత్తత తీసుకొని ఏమి హెురగబెట్టావని కొడంగల్ వస్తున్నావనీ వికారాబాద్ జిల్లా డిసిసి అధ్యక్షులు పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి అన్నారు.కొడంగల్ పట్టణ కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్ నియోజకవర్గాన్ని కాడ పేరుతో కొడంగల్ అభివృద్ధికి సమగ్ర నమూనా తయారు చేసి అభివృద్ధి చేస్తుంటే చూసి ఓర్వలేకపోతున్నారన్నారు.గత పది సంవత్సరాలలో బిఆర్ఎస్ పాలనలో కొడంగల్ నియోజకవర్గాన్నిదత్తత పేరుతో నిండా ముంచింది సరిపోలేదా కొడంగల్ నియోజకవర్గ ప్రజలు మిమ్మల్ని నమ్మి మోసపోయారు.మీ యొక్క మోసాన్ని గుర్తించి ప్రజలు గడిచిన ఎలక్షన్లలో ఇక్కడి ప్రాంత బిడ్డగా రేవంత్ రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించి ముఖ్యమంత్రిగా చేశారు అన్నారు.ఈ యొక్క నియోజకవర్గం అభివృద్ధి చెందడం కేటీఆర్ కు ఇష్టం లేక ఇష్టం వచ్చినట్లు ఇక్కడ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తుంటే ఇక్కడ ప్రజలు చూస్తూ ఊరుకోరాన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోడంగల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేక గత కొన్ని రోజుల క్రితం రైతులను రెచ్చగొట్టి అభివృద్ధి పనులు అడ్డుకునే ప్రయత్నం చేశావు అన్నారు.కోడంగల్ నియోజకవర్గలో ఇంజనీరింగ్ కళాశాల,మహిళా డిగ్రీ కళాశాల,అలాగే మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల నిర్మాణం చేపట్టవద్దని లక్ష్యంతో వస్తున్నావా నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి ఈ యొక్క రోడ్ల నిర్మాణం పనులు ఆపివేయాలని వస్తున్నావా సమాధానం చెప్పాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
10 ఫిబ్రవరి 2025

# వరి పంట నష్టపోయిన రైతుల పొలాలను అధికారులు సందర్శించాలి

- నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులకు రూ. 50 వేల నష్టపరిహారం అందించాలి
- నకిలీ విత్తనాలు అందించిన సీడ్స్ కంపెనీలను సీజ్ చేయాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి
- సిపిఎం నాయకుడి మృతి పట్ల సంతాపం తెలిపిన పార్టీ నాయకులు



**పెన్ పహాడ్ ఫిబ్రవరి 09 (జనం సాక్షి)లి:** నకిలీ విత్తనాలతో మోసపోయిన రైతుల పంట పొలాలను జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు సందర్శించి నష్టపరిహారాన్ని అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి, రాష్ట్ర రైతు సంఘం నాయకులు మల్లు నాగార్జున రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని న్యూ బంజారాహిల్స్ తండాలో నకిలీ విత్తనాలు సాగు చేసి పంట నష్టపోయిన గిరిజన రైతు ధారావత్ అంజి నాయక్ వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించి మాట్లాడారు. కొన్ని ప్రభుత్వ అనుమతులు లేని సీడ్స్ కేంద్రాలు రైతులకు నకిలి విత్తనాలు అంటగట్టాయని అందులో భాగంగానే గ్రామానికి చెందిన అంజి నాయక్ నల్లగొండలోని రైతు సేవ సీడ్స్ కేంద్రం ద్వారా 404 ప్లస్ విత్తనాలను 25 బస్తాలు, బస్తాకు వెయ్యి రూపాయలు చొప్పున 25 వేలు ఖరీదు చేసి తీసుకొచ్చి నారు పోసి సాగుచేసిన కొద్ది రోజులకే వరి కర్రలు కొన్ని ఈనడం, కొన్ని పొట్ట దశకు రావడం, మరికొన్ని కరుకుదశలో ఉండటం వల్ల పంట చేతికి వచ్చే పరిస్థితి లేదని గ్రహించడం జరిగిందన్నారు ఈ రైతు ఏడెకరాలు పంట సాగు చేసి సుమారు రెండు లక్షలకు పైగా పెట్టుబడి పెట్టడం జరిగిందని తన సొంత పొలమే కాకుండా కౌలు కూడా సాగు చేయడం చేశారు. ఇలాంటి మరి కొందరు రైతులు గ్రామంలో 20 ఎకరాల పైగా సాగు చేశారని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని రైతు తమ వద్ద ఆవేదన వ్యక్తం చేశారని అన్నారు. వీటితోపాటు గరిడేపల్లి మండలం గడ్డిపల్లి గ్రామానికి చెందిన కొన్ని సీడ్స్ కేంద్రాలు రైతులకు సన్న రకం నకిలీ వరి విత్తనాలు విక్రయించడంతో వారి పరిస్థితి కూడా ఇలాగే ఉండి ఇబ్బందులు పడుతున్నారని వెంటనే జిల్లా సంబంధిత అధికారులు స్పందించి పంట పొలాల నష్టాన్ని అంచనా వేసి ఎకరాకు 50 వేల రూపాయల నష్టపరిహారాన్ని అందించాలని లేనియెడల రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం గ్రామానికి చెందిన సిపిఎం నాయకులు ధారావత్ అమీనా అనారోగ్యంతో మృతిచెందగా ఆయన మృతదేహంపై పార్టీ జెండాను కప్పి జోహార్లు అర్పించారు కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గుంజ వెంకటేశ్వర్లు, రైతు సంఘం రాష్ట్ర నాయకులు దండ వెంకటరెడ్డి, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, రజిత, కృష్ణారెడ్డి, రైతులు ధారావత్ అంజి నాయక్, దారావత్ హరి, ఇస్లావత్ వెంకన్న నాయక్, దారావత్ శ్రీను నాయక్, తదితరులు, పాల్గొన్నారు.

# బస్సులో 25 లక్షల చోరీ

- చెన్నై నుండి హైదరాబాద్ వెళ్తుండగా నార్కట్పల్లి వద్ద చోరీ
- టిఫిన్ చేసి వచ్చే లోపల డబ్బులు మాయం

**నార్కట్ పల్లి ఫిబ్రవరి 09 (జనం సాక్షి)** నార్కట్పల్లి మండల శివారులో ఆగి ఉన్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో నుండి 25 లక్షల రూపాయలను చోరీ చేయడం జరిగింది.పూర్తి వివరాల్లోకి వెళితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్ల కు చెందిన వెంకటేష్ అనే వ్యక్తి 25 లక్షల రూపాయలతో AR 11A 0100 నంబర్ గల షామా సర్దార్ ట్రావెల్స్ బస్సు లో చెన్నై నుండి హైదరాబాద్‌కి వెళుతుండగా ఆదివారం నాడు మార్గమధ్యలో నార్కట్పల్లి శివారులో ఉన్న పూజిత హెూటల్ వద్ద ఉదయం ప్రయాణికుల అల్పాహారం కోసం బస్సు ఆపగా వెంకటేష్



తన బ్యాగును బస్సు సీట్లో పెట్టి టిఫిన్ చేయడానికి వెళ్లి తిరిగి వచ్చి చూడగా బ్యాగులో ఉన్న 25 లక్షల రూపాయలు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా సిఐ కైగూరి నాగరాజు,ఎస్ ఐ డి క్రాంతి కుమార్ లు ఘటన స్థలానికి చేరుకుని బస్సులోని ప్రయాణికులను విచారణ చేసి సీసీ పుటేజీని పరిశీలించడం జరిగింది.బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.బాధితుల నిర్లక్ష్యం పట్ల కూడా పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.సీసీ పుటేజని పరిశీలించిన పోలీసులు అనుమానాస్పదంగా బ్యాగును తీసుకొని వెళ్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

# ప్రైవేట్ ఉపాధ్యాయులకు 12 నెలల జీతం ఇవ్వాలి



- ఉద్యోగ భద్రతతో పాటు హెల్త్ కార్డులు ఇవ్వాలి
- టీపియుఎస్ 2025 నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

**సూర్యాపేట ప్రతినిధి, ఫిబ్రవరి 9 (జనంసాక్షి)** : రాష్ట్రంలోని ప్రతి ప్రైవేట్ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు 12 నెలల జీతాన్ని యాజమాన్యాలు ఇవ్వాలని తెలంగాణ ప్రైవేట్ ఉపాధ్యాయ సంఘం వ్యవస్థపాక రాష్ట్ర అధ్యక్షుడు బస్కూరి కేపీ కుమార్ డిమాండ్ చేశారు.ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో టీపియుఎస్ నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆ సంఘ జిల్లా నాయకులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు.ప్రైవేట్ ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రతతో పాటు హెల్త్ కార్డులను ప్రభుత్వం మంజూరు చేయాలని అన్నారు.ప్రైవేట్ టీచర్లపై వివిధ పాఠశాలల్లో జరుగుతున్న దాడులను రాష్ట్ర ప్రభుత్వం అరికట్టాలని కోరారు. అకారణంగా ప్రైవేట్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులను తొలగించరాదని అన్నారు. అనంతరం టీపియుఎస్ జిల్లా అధ్యక్షులు పిల్లలమర్రి కళింగం మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎల్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావు, టీపీటీఎల్ఎఫ్ జిల్లా అధ్యక్షులు జె.నరసింహారావు, టీపియుఎస్ జిల్లా అధ్యక్షులు పిల్లలమర్రి కళింగం, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్, జిల్లా గౌరవ అధ్యక్షులు బచ్చలకూరి జానయ్య, జిల్లా ఉపాధ్యక్షులు మహేష్, యాదవ్, శెట్టి రాజశేఖర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.రమేష్, జిల్లా అధికార ప్రతినిధి ఎం.సోమరాజు, జిల్లా సంయుక్త కార్యదర్శి కంచి వెంకన్న, కట్టంకూరి లక్ష్మణ్, జిల్లా కోశాధికారి బొడ్డు బాలకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు గాజుల లక్ష్మణ్, రాపర్తి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎగిరిన సిద్దిపేట కీర్తి పతాకం

- వండర్ బుక్ ఆఫ్ రికార్డ్
- శత సహస్ర సూర్య నమస్కారాల ప్రదర్శన సక్సెస్





**సిద్దిపేట బ్యూరో, ఫిబ్రవరి 9 (జనంసాక్షి) :** ప్రపంచ యవనికపై సిద్దిపేట కీర్తి పతాక మరోమారురెపరెపలాడింది. సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన శత సహస్ర సూర్య నమస్కారల ప్రదర్శన అద్భుతంగా సాగింది. లక్ష్యసూర్యనమస్కారాలు చేయడం లక్ష్యం కాగా నాలుగు లక్షల రెండు వేల ఒక్క వంద యాబై నాలుగు 4, 02,154 సూర్య నమస్కారాలు చేసి యోగ సాధకులు ప్రపంచానికి ఆరోగ్య సందేశాన్ని ఇచ్చారు. వండర్ బుక్ ఆఫ్ ఇంటర్నేషనల్ వారు ఇంటర్నేషనల్ రికార్డులో ఈ సూర్య నమస్కారాలు నమోదు చేశారు. వండర్ బుక్ ఆఫ్ రికార్డు ఇంటర్నేషనల్ ప్రతినిధి జ్యోతి నిర్వాహకులకు సర్టిఫికెట్ , మెడల్ అందజేశారు.తెలంగాణ రాష్ట్రంలోని 20 జిల్లాల నుంచి 1484 మంది యోగ సాధకులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ఉత్సాహాన్ని ప్రకటించారు. సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ , వ్యాస మహర్షి యోగా సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ప్రారంభమైన శత సహస్ర సూర్య నమస్కారాల ప్రదర్శన జాతీయస్థాయిలో రికార్డు నెలకొల్పింది. రాష్ట్ర యోగ అధ్యయన పరిషత్ సభ్యులు, జాతీయ యోగ మెడలిస్ట్, ప్రముఖ యోగ గురువు తోట సతీష్ నేతృత్వంలో ప్రదర్శన , రాష్ట్రస్థాయి పోటీలు జరిగాయి. 25 సంవత్సరాల లోపు, 25 సంవత్సరాలపై వయస్సు వారికి వేరువేరుగా రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. నాలుగు విభాగాల్లో జరిగిన పోటీల్లో ఐదు సంవత్సరాల నుంచి మొదలుకొని 72 సంవత్సరాల వయసున్న వారు ఉత్సాహంగా పాల్గొని ఉత్తేజాన్ని నింపారు. వండర్ బుక్ ఆఫ్ రికార్డు ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులకు, యోగసాధకులకు అతిథులు మెడల్ , సర్టిఫికెట్లను ప్రధానం కార్పొరేట్ శక్తులు , బహుళజాతి సంస్థలు వివిధ కాలుష్యాలతో ప్రపంచంపై అనారోగ్యాలను కురిపిస్తుంటే మీరు యోగ సాధనలతో ఆరోగ్యాన్ని పెంపొందిస్తున్నారని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షులు విరాహత్ అలీ ప్రశంసించారు. పీల్చే గాలి, తాగే నీరు , తరిగిపోతున్న మానవ విలువలు మానవాళికి ఉప్పు తెస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాసుల మహేందర్ రెడ్డి చైర్మన్ సిద్ధి వినాయక ప్రాపర్టీ డెవలప్మెంట్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ సిద్దిపేట్ వికాస్ అశ్విత్ రెడ్డి ఎస్సార్ ట్రస్ట్ , డాక్టర్ భాస్కర్ లోహిత్ సాయి హాస్పిటల్, సతీష్ రెడ్డి, జవాన్ గార్డింగ్ సర్వీస్ ఈ కార్యక్రమానికి ఆర్థికంగా సహాయ సహకారాలు అందించారు. సిద్దిపేట జిల్లా వర్కింగ్ జర్నలిస్టుల సంఘం అధ్యక్షులు రంగాచారి మాట్లాడుతూ సిద్దిపేట యోగా వైభవాన్ని ప్రపంచానికి అద్భుతంగా చాటడం గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాస మహర్షి యోగా సొసైటీ చైర్మన్ డాక్టర్ అరవింద్ , సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు తోట అశోక్ , యోగ సొసైటీ అధ్యక్షులు నిమ్మ శ్రీనివాస్ రెడ్డి , ప్రోగ్రాం కన్వీనర్ విక్రమ్ రెడ్డి జిల్లా , టిఎన్జీవోల సంఘం అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు పరమేశ్వర్, ట్రస్మా సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, శిక్షకులు తోట సంధ్య, చిప్ప ప్రభాకర్, రాములు, అయితే అంజయ్య ,బస్వ రాజ్ కుమార్ , నర్సింలు, హరి, కొండా శ్రీనివాస్, ప్రసాద్, కల్లెపల్లి శ్రీను, కవిత, వాసవి, సంధ్య ,మంజుల తదితరులు పాల్గొన్నారు.

# చిత్రపురి సమస్యలపై అధికారులు స్పందించాలి

**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 9 (జనంసాక్షి) :** మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని చిత్రపురి కాలనీలో అధికారులు చొరవ చూపి కుంటుపడిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలని రాష్ట్ర సమితి మణికొండ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ ఆధ్వర్యంలో సమస్యలపై చిత్రపులి కాలనీవాసులతో కలిసి అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా రోడ్డు, నీటి సమస్య తీవ్రంగా ఉందని, ఇక్కడ రిజర్వాయర్ అత్యవసరం అని, చిన్నపిల్లలకు కేటాయించిన టాట్ లాట్ ఆట స్తలంలో రో హౌస్ లు కట్టారని తెలియ పరుస్తూ, సొసైటీ బై లాస్ ప్రకారం ఎలాంటి అభివృద్ధి కార్యక్రమం చెయ్యాలన్న కాలనీ వాసులు ముందుకి రావాలని ఉదాహరణగా రోడ్డు వేయడానికి మున్సిపాలిటీ బడ్జెట్ కేటాయించిననూ వీరు అభ్యంతరం చెప్పినందు వలన రోడ్డుల దుస్థితి కొనసాగుతుందనీ, అమ్మా పెట్టదు అడుక్కోనివ్వదు అనేచెందగా సొసైటీ ముందుకు సాగుతున్నది అని అనడానికి ఇది ఒక పెద్ద నిదర్శనమని,మునిసిపాలిటీ అధికారులు కలుగ చేసుకొని మొత్తంగా వీధి వీధికి బందోబస్తు సిమెంట్ రోడ్డులతో పాటు రో హౌస్ నుండి ఎల్.ఐ.జి వరకు రహదారి ఏర్పాటు చేయాలని, మార్గ మధ్యలో ప్రభాకర్ రెడ్డి విగ్రహం దగ్గరలో క్యాంబియాంట్ అమరాంతిన్ వారు ఎలక్ట్రిసిటీ హై టెన్షన్ వైర్ క్రింద గల స్థలాన్ని స్థానిక నాయకులు కుమ్మక్కై వారి సహకారంతో తమ ప్రాజెక్టులో కలుపుకోవడం జరిగిన విషయం తెలియ పరచినారు. తదుపరి చిత్రపురి ఎల్.ఐ.జి, ఈ.డబ్లు.ఎస్ వేల్ఫేర్ అసోసియేషన్ ద్వారా 1912 ఫ్లాట్స్ గల సముదాయానికి వెళ్లి అక్కడ స్థానిక వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల అభిప్రాయ సేకరణ ప్రకారం స్థానికంగా నీరు విద్యుత్ , రోడ్ల నిర్వహణ సరిగ్గానే ఉన్నదని, షాపింగ్ కాంప్లెక్స్ ద్వారా వచ్చే ఆదాయం, దానిపై ఉన్న పై అంతస్తులో నిర్వహిస్తున్న బడి పిల్లల నెలసరి ఫీసులు మొత్తంగా ప్రభాకర్ రెడ్డి చిత్రపురి కాలనీ హౌసింగ్ సొసైటీ వాళ్ళు కైవసం చేసుకుంటున్నారనీ పిర్యాదు చేయడం చేశామన్నారు. కావున ఇట్టి షాపింగ్ కాంప్లెక్స్ నిర్వహణ కూడా స్థానిక వెల్ఫేర్ అసోసియేషన్ వాళ్లకి అప్పచెప్పాలని, గతంలో దాదాపు 40 లక్షల మునిసిపల్ బడ్జెట్ కమ్యూనిటీ హాల్ కట్టడానికి విడుదల చేసిననూ,అట్టి మొత్తం ఏమైనదో కానీ నామ మాత్రపు అసంపూర్తి కట్టడం జరిగిందనీ, ఇట్టి కట్టడం పూర్తి



చెయ్యాలని స్థానికులు మొర పెట్టుకుంటున్నారని, అలాగే బస్తీ దవాఖానాలో ప్రజలకు మందులు ఇవ్వకపోవడం పట్ల ప్రజలు చింతిస్తున్నారని ఈ సమస్యల పై అధికారులు స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కిరణ్, రమణ మూర్తి, బాలాజీ, గుట్టమీది నరేందర్, మల్యాద్రి నాయుడు, కుంబగళ్ళ ధనరాజ్ ,అందె లక్ష్మణ్ రావు, గోరుకంటి విఠల్, బండమీది మల్లేష్, ఉపేంద్రనాథ్ రెడ్డి, ఏర్పుల శ్రీకాంత్, యాలాల కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

# జిగేల్ మన్న జోడేడ్ల జాతర

- ఉత్తమ పశుపోషకులకు “బసవ”పురస్కారాన్ని అందజేసిన ఎంపీ షెట్కర్

**న్యాల్ కల్, ఫిబ్రవరి 9 (జనం సాక్షి) :** మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తు, దర్గా ఉత్సవాల్లో తెలంగాణ రాష్ట్రంలోనే ప్రఖ్యాతి గాంచిన న్యాల్ కల్ ఉర్సు ఉత్సవాలు మూడవ రోజు వేలాది పశుసంపదతో ఉత్సవ వేదిక జిగేల్ మంది. ఉమ్మడి మెదక్ జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, తదితర ప్రాంతాలకు చెందిన రైతులు, పశు పోషకులు, పశు ప్రేమికులు వేలాదిగా ఉత్సవాలకు పశు సంపదతో తరలి రావడంతో.. సంగారెడ్డి జిల్లా, న్యాల్ కల్ మండలం, స్థానిక గ్రామ శివారులోని “పీర్ గైబ్ సాహెబ్” ప్రాంగణం పశు సంపదతో కిటకిట లాడింది. తరలివచ్చిన రైతులు, వ్యాపారులు అధిక మొత్తంలో క్రయ, విక్రయాలు చేపట్టారు. రైతులు, భక్తులు దర్గాను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు విరివిగా కురవాలని, పంటలు సమృద్ధిగా పండాలని రైతులు దర్గాను దర్శించుకున్నారు.

దర్గాను దర్శించుకున్న ఎంపీ షట్కార్
ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్, కాంగ్రెస్ నేత మహమ్మద్ తన్వీర్, శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, తిరుపతి రెడ్డి, సిద్ధి లింగయ్య స్వామి, గౌసోద్దీన్, ఉత్సవ నిర్వాహకులు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్గాను దర్శించుకుంటారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు ఎంపీ సురేష్ కుమార్ షట్కర్ , పార్టీ శ్రేణులను సన్మానించారు.

ఉత్తమ పశు పోషకులకు “బసవ” పురస్కారం.....
రాష్ట్రపతి చేత పురస్కారాన్ని అందుకున్న ప్రముఖ శిల్ప కళాకారుడు డాక్టర్ హెూతి బసవరాజ్.. తన తల్లి దండ్రులు కీర్తి శేషులు కిరిజా బాయి అడివప్ప, సోదరుడు సురేష్ ల జ్ఞాపకార్థం గత రెండు దశాబ్దాలుగా ఉర్సు ఉత్సవాల్లో పాల్గొని ఆదివారం జరిగే పశువుల సంతకు హాజరై ఉత్తమ పశుపోషకులను గుర్తించి “బసవ” పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్





షెట్కార్, మహమ్మద్ తన్వీర్, పలువురు కాంగ్రెస్ నాయకుల చేతుల మీదుగా ఉత్తమ పశుపోషకులకు ట్రోఫీలను అందజేశారు. ఉత్తమ పశుపోషకులుగా ఎంపికైన రైతులు నాగభూషణం, నర్సింలు, శ్రీనివాస్, హైమద్, సమీర్, బక్కప్ప, ప్రబన్న, ఖాజా మైనుద్దీన్, సూర్యకాంత్, నర్సింలు, నీలకంఠ, అమీనుద్దీన్, తదితర రైతులకు పురస్కారాన్ని అందజేశారు. ప్రముఖ శిల్ప కళాకారుడు, యువకుడు, డాక్టర్ బసవరాజ్ చేపడుతున్న కార్యక్రమాన్ని ఎంపీ అభినందించారు.

# కనుల విందుగా వేదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి కళ్యాణం

- చూడముచ్చటగా స్వామివారి కల్యాణాన్ని తిలకించిన భక్తులు
- భారీగా తరలివచ్చిన భక్తులు

**తలకొండపల్లి, ఫిబ్రవరి 9 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో శ్రీశ్రీశ్రీ వేదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు గత మూడు రోజులుగా వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం భాజా భజంత్రీలతో వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్యన ఆలయ ధర్మకర్తలు గూడ యాదగిరి నరసింహయ్య శాస్త్రి దంపతులు,జి.శ్రీనివాసమూర్తి స్వామివారి కల్యాణాన్ని కనుల విందుగా జరిపించారు.ఈ కల్యాణోత్సవంలో రాష్ట్ర పర్యటక శాఖ,ఎక్సైజ్ శాఖ మాత్యులు జూపల్లి కృష్ణారావు,కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి,మహబూబ్ నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్,తెలంగాణ టాస్క్ సిఓఓ ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి,రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్,రాష్ట్ర గిడ్డంగుల మాజీ కార్పొరేషన్ చైర్మన్ రజిని సాయిచంద్,మాజీ ఎంపీపీ సిఎల్ శ్రీనివాస్ యాదవ్,పిఎసిఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి,దోకూరు ప్రభాకర్



రెడ్డి,కాసు శ్రీనివాస్ రెడ్డి,లు హాజరై స్వామివారి కల్యాణాన్ని తిలకించారు.శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధి కొరకు తమ వంతు దైవభక్తితో స్వామివారికి కానుకలు సమర్పించారు.ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు,ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి,మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్,ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి,లను ఆలయ ధర్మకర్త గూడ శ్రీనివాసమూర్తి,పూలమాల శాలువాతో సత్కరించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.రాష్ట్ర మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు,ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ..ప్రజలందరూ దైవభక్తితో స్వామివారు ప్రజల కోరికలను తప్పకుండా నెరవేరిస్తాడని అన్నారు.పర్యటక శాఖ నుండి 5కోట్ల నిధులను ఆలయ అభివృద్ధి కొరకు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.కల్వకుర్తి నియోజకవర్గాన్ని ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసుకొని ప్రత్యేక నిధులను కేటాయించి బీటీ రోడ్డు లేని గ్రామాలలో రోడ్ల నిర్మించాలని మంత్రిని కోరారు.ఈ ప్రాంత ప్రజలు సంతోషంగా జీవించాలని స్వామి వారిని కోరుకున్నట్లు పేర్కొన్నారు.ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు.అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కళ్యాణోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ బోర్డు మెంబర్ బాలాజీ సింగ్,కల్వకుర్తి మున్సిపల్ మాజీ చైర్మన్ ఎడ్మాసత్యం,రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు భగవాన్ రెడ్డి,తలకొండపల్లి తహసిల్దార్ నాగార్జున,పిఎసిఎస్ వైస్ చైర్మన్ కూన రవికుమార్,ఏఎంసీ డైరెక్టర్ వెంకట్ రెడ్డి,యువ నాయకులు చీమర్ల అర్జున్ రెడ్డి,మాజీ ఎంపీపీ లక్ష్మీదేవి రఘురాములు,డేవిడ్,మాజీ ఎంపీటిసి అంబాజీ,మాజీ సర్పంచులు రమేష్ యాదవ్,జయమ్మ వెంకటయ్య,లింగం గౌడ్,జైపాల్ రెడ్డి,మాజీ ఉప సర్పంచ్ అజీజ్,అశోక్ బాబు,నర్సింహా, విష్ణువర్ధన్ యాదవ్,గోపాల కృష్ణ,యాదగిరి,శేఖర్, వివిధ వివధ మండలాల నాయకులు, ప్రజాప్రతినిధులు,భక్తులు,గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

# తరగతి గదుల్లోనే విద్యార్థుల భవిష్యత్

- సింగరేణి కాలరీస్ జిఎం సాలెం రాజు

**చంద్రుగొండ, ఫిబ్రవరి 9 (జనంసాక్షి) :** విద్యార్థుల భవిష్యత్తు తరగతి గదిలోనే నిర్ణయించబడుతున్నాయి పదవ తరగతి వారికి మొదటి మెట్టు అని సింగరేణి కాంగ్రెస్ సీఎం ఎం సాలెం రాజు తమ అనుభవాలను తెలిపారు. శనివారం సాయంత్రం సందర్భంగా మండలం అయ్యన్నపాలెం సెయింట్ జోసెఫ్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 20 ఐదు సంవత్సరాలుగా పాఠశాల దినదినాభివృద్ధి చెందుతూ నేడు సుమారు 800 మంది విద్యార్థులను కలిగివుందంటేనే ఈ పాఠశాలలో క్రమశిక్షణకు మొదటి ప్రాధాన్యత ఇవ్వటం వల్లనే సాధ్యమైంది అన్నారు.

పాఠశాలల్లో విద్యార్థి క్రమశిక్షణతో కూడుకున్న విద్యతోనే జీవితములో రాణిస్తాడని తెలిపారు. ఒక లక్ష్యంతో ముందుకెళ్లే వానికి ఎటువంటి అడ్డంకులు ఏదైనా వాటిని ఎదుర్కొనే సత్తా ఉంటుందన్నారు. సమయపాలన ప్రతి విజయంలో ఒక భాగంగా ఉంటుందన్నారు. అంకితభావంతో ఉపాధ్యాయులను గౌరవిస్తూ వారు చెప్పిన అంశాలను తూచా తప్పకుండా పాటిస్తూ వెళ్లేవారికి విజయం వరిస్తుందని తెలిపారు.

చదువుతో పాటు ఆటపాటలు కూడా విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందిస్తాయని సెయింట్ జోసెఫ్ పాఠశాల ప్రెసిడెంట్ లేనా జాకోబ్ అన్నారు. తల్లిదండ్రులకు గుర్తింపు తెచ్చే విధంగా విద్యార్థులు మసులుకోవాలని తన పుట్టి పెరిగిన గ్రామం తో పాటు పాఠశాలకు వన్నె తీసుకురావాలని సూచించారు.

అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలులలో విద్యార్థులు తమ ప్రతిభ పాటవాలను ప్రదర్శించి అక్కడికొచ్చిన వారిని అలరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఎం సత్యనారాయణ అన్న జోసెఫ్, ఇమ్మానియేల్, అన్నిట్టే, సెయింట్ జోసెఫ్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లత ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఇప్పుడు 1 షేరుకు 1 షేరు ఉచితం..

ఫైనాన్స్ సెక్టార్ కి చెందిన స్మాల్ క్యాప్ కేటగిరి స్టాక్ అయిన క్యాపిటల్ ట్రేడ్ లింక్స్ లిమిటెడ్ కి చెందిన బోర్డు అఫ్ డైరెక్టర్స్ తమ షేర్ హోల్డర్స్ కి 1:1 రేషియోలో



బోనస్ షేర్ల జారీకి ఆమోదం తెలుపడం జరిగింది.

స్మాల్ క్యాప్ కేటగిరి ఫైనాన్స్ సెక్టార్ కంపెనీ క్యాపిటల్ ట్రేడ్ లింక్స్ లిమిటెడ్ తమ షేర్ హోల్డర్లకి ఆఫర్ ప్రకటించింది. ఇటీవలే సమావేశమైన కంపెనీ బోర్డు అఫ్ డైరెక్టర్లు బోనస్ షేర్ల జారీ చేసేందుకు ఆమోదం తెలుపారు. ఒక షేరు కలిగి ఉన్న వారికి మరో షేరు ఉచితంగా అందిస్తామని తెలిపారు. మరోవైపు ఈ కంపెనీ స్టాక్ గత ఐదేళ్లలోనే హైరిటర్న్స్ అందించింది. ఏకంగా 1000 శాతానికిపైగా పెరిగింది. ఒక్కసారి లక్ష రూపాయలు పెట్టిన వారికి ఏకంగా రూ.10 లక్షలకుపైగా అందించింది.

కంపెనీ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్ ప్రకారం 1:1 రేషియోలో బోనస్ షేర్లు అందించేందుకు కంపెనీ బోర్డు సిఫార్స్ చేసింది. దీని అర్థం రికార్డు తేదీ నాటికి రూ. 1 ఫేస్ వ్యాల్యూ గల ఒక ఈక్విటీ షేరు తమ డీమ్యాట్ ఖాతాలో కలిగి ఉన్నవారికి రూ. 1 ఫేస్ వ్యాల్యూ గల మరో ఈక్విటీ షేరును బోనస్ రూపంలో ఉచితంగా జారీ చేయనున్నారు. ఇక ఈ బోనస్ షేర్ల జారీకి అర్హులైన షేర్ హోల్డర్లను నిర్ణయించేందుకు అవసరమైన రికార్డు తేదీని త్వరలోనే ప్రకటిస్తామని కంపెనీ తమ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్ తెలిపింది. స్టాక్ మార్కెట్ చివరి ట్రేడింగ్ సెషన్‌లో క్యాపిటల్ ట్రేడ్ లింక్స్ షేరు ధర 1.98 శాతం లాభంతో రూ. 40.64 వద్ద స్థిరపడింది. ఈ షేరు 52 వారాల గరిష్ఠ ధర రూ. 65.65 వద్ద ఉండగా.. కనిష్ఠ ధర రూ. 32.51 వద్ద ఉంది. గత వారం రోజుల్లో ఈ షేరు 9 శాతం నష్టపోయింది. గత నెల రోజుల్లో ఈ షేరు 15 శాతం నష్టపోయింది. గత ఆరు నెలల్లో 6 శాతం నష్టపోయింది. గత ఏడాది కాలంలో ఈ షేరు 15 శాతం నష్టాన్ని మిగిల్చిం ది. అయితే గత ఐదేళ్లలో 1061 శాతం లాభా న్ని తమ వాటాదారులకు అందించింది. దీంతో లక్ష రూపాయల పెట్టుబడి రూ.11.61 లక్షలకు పైగా అందించింది. ప్రస్తుతం ఈ కంపెనీ మార్కెట్ విలువ రూ. 261.64 కోట్లుగా ఉంది.

# నెల జీతం ఫ్రీగా పొందొచ్చు.. ఫిబ్రవరి 15 వరకే గడువు!

ఉద్యోగులకు ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ ఈపీఎఫ్ఓ మరోసారి అవకాశం కల్పించింది. ఈఎల్ఐ స్కీమ్ ద్వారా నెల జీతం ఉచితంగా పొందవచ్చు. ఇందుకు యూఏఎన్ యాక్టివేషన్ గడువును మరోసారి పొడిగించింది. ఫిబ్రవరి 15వ తేదీ వరకే అవకాశం ఉంటుంది. మరి వెంటనే మీ యూఏఎన్ యాక్టివేట్ చేసుకోండి. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ మరోసారి కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తోన్న ప్రోత్సాహకాలను అర్హులైన వారికి చేర్చేందుకు మరోసారి అవకాశం కల్పించింది. యూఏఎన్ యాక్టివేషన్, బ్యాంక్ ఖాతాతో ఆధార్ లింక్ సంబంధించిన గడువును మరోసారి పొడిగించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కొత్తగా ఉద్యోగంలో చేరిన వారికి కేంద్ర ప్రభుత్వం ఎంప్లాయ్‌మెంట్ లింక్డ్ ఇన్సెంటివ్ స్కీమ్ (%జుూ×%) ద్వారా కల్పిస్తోన్న ప్రోత్సాహల కోసం సదరు అర్హులైన ఉద్యోగులు తమ యూఏఎన్ యాక్టివ్‌లో ఉంచుకోవాలని కోరింది. యూఏఎన్ యాక్టివేషన్ కోసం మరో అవకాశం ఇచ్చింది. యూఏఎన్ యాక్టివేషన్ గడువును ఫిబ్రవరి 15, 2025 వరకు పొడిగించింది. యూఏఎన్ యాక్టివేషన్, బ్యాంక్ అకౌంట్ ఆధార్ సీడింగ్ గడువు ఇప్పుడు ఫిబ్రవరి 15 వరకు ఉంటుంది. ఆలోపు యాక్టివేట్ చేసుకున్న వారికి ఈపీఎఫ్ఓ ఎంప్లాయ్‌మెంట్ లింక్డ్ ఇన్సెంటివ్ స్కీమ్ ద్వారా ఆర్థిక సాయం లభిస్తుంది. ఈ స్కీమ్ ద్వారా కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఉద్యోగంలో చేరిన వారికి ఒక నెల జీతం ప్రోత్సాహకంగా అందిస్తోంది. ఈ మేరకు గడువు పొడిగిస్తున్నట్లు ఫిబ్రవరి 2, 2025 రోజునే కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన మంత్రిత్వ శాఖ ఓ సర్క్యులర్ జారీ చేసింది. కంపెనీల యాజమాన్యాలు ఇందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరింది. అర్హులైన వారికి ఈఎల్ఐ బెనిఫిట్స్ లభించేలా యూఏఎన్ యాక్టివేట్ చేసేందుకు కృషి



చేయాలని కోరింది.

ఎంప్లాయ్‌మెంట్ లింక్డ్ ఇన్సెంటివ్ పథకాన్ని బడ్జెట్ 2024లోనే ప్రకటించింది కేంద్ర ప్రభుత్వం. ఇందులో రెండు కేటగిరీలో ఉంటుంది. స్కీమ్ ఏ ద్వారా కొత్తగా ఉద్యోగంలో చేరిన వారికి ఒక నెల శాలరీ ఆర్థిక సాయం అందిస్తారు. స్కీమ్ బీ ద్వారా తయారీ రంగంలోని కంపెనీలు కొత్తగా ఉద్యోగాలు కల్పిస్తే వాటికి ప్రోత్సాహకాలు ఇస్తారు. స్కీమ్ సీ ద్వారా అదనపు ఉద్యోగాలు కల్పించిన కంపెనీలకు ప్రోత్సాహకాలు కల్పిస్తారు.

అవర్ సర్వీసెస్ సెలెక్ట్ చేయాలి. ఆ తర్వాత ఫర్ ఎంప్లాయిస్ ఆప్షన్ ఎంచుకోవాలి. తర్వాత మెంబర్ యూఏఎన్ లేదా ఆన్‌లైన్ సర్వీసెస్ పై క్లిక్ చేయాలి. కొత్త పేజీ వస్తుంది. అందులోని ఇంపార్టెంట్ లింక్స్‌లో యాక్టివేట్ యువర్ యూఏఎన్ పై క్లిక్ చేయాలి. మీ యూఏఎన్, పేరు, పుట్టిన తేదీ, మొబైల్ నంబర్ వంటి వివరాలు ఎంటర్ చేసి క్యాప్చా కోడ్ ఎంటర్ చేసి గెట్ ఆథరైజేషన్ పిన్ పై క్లిక్ చేయాలి. మీ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కి ఓటీపీ వస్తుంది. ఓటీపీ ఎంటర్ చేయాలి. ఐ అగ్రీపై క్లిక్ చేసి వాలిడేట్ ఓటీపీ అండ్ యాక్టివేట్ యూఏఎన్ పై క్లిక్ చేస్తే సరిపోతుంది.



# హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్.. ఎయిర్‌టెల్‌లకు లబ్ధి..



గతవారం దేశీయ స్టాక్ మార్కెట్లలో ట్రేడింగ్ ముగిసిన తర్వాత బ్లూచిప్ కంపెనీల్లో టాప్ ఆరు సంస్థల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1,18,151.75 కోట్లు పెరిగింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్ భారీగా పుంజుకోగా, టీసీఎస్, ఎస్బీఐ నష్టాలతో ముగిశాయి.

గతవారం దేశీయ స్టాక్ మార్కెట్లలో ట్రేడింగ్ ముగిసిన తర్వాత బీఎస్ఈ–30 ఇండెక్స్ సెన్సెక్స్‌లో బ్లూచిప్ కంపెనీల్లో ఆరు కార్పొరేట్ సంస్థల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1,18,151.75 కోట్లు పెరిగింది. వాటిల్లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్ భారీగా లబ్ధి పొందాయి. గత వారం బీఎస్ఈ బెంచ్‌మార్క్ సెన్సెక్స్ 354.23 పాయింట్లు (0.45శాతం), ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 77.8 పాయింట్లు (0.33 శాతం పెరిగాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంకు, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్ భారీగా లబ్ధి పొందాయి. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ), హిందూస్థాన్ యూనీ లివర్ (హెచ్‌యూఎల్), ఐటీసీ నష్టాలతో ముగిశాయి. టీసీఎస్, ఎస్బీఐ, హెచ్‌యూఎల్, ఐటీసీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1.15 లక్షల కోట్లు కోల్పోయాయి.

హెచ్‌డీఎఫ్సీ బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 32,639.98 కోట్ల వృద్ధితో రూ.13,25,090.58 కోట్లకు చేరుకుంది. భారతీ ఎయిర్‌టెల్ ఎం–క్యాప్ రూ.31,003.44 కోట్లు పుంజుకుని రూ.9,56,205.34 కోట్ల వద్ద నిలిచింది. బజాజ్ ఫైనాన్స్ ఎం–క్యాప్ రూ.29,032.08 కోట్లు పెరిగి రూ.5,24,312.82 కోట్ల వద్ద ముగిసింది.

ఇన్ఫోసిస్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.21,114.32 కోట్ల వృద్ధితో రూ.7,90,074.08 కోట్ల వద్ద స్థిర పడింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎం–క్యాప్ రూ.2,977.12 కోట్లు పెరిగి రూ.17,14,348.66 కోట్ల వద్ద నిలిచింది. ఐసీఐసీఐ బ్యాంక్ ఎం–క్యాప్ రూ.1,384.81 కోట్లు పుంజుకుని రూ.8,87,632.56 కోట్ల వద్ద ముగిసింది.

ఐటీసీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.39,474.45 కోట్ల పతనంతో రూ.5,39,129.60 కోట్లతో సరిపెట్టుకుంది. హిందూస్థాన్ యూనీ లివర్ (హెచ్‌యూఎల్) ఎం–క్యాప్ రూ.33,704.89 కోట్లు నష్టపోయి రూ.5,55,361.14 కోట్లకు పరిమితమైంది. భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ) ఎం–క్యాప్ రూ.25,926.02 కోట్లు కోల్పోయి రూ.6,57,789.12 కోట్ల వద్ద నిలిచింది. టీసీఎస్ ఎం–క్యాప్ రూ.16,064.31 కోట్లు నష్టపోయి రూ.14,57,854.09 కోట్ల వద్ద ముగిసింది.

గతవారం ట్రేడింగ్ ముగిసిన తర్వాత బీఎస్ఈ–30లో టాప్–10 సంస్థల్లో రిలయన్స్ ఇండస్ట్రీస్ మొదటి స్థానంలో నిలిచింది. తర్వాతి స్థానాల్లో టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇన్ఫోసిస్, భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ), హిందూస్థాన్ యూనీ లివర్ (హెచ్‌యూఎల్), ఐటీసీ, బజాజ్ ఫైనాన్స్ నిలిచాయి.

# ఖాతాల్లో దొంగసొమ్ము మార్పిడి ఇకపై కష్టమే

కృత్రిమ మేధ (ఏఐ)ని ఉత్పత్తి, టెక్నాలజీ రంగాల్లోనే కాకుండా బ్యాంకింగ్ కార్యకలాపాల్లోనూ విస్తృతంగా అమలు చేసేందుకు అడుగులు పడుతున్నాయి. దీనికి తాజా ఉదాహరణే 'మ్యూల్‌హంటర్.ఏఐ' అనే టెక్నాలజీ సాధనం. మనీ మ్యూల్ ఖాతాలను పసిగట్టడం, ఆ ఖాతాల్లోని సొమ్మును జప్తు చేయడం ప్రధాన లక్ష్యంగా దీన్ని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆవిష్కరించింది. ఈ ప్రాజెక్టులో కెనరా బ్యాంకు, బెంగళూరులోని రిజర్వ్ బ్యాంక్ ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌బీఐహెచ్) క్రియాశీలక పాత్ర పోషించాయి. దీనికి సంబంధించిన ప్రయోగాత్మక ప్రాజెక్టును కెనరా బ్యాంకులో నిర్వహించారు. మెరుగైన ఫలితాలు రావడంతో, దీన్ని ఇప్పుడు దాదాపు అన్ని బ్యాంకులు అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాయి. ఇప్పటి వరకు దాదాపు 5 లక్షలకు పైగా మనీ మ్యూల్ ఖాతాలను గుర్తించి, వాటిల్లో లావాదేవీలను నిలిపివేశారు. ఎస్‌బీఐ, పంజాబ్ నేషనల్ బ్యాంకు, కెనరా బ్యాంకు, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంకు, కోటక్ మహీంద్రా బ్యాంకుల్లో ఈ తరహా ఖాతాలను అధికంగా గుర్తించారు. ఈ ఖాతాల్లోని రూ.116 కోట్ల సొమ్మును 'ఫ్రీజ్' చేసినట్లు తెలిపారు. 'మ్యూల్‌హంటర్' తో తక్కువ సమయంలోనే మంచి ఫలితాలు కనిపిస్తున్నాయని వివరించారు. దొంగతనాలు, మోసాలు చేసి సంపాదించిన సొమ్మును (క్రైమ్ మనీ), వేరొకరి బ్యాంకు ఖాతాల ద్వారా అధికారిక సొమ్ముగా మార్చేందుకు ప్రయత్నించడాన్నే 'మనీ మ్యూల్'గా వ్యవహరిస్తున్నారు. ఎంతోకొంత నగదు తీసుకుని, తమ బ్యాంక్ ఖాతా నిర్వహించేందుకు అపరిచిత వ్యక్తులకు అనుమతి ఇచ్చేవారినే మ్యూల్‌గా పేర్కొంటున్నారు. తమ వలకు చిక్కే ఇలాంటి బ్యాంకు ఖాతాదార్ల కోసం నేరగాళ్లు ప్రయత్నాలు చేస్తుంటారు. ఎంతో కొంత సొమ్ము వస్తుందనే ఆశతో, బ్యాంకింగ్ కార్యకలాపాలపై అవగాహన లేని వ్యక్తులు, తమ బ్యాంకు ఖాతా వివరాలను ఈ నేరగాళ్లకు అప్పగిస్తారు. ఈ ఖాతాల్లో ఇష్టారాజ్యంగా లావాదేవీలు నిర్వహించి, ఆ తర్వాత అడ్రసు లేకుండా పోవడం నేరస్తుల నైజం. తదుపరి పోలీసుల దర్యాప్తులో సదరు బ్యాంకు ఖాతాదార్లే, తమ ఖాతాల్లో జరిగిన లావాదేవీలకు సమాధానం చెప్పుకోవాల్సి వస్తుంది. ఇటువంటి ఖాతాలను గుర్తించడం, అందులోని సొమ్మును జప్తు చేయడం ప్రధాన లక్ష్యంగా 'మ్యూల్‌హం టర్.ఏఐ' ని రూపొందించారు. దీని కోసం కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్, క్లౌడ్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. ఈ ఏఐ సాధనం, ప్రత్యేక అల్గోరిథమ్ ఉపయోగించి బ్యాంకు ఖాతాలను జల్లెడ పడుతుంది. ఆయా ఖాతాల్లోని లావాదేవీలను విశ్లేషిస్తుంది. అనుమానా స్పద లావాదేవీలు కనిపించిన వెంటనే, ఆ ఖాతాకు 'రెడ్ ఫ్లాగ్' సూచిస్తుంది. ఖాతా 'సీజ్' అవుతుంది. తదుపరి నేరగాళ్లతో పాటు సంబంధిత ఖాతాదార్లకూ ఇబ్బందులు తప్పవు. ఈ కృత్రిమ మేధను అన్ని బ్యాంకుల్లో వినియోగి ంచాలని ఆర్‌బీఐ ఇటీవల సూచించింది. ఆ మేరకు బ్యాంకులు అప్రమత్తం అయ్యాయి. అందువల్ల మున్ముందు బ్యాంకు ఖాతాల ద్వారా 'క్రైమ్ మనీ' ని తరలించడం, వివిధ బ్యాంకులకు బదిలీ చేయడం, దాన్ని అధికారిక సొమ్ముగా మార్చడం కుదరకపోవచ్చు. దీంతోనే ఆగకుండా కృత్రిమ మేధ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇతర అవసరాలకు సైతం వినియోగించడానికి ఆర్‌బీఐ, బ్యాంకులు సన్నాహాలు చేస్తున్నాయి. సైబర్ నేరగాళ్ల వలకు బ్యాంకు ఖాతాదార్లు చిక్కి నష్టపోకుండా నివారించడానికి ఫ్రీ–ఏఐ (ఫ్రేమ్‌వర్క్ ఫర్ రెస్పాన్సిబుల్ అండ్ ఎథికల్ ఎనేబుల్‌మెంట్ ఆఫ్ ఏఐ) అనే కొత్త ప్రాజెక్టును చేపట్టింది. దీని కోసం ప్రత్యేకంగా ఒక బృందాన్ని ఏర్పాటు చేయడానికి ఆర్‌బీఐ చర్యలు తీసుకుంటోంది.

# ముస్లింల అడ్డాలో ఆప్‌ను దెబ్బకొట్టి బీజేపీ గెలుపు

ఢిల్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీని మజ్లిస్ పార్టీ దెబ్బకొట్టింది. ముస్లింల అడ్డాలో ఓట్లు చీల్చడంతో అక్కడ బీజేపీ విజయం సాధించింది. ఢిల్లీ ఎన్నికల్లో రెండు స్థానాల్లో పోటీ చేసిన మజ్లిస్.. ఏం ప్రభావం చూపకపోయినా ఓట్ల శాతాన్ని మాత్రం చీల్చింది. ముస్తాఫాబాద్, ఓక్లా నియోజకవర్గాల్లో ఎంఐఎం అభ్యర్థులు పోటీ చేయగా.. ఆ స్థానాల్లో బీజేపీ విజయం సాధించింది. ఇందులో మరీ ముఖ్యంగా ముస్లిం ఓటర్లు బాగా ఉండే ముస్తాఫాబాద్ స్థానంలో ఓట్లు చీలిపోవడంతో కాషాయపార్టీ గెలుపొందింది. దేశంలోని వివిధ ఎన్నికల్లో ఆల్ ఇండియా మజ్లిస్ ఎ ఇత్తెహాదుల్ ముస్లిమీన్–ఏఐఎంఐఎం పోటీ చేసిన ప్రాంతాల్లో బీజేపీ గెలుస్తుంది అనే వాదన ఉంది.



ఇప్పుడు ఇదే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి రుజువు అయింది. ఢిల్లీ ఎన్నికల్లో ముస్తాఫాబాద్, ఓక్లా నియోజకవర్గాల్లో ఎంఐఎం పార్టీ తమ అభ్యర్థులను రంగంలోకి దింపింది. అయితే ఈ రెండు చోట్లా ఆ పార్టీ ఓటమి పాలైంది. అయితే కీలకంగా ఉన్న ముస్తాఫాబాద్ స్థానంలో ఆ పార్టీ ఆప్‌కు పడే ఓట్లను చీల్చిందని.. ఫలితంగా ఆ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి విజయం సాధించారనే వాదన బలంగా తెరపైకి వచ్చింది. అయితే ముస్తాఫాబాద్ నియోజకవర్గంలో ఎంఐఎం పార్టీ తరఫున తాహిర్ హుస్సేన్ పోటీ చేశారు. అయితే 2020 ఢిల్లీ అల్లర్ల కేసులో నిందితుడిగా తాహిర్ హుస్సేన్ ఉన్నారు. ఈ కేసులో జైలుకు వెళ్లిన ఆయన.. ఎన్నికల వేళ.. బెయిల్‌పై బయటికి వచ్చి ప్రచారం చేశారు. ఈ నియోజకవర్గంలో ముస్తఫాబాద్ బీజేపీ అభ్యర్థి మోహన్ సింగ్ బిస్త్ ఘన విజయం సాధించారు. ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థి ఆదిల్ అహ్మద్ ఖాన్‌పై 17,578 ఓట్ల తేడాతో మోహన్ సింగ్ బిస్త్ గెలిచారు. ఇక మూడో స్థానంలో నిలిచిన తాహిర్ హుస్సేన్‌కు 33,474 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. ఇక కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అలీ మెహందీకి కేవలం 11,763 ఓట్లు మాత్రమే పడ్డాయి.

ఓట్ల శాతం పరంగా చూస్తే బీజేపీ అభ్యర్థి మోహన్ సింగ్ బిస్త్‌కు 42.36 శాతం.. ఆప్ అభ్యర్థి ఆదిల్ అహ్మద్ ఖాన్‌కు 33.62 శాతం.. ఎంఐఎం అభ్యర్థి తాహిర్ హుస్సేన్‌కు 16.64 శాతం వచ్చాయి. అయితే ఈ ఎన్నికల్లో తాహిర్ హుస్సేనే గెలవకపోయినప్పటికీ ఆయనకు మంచి ఓట్లే పడ్డాయి. ఈ నియోజకవర్గంలో ఆప్‌కు పడే ముస్లిం ఓట్లు కాస్తా.. ఎంఐఎం అభ్యర్థికి పడటంతో ఈ స్థానంలో బీజేపీ అభ్యర్థి మోహన్ సింగ్ బిస్త్ గెలిచారనే వాదనలు వినిపిస్తున్నాయి.

ఢిల్లీ అల్లర్ల కేసులో నిందితుడిగా ఉన్న తాహిర్ హుస్సేన్ బెయిల్‌పై బయటికి వచ్చి ముస్తాఫాబాద్ ఎన్నికల్లో ముమ్మరంగా ప్రచారం చేశారు. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ కూడా ఈ ఎన్నికల్లో తాహిర్ హుస్సేన్ కోసం ప్రచారం చేశారు. ఇక ముస్తాఫాబాద్‌లో 2.6 లక్షల మంది ఓటర్లు ఉండగా.. అందులో 40 శాతం ముస్లింలు, 60 శాతం హిందువులు ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఎంఐఎం తరఫున తాహిర్ హుస్సేన్ బరిలోకి దిగడంతో ముస్లిం ఓట్లను చీల్చి బీజేపీకి లబ్ధి చేకూర్చారని కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలు ఎన్నికల ప్రచారంలోనే ఆరోపించాయి. 2020 ఫిబ్రవరి 23వ తేదీ నుంచి 26వ తేదీ వరకు ఈశాన్య ఢిల్లీలో అల్లర్లు చెలరేగాయి. ఈ అల్లర్లలో మొత్తం 53 మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. వారిలో 40 మంది ముస్లింలు ఉండగా..

మరో 13 మంది హిందువులు ఉన్నట్లు ఢిల్లీ పోలీసులు వెల్లడించారు. ఆ సమయంలో ఆమ్ ఆద్మీ పార్టీ తరఫున కౌన్సిలర్‌గా ఉన్న తాహిర్ హుస్సేన్‌పై.. అల్లర్లలో అతని పేరు తెరపైకి రావడంతో ఆప్ ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. ఇక ఐబీ ఉద్యోగి అంకిత్ శర్మ హత్యతో పాటు పలు కేసులు కూడా తాహిర్ హుస్సేన్‌పై నమోదయ్యాయి. ఎన్నికల అఫిడవిట్ ప్రకారం తాహిర్ హుస్సేన్‌పై 10 ఎఫ్ఐఆర్లు, ఒక ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కేసు ఉన్నాయి. అతడికి సుమారు రూ.42 లక్షల చరాస్తులు. ఆయన భార్య పేరుతో రూ.43 లక్షల విలువైన చరాస్తులు ఉన్నాయి. స్థిరాస్తుల విషయానికొస్తే ఆయనకు రూ.8.85 కోట్లు.. ఆయన భార్యకు రూ.9 కోట్లకు పైగా ఆస్తులు ఉన్నాయి.

# యూఎస్‌ఎయిడ్‌పై ట్రంప్‌నకు ఎదురుదెబ్బ

సహాయ సంస్థ 'యూఎస్‌ఎయిడ్'ను నిర్వీర్యం చేసేందుకు అధ్యక్షుడు ట్రంప్, ఆయన స్నేహితుడు ఎలాన్ మస్క్‌లు చేపట్టిన చర్యలకు బ్రేక్ పడింది. ఈ సంస్థలో పనిచేస్తున్న వేలమంది సిబ్బందిని ఉద్యోగం నుంచి తొలగించే ప్రణాళికలను తాత్కాలికంగా నిలిపివేయాలని ఫెడరల్ న్యాయమూర్తి ఒకరు ఆదేశించారు.



సహాయ సంస్థ యూఎస్‌ఎయిడ్'ను నిర్వీర్యం చేసేందుకు అధ్యక్షుడు ట్రంప్, ఆయన స్నేహితుడు ఎలాన్ మస్క్‌లు చేపట్టిన చర్యలకు బ్రేక్ పడింది. ఈ సంస్థలో పనిచేస్తున్న వేలమంది సిబ్బందిని ఉద్యోగం నుంచి తొలగించే ప్రణాళికలను తాత్కాలికంగా నిలిపివేయాలని ఫెడరల్ న్యాయమూర్తి ఒకరు ఆదేశించారు. విదేశాల్లో పనిచేస్తున్న యూఎస్‌ఎయిడ్ సంస్థ సిబ్బంది, వారి కుటుంబాలను ప్రభుత్వ ఖర్చుతో అమెరికాకు తీసుకువచ్చేందుకు 30 రోజుల పరిపాలనా పరమైన సెలవులో ఉంచడానికి సంబంధించిన ఆదేశాలనూ అడ్డుకునేందుకు యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి కార్ల్ నికోల్స్ అంగీకరించారు. అధ్యక్షుడి ఆదేశాలు అమెరికా సిబ్బంది, వారి భార్యాపిల్లలను అనవసరమైన ప్రమాదంలో పడేస్తాయని, ఆర్థికంగా నష్టం చేకూరుస్తాయని ఈ సందర్భంగా న్యాయమూర్తి పేర్కొన్నారు. మాజీ అధ్యక్షుడు బైడెన్ ప్రభుత్వ రహస్య సమాచారాన్ని పొందే వీలును ట్రంప్ రద్దు చేశారు. బైడెన్ రహస్య సమాచారం తెలుసుకోవాల్సిన అవసరం లేదని, ఆయనకు రోజువారీ ప్రాతిపదికన సమాచారం నివేదించే సదుపాయాన్ని రద్దు చేస్తున్నామని ప్రకటించారు. "2021లో బైడెన్ అప్పటికి దేశ మాజీ అధ్యక్షుడినైన నాకు జాతీయ భద్రత గురించి సమాచారం అందించకుండా దేశ గూఢచార విభాగానికి ఆదేశాలు జారీ చేశారు. నేను అదే సంప్రదాయాన్ని అనుసరిస్తున్నా" అని ట్రంప్ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

# ఢిల్లీ సీఎం పదవికి ఆతిశీ రాజీనామా..

ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌కు పంపించారు. ఢిల్లీలో ఇప్పటివరకు అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ ఈ ఎన్నికల్లో ఓడిపోయి.. బీజేపీ గెలిచింది. ఈ నేపథ్యంలోనే బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు వీలుగా ఆతిశీ రాజీనామా చేశారు. మరోవైపు.. ఆప్ అగ్రనేతల్లో కేజ్రీవాల్, మనీష్ సిసోడియా ఓడిపోయినా.. ఆతిశీ మాత్రం తన నియోజకవర్గం లో విజయం సాధించారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. మొత్తం 70 స్థానాలు ఉన్న ఢిల్లీ అసెంబ్లీలో ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలు శనివారం వెల్లడయ్యాయి. ఈ ఫలితాల్లో అధికార ఆప్ కేవలం 22 స్థానాలకే పరిమితం కాగా.. ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ 48 స్థానాల్లో గెలిచి.. 27 ఏళ్ల తర్వాత ఢిల్లీ గడ్డపై కాషాయ జెండాను ఎగురవేసింది. ఈ నేపథ్యంలోనే ఢిల్లీలో అధికార మార్పు జరగనుంది. ఇందుకోసం ఇప్పటివరకు ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఉన్న ఆతిశీ.. ఆదివారం రాజీనామా చేశారు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనాకు తన రాజీనామా లేఖను.. ఆతిశీ సమర్పించారు.



ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సహా అగ్రనేతలు ఓటమి పాలయ్యారు. ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా, సత్యేందర్ జైన్, సౌరభ్ భరద్వాజ్ ఘోర ఓటమిని చవిచూశారు. ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ మాత్రం కల్కాజీ నియోజకవర్గం నుంచి స్వల్ప తేడాతో గెలుపొందారు. ఒకానొక దశలో వెనుకంజలో ఉన్న ఆతిశీ.. చివర్లో పుంజుకుని బీజేపీ అభ్యర్థి రమేష్ బిధూరిపై 3521 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. అయితే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత మాట్లాడిన ఆతిశీ.. ఈ ఎన్నికల్లో ఓటమి ఆప్‌కు పెద్ద ఎదురుదెబ్బ అని పేర్కొన్నారు. ఇక తనపై నమ్మకం ఉంచి.. తనను గెలిపించినందుకు తన నియోజకవర్గం కల్కాజీ ఓటర్లకు ఆతిశీ ధన్యవాదాలు తెలిపారు. బీజేపీ చేస్తున్న అక్రమాలు, అవినీతికి వ్యతిరేకంగా తమ పార్టీ పోరాటం కొనసాగిస్తూనే ఉంటుందని ఆతిశీ స్పష్టం చేశారు.

# బస్సును ఢీకొట్టిన ట్రక్కు.. మంటలు చెలరేగి 41 మంది సజీవ దహనం

మెక్సికో దేశంలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. అతి వేగంగా వచ్చిన ఓ ట్రక్కు.. బస్సును ఢీకొట్టింది. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి.. బస్సు తగలబడిపోయింది. ఈ ఘటనతో ఆ బస్సులోని 41 మంది కాలిబూడిదయ్యారు. వెంటనే సమాచారం అందుకున్న అధికారులు, రెస్క్యూ సిబ్బంది.. సంఘటనా స్థలానికి చేరుకుని.. సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలు కాలిపోవ డంతో వాటిని గుర్తించడం కష్టంగా మారింది. మెక్సికోలో ఘోర బస్సు ప్రమాదం జరిగింది. ప్రయాణికులతో వెళ్తున్న ఓ బస్సును.. ట్రక్కు ఢీకొట్టడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ట్రక్కు ఢీకొట్టడంతో బస్సులో మంటలు అంటుకున్నాయి. చూస్తుండగానే క్షణాల్లో మంటలు బస్సు మొత్తం వ్యాపించాయి. దీంతో ఆ బస్సులో ఉన్న ప్రయాణికులు బయటకు రావడం కష్టంగా మారింది. ఈ నేపథ్యంలోనే వారికి మంటలు అంటుకోవడంతో ఏకంగా 41 మంది ప్రయాణికులు ఆ బస్సులోనే మంటలు అంటుకుని.. సజీవ దహనం అయ్యారు. మరికొందరు గాయాలతో బయటపడి ప్రాణాలు దక్కించుకున్నారు. ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 48 ప్రయాణికులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ట్రక్కు డ్రైవర్ కూడా ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడిం చారు. దక్షిణ మెక్సికోలోని కాన్కున్ నుంచి టబాస్కోకు బస్సు వెళ్తుండగా.. ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మొత్తం బస్సులో 48 మంది ప్రయాణికులు ప్రయాణిస్తుండగా.. అందులో 38 మంది ప్రయాణికులు, ఇద్దరు డ్రైవర్లు ప్రాణాలు కోల్పోయారు. ఇక ఈ ప్రమాదానికి కారణం అయిన ట్రక్కు డ్రైవర్ కూడా ఈ ప్రమాదంలో చనిపోయినట్లు అధికారులు గుర్తించారు. ట్రక్కు ఢీకొన్న వెంటనే బస్సులో మంటలు చెలరేగడంతో ఈ ఘోర ప్రమాదం చోటుచేసుకుందని ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు. ఇప్పటివరకు దాదాపు



అన్ని మృతదేహాలను వెలికితీశామని చెప్పిన అధికారు లు.. మరికొన్ని అందులోనే ఉండిపోయినట్లు వెల్లడించారు. ప్రమాదం ధాటికి బస్సు పూర్తిగా దగ్ధమైనట్లు అధికారులు చెప్పారు. ప్రమాదంలో మరణించిన వారి వివరాలను సేకరించి.. వారి కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు అధికారులు తెలిపారు. సంఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని.. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. అయితే మృతదేహాలు మంటల్లో పూర్తిగా కాలిపోవడంతో.. వారిని గుర్తించడం కష్టంగా మారిందని చెబుతున్నారు. ఈ ఘోర ప్రమాదం పై టబాస్కో రాష్ట్రంలోని కోమల్‌కాల్కో నగర మేయర్ ఓవిడియో పెరాల్టా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కాన్కున్ నుంచి టబాస్కోకు వెళ్లే బస్సు ప్రమాదానికి గురి కావడం పట్ల తీవ్రం గా చింతిస్తున్నట్లు తెలిపారు. మృతుల కుటుం బాలకు సంతాపం తెలియజేశారు. మృతుల కుటుంబాలకు అన్ని విధాలుగా ఆదుకుంటా మని హామీ ఇచ్చారు. ఇక గాయపడిన వారిని హుటాహుటిన సమీపంలో ఉన్న ఆస్పత్రికి తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ బస్సు ప్రమాద ఘటనపై సదరు బస్సు ఏజెన్సీ స్పందించింది. ప్రమాద సమయంలో బస్సు పరిమిత వేగంలోనే ప్రయాణిస్తోందని.. ప్రమాదానికి గల కారణం ఏంటి అనే దానిపై ఆరా తీస్తున్నామని వివరించింది. ఈ కేసు దర్యాప్తులో అధికారులకు పూర్తిగా సహకరిస్తామని బస్సు కంపెనీ స్పష్టం చేసింది.

# ఆరోగ్య కేంద్రం వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలి

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**ముస్తాబాద్ ఫిబ్రవరి:( జనం సాక్షి)**



ముస్తాబాద్ మండలం పోత్గల్ గ్రామంలో పర్యటించిన కలెక్టర్ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. ఆదివారం ముస్తాబాద్ మండలం పోత్గల్ గ్రామంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా క్షేత్ర స్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలుర వసతి గృహాన్ని, వ్యవసాయ మార్కెట్ యార్డు గోదాంను, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను సందర్శించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే పేషెంట్లకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు, సిబ్బందికి కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు జరిగేలా క్షేత్ర స్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు. ల్యాబ్, వార్డు, తదితర వాటిని పరిశీలించి అందుబాటులో ఉన్న పరికరాలను ఉపయోగించుకుని వైద్య సేవలు అందించాలని అన్నారు. అనంతరం గ్రామంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలుర వసతి గృహాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వసతి గృహంలో ఎంతమంది విద్యార్థులు ఉన్నారు? వారికి ఏ విధమైన సౌకర్యాలు కల్పిస్తున్నారు? అన్ని మౌలిక సదుపాయాలు సక్రమంగా ఉన్నాయా లేవా అనే విషయాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు ఉంటే తెలపాలని కోరారు. ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి చక్కగా చదువుకోవాలని విద్యార్థులకు కలెక్టర్ సూచించారు. వసతి గృహంలోని స్టోర్ రూమ్, వంటగది డార్మెట్రీలను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులు ఆడుకోవడానికి క్రికెట్ కిట్ సమకూర్చాలని అధికారులను ఆదేశించారు. నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. తదనంతరం గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోదాంను తనిఖీ చేశారు. అందుబాటులో ఉన్న ఎరువుల గురించి ఆరా తీశారు. ఇప్పటివరకు ఎంత మంది రైతులకు ఎంత ఎరువులు విక్రయించారు, వాటి ధరలు ఎంత అనే వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్ లను పరిశీలించారు. ఎరువుల లభ్యత గురించి రైతులు ఆందోళన చెందవద్దని, అందుబాటులో ఎరువులు ఉన్నాయని పేర్కొన్నారు. ఎరువుల లభ్యత, ధరలకు సంబంధించిన పట్టికను గోదాం బయట ఏర్పాటు చేయాలని ప్యాక్స్ కార్యదర్శిని ఆదేశించారు.

చివరగా గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ దశలో ఉన్న తరగతి గదులు పూర్తి చేయడంలేదనే విషయాన్ని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, నిర్మాణం పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే పరిష్కరించాలని తహశీల్దార్, ఎంపీడీఓ లను కలెక్టర్ ఆదేశించారు. సందర్శనలో జిల్లా వైద్యాధికారి డా.రజిత, పిఆర్ ఈఈ సుదర్శన్ రెడ్డి, తహశీల్దార్ సురేష్, ఎంపీడీఓ బీరయ్య, మెడికల్ ఆఫీసర్ డా.గీతాంజలి, వార్డెన్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# పట్టపగలే వెలుగుతున్న వీధి దీపాలు

**పట్టించుకోని అధికారులు**

**ముత్తారం ఫిబ్రవరి 09(జనంసాక్షి)**



విద్యుత్ అధికారులు పర్యవేక్షణ లోపం కారణంగా పట్టపగలే వీధి దీపాలు వెలుగుతూ వారి నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతున్నాయి. దీంతో విలువైన విద్యుత్ వృధా అవుతుం దన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీధి దీపాల నిర్వహణలో ఉన్న సమస్యలను విద్యుత్ సిబ్బంది, గ్రామ పంచాయితీ సిబ్బంది పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ముత్తారం మండలం పోతారం గ్రామంలో చాలా వార్డులో వీధి దీపాలు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. పగలు,రాత్రి తేడా లేకుండా వెలుగుతుండడంతో వందలాది యూనిట్లు విద్యుత్ వృథా అవుతున్నది. విద్యుత్ శాఖ గ్రామ పంచాయతీ తీవ్రంగా నష్టపోతు న్నాయి. ప్రత్యేక లైన్ లు ఆన్ఆఫ్ స్విచ్‌లను ఏర్పాటు చేస్తేనే ఈ సమస్యకు పరిష్కారం అవుతుంది. ప్రభుత్వం నిరంతరం విద్యుత్‌ను అందించడానికి వేల కోట్ల వెచ్చిస్తున్నా విద్యుత్‌ను ఆదాచేయాల్సిన సంబంధిత అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తున్నారు. పంచాయతీ ఆదాయం,జనాభా మేరకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయగా రాత్రి పూట ఆన్ చేసి ఉదయం పూట ఆఫ్ చేయాలి. కానీ అలా జరగడం లేదు. దీంతో గ్రామ పంచాయతీ వేల రూపాయల బిల్లులు వస్తున్నాయి. అధికారులు స్పందించి వార్డులో వీధిలైట్లకు ప్రత్యేక లైన్ ఏర్పాటుచేసి ఆన్ఆఫ్ స్విచ్‌లను ప్రజలు కోరుతున్నారు

# సమాజాన్ని నిత్యం చైతన్యవంతం చేయాలి



**సిరిసిల్ల టౌన్ ఫిబ్రవరి 9 (జనం సాక్షి)**

సమాజాన్ని చైతన్యవంతం చేసే బాధ్యతను స్వచ్ఛంద సంస్థలు తీసుకోవాలని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. హెల్పింగ్ హార్ట్స్ వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన బ్రోచర్ ను తన క్యాంపు ఆఫీస్ లో ఆవిష్కరించారు. 10 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో జీవితాల్లో స్వచ్ఛందంగా వెలుగులు నింపడం అభినందనీయం అని, హెల్పింగ్ హార్ట్స్ తమ సేవలను ఇలాగే కొనసాగించాలని. ప్రభుత్వం తరుపున సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సైకాలజిస్ట్ కె. పున్నం చందర్, హెల్పింగ్ హార్ట్స్ అధ్యక్షుడు అలువాల ఈశ్వర్, ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ దాసరి తిరుమల, మాజీ కౌన్సిలర్ కుడిక్యాల రవికుమార్, చిలుక రమేష్ పాల్గొన్నారు.

## ప్రసాదల తయారీ విభాగంలో కార్మికుడికి గాయాలు

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 9 (జనంసాక్షి)**



ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలోని ప్రసాదల తయారీ విభాగంలో ఆదివారం ప్రమాదవశాత్తు ఔట్సోర్సింగ్ కార్మికుడికి గాయాలయ్యాయి. ప్రసాదల తయారీ విభాగంలో ఔట్సోర్సింగ్ పద్ధతిలో బొడిగె రాజు కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం ప్రసాదం తయారీలో భాగంగా పులిహోర కోసం బియ్యాన్ని బాయిలర్ పై ఉంచారు. బియ్యం వృత్తుల క్రమంలో నీరు పంపడానికి సంబంధించినటువంటి గేట్ వాల్ తిప్పే క్రమంలో ప్రమాదం చోటుచేసుకుని వేడి నీరు రాజుపై పడడంతో వీపులో గాయాలయ్యాయి. రాజు అప్రమత్తం కావడంతో భారీ ప్రమాదం తప్పిందని పలువురు కార్మికులు తెలిపారు. ఆలయంలోని బైలర్కు గేట్ వాల్ లేకపోవడం వల్లనే ప్రమాదం జరిగిందని కార్మికుల భద్రతపై ఆలయ అధికారులు అన్ని విధాలుగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## కొక్కెర కుంటలో బీరప్ప ఆలయ పునర్నిర్మాణం



బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల ప్రభాకర్.

**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 09 (జనంసాక్షి) :**

కరీంనగర్ జిల్లా రామడుగు మండలం కొక్కెరకుంటలోని బీరప్ప ఆలయం పునర్నిర్మాణ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల ప్రభాకర్ శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా గ్రామంలోని సంఘం కార్యాలయం నుంచి 500 మంది గొల్ల, కురుమల కులస్తులు డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా ఆలయ ప్రాంతానికి బోనాలతో చేరుకున్నారు. ఈ సందర్భంగా సంప్రోక్షణ చేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంతోష్ కుమార్, బీరయ్య, మల్లయ్య, కడారి ఐలయ్య, కర్రె రాజు, వేముండ్ల కానుకయ్య, నాగం సంపత్ కుమార్, నాగం మల్లయ్య, వేముండ్ల లచ్చయ్య, వేముండ్ల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి ప్రజావాణి కార్యక్రమం తాత్కాలికంగా వాయిదా

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 9 (జనం సాక్షి)**



ప్రజా సమస్యల సత్వర పరిష్కా రం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శాసన మండలి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందనీ తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం ప్రజావాణి కార్యక్రమం యధావిధిగా నిర్వహించబడుతుందని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు. ప్రజల విజ్ఞాపనలు తీసుకోవడానికి కలెక్టరేట్ లోని రూం నెంబర్ 25 లో హెల్ప్ డెస్క్ ఏర్పాటుచేసినట్లు కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల సమస్యల దరఖాస్తులు హెల్ప్ డెస్క్ లో అందజేయవచ్చని తెలిపారు.

# హిందూ ముస్లింలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకుంటున్న కేంద్రమంత్రి బండి



## జిల్లా కాంగ్రెస్ మైనార్టి సెల్ అధ్యక్షులు ఎం డి తాజోద్దీన్.

**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 09 (జనంసాక్షి) :**

పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ ముస్లింలను ఉద్దేశించి మాట్లాడుతూ... బీసీలలో ముస్లింలను చేర్చవద్దంటూ అనడం సరైంది కాదని తాజోద్దీన్ తెలిపారు. ఎం డి తాజోద్దిన్ డిసిసి కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ... మేము ఎప్పుడైనా బీసీలకు ప్రభుత్వాలు రిజర్వేషన్లు పెంచితే ఇంతెందుకు పెంచినారని ప్రశ్నించినామా అడ్డుకున్నామా? అన్నారు. నీవు అర్బన్ బ్యాంకు డైరెక్టర్ నుండి కేంద్ర మంత్రిగా ఎదిగినా ఇంకా నీ బుద్ధి, ప్రవర్తన మారలేదన్నారు. కుంభమేళాలో చాలా మంది హిందూ భక్తులు తొక్కిసలాటలో చనిపోయి, గాయపడిన వారిని ముస్లింలు మసీదులకు తీసుకుపోయి అన్ని విధాలుగా ఆదుకొని, సౌకర్యాలు కల్పించిన ఘనత ముస్లింలదన్నారు.

బండి సంజయ్ హిందూ, ముస్లింలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకునే చరిత్ర నీది, బండి సంజయ్ నీవు చేసిన అభివృద్ధి గురించి మాట్లాడకుండా మసీదులు తవ్వుతం , ముస్లింలకు రిజర్వేషన్ కల్పించవద్దని మాట్లాడుతావు, ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీ అన్నారు. భారతదేశంలో 30% ముస్లింలు ఉన్నారని దీంట్లో 90% పేదలు ఉన్నారు మాకు ఎందుకు రిజర్వేషన్లు కల్పించవద్దు? మాకు రిజర్వేషన్లు కల్పించవద్దు అనడానికి నువ్వెవరు, భారత దేశ రాజ్యాంగం ప్రకారం మాకు రిజర్వేషన్లు కల్పించమంటున్నామని తెలిపారు. డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మాకు ఐదు శాతం రిజర్వేషన్లు ఇస్తే దొంగ లెక్కలు చూపించి దానిని నాలుగు శాతం చేసింద్రని ముస్లింలలో షేక్, మహమ్మద్ లాంటి కొన్ని వర్గాలకు రిజర్వేషన్లు ఇస్తున్నారని సయ్యద్, పఠాన్, మొగల్స్, వారికి కూడా రిజర్వేషన్లు కల్పించాలని కోరుతున్నామన్నారు.

**మాకు 8% నుండి 10% వరకు రిజర్వేషన్ కచ్చితంగా కావాలి**

ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న మీరు ఇప్పటి వరకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చింద్రు బహిర్గతం చెయ్యాలని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గాడిద గుడ్డు అని అంటున్నావు, పది సంవత్సరాల నుండి మా ప్రభుత్వం అక్కడ లేదు తమిళనాడు, కేరళ,

ఇంకా కొన్ని రాష్ట్రాల్లో మీరు గెలవలేదు మరి మీది గాడిద గుడ్డ, హిందూ, ముస్లింల మధ్య చిచ్చు పెట్టి ఇప్పుడిప్పుడు కొన్ని రాష్ట్రాల్లో మీరు గెలుస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం లో నాయకులు కలియుముద్దీన్, షహేన్షా, అబ్దుల్ బారి, సిరాజ్, బషీర్, షబానా మహమ్మద్, అనీఫ్, ఇమ్రాన్, నుస్రత్, ఫిరోజ్, షాకీర్, సయ్యద్ అన్సర్, సయ్యద్ ఖలీల్, మహమ్మద్ కాజా, అక్రమ్ ,జమీల్, జమాల్ ఖాన్, ముజాహిద్, ఖాజా ఖాన్ ,ఆరిఫ్ ఖాన్ ,లాయిక్ ఖాద్రి తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలపై దృష్టిసారిస్తాం

**కరీంనగర్ బ్యూరో / హుజురాబాద్,**

**ఫిబ్రవరి 09 (జనంసాక్షి) :**



ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వూట్కూరి నరేందేర్ రెడ్డి భారీ మెజారిటీతో మండలికి వెళ్లడం ఖాయమని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వొడితల ప్రణవ్ అన్నారు. ఆదివారం రోజున హుజురాబాద్ పట్టణంలోని సిటీ సెంట్రల్ కన్వెన్షన్ హాల్ లో జరిగిన ఆత్మీయ సమ్మేళనం సభకు ఆయన ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ అభ్యర్థి(ఆల్ ఫోర్స్) నరేందర్ రెడ్డి తో పాటు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ పట్టభద్రులు ఓటును వృధా చేసుకోవద్దని,ఓటు వేసేటప్పుడు జాగ్రత్తగా వేయాలని సూచించారు.

హుజరాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా 13వేల పట్టభద్రుల ఓట్లు ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎన్.ఎస్.యు.ఐ,యూత్ కాంగ్రెస్, కాంగ్రెస్ అనుభంద సంఘాలు పనిచేసి హుజరాబాద్ నుండి అత్యధిక మెజారిటీ ఇవ్వాలని కోరారు. 42 నియోజకవర్గాలకంటే హుజురాబాద్ నుండే అధిక మెజారిటీ వచ్చేలా కృషి చేస్తామని తెలిపారు. మండలికి వెళ్లిన తదుపరి హుజురాబాద్ నియోజకవర్గానికి విద్యారంగంపై తగిన నిధులు కేటాయించాలని కోరారు. విద్యారం గానికి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అధిక ప్రాధాన్యత ఇచ్చిందని దాంట్లో భాగంగానే ఏడాది కాలంలోనే 55,000 మందికి నియామకపత్రాలను అందజేశామని తెలిపారు. 54 ఏళ్ల వయసులో 54 విద్యాసం స్థలను నెలకొల్పడం ద్వారా విద్యారంగం పట్ల నరేందర్ రెడ్డికి ఉన్న శ్రద్ధ ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సత్య ప్రసన్న రెడ్డి,హుజురాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూరి రాజేశ్వరి-స్వామిరెడ్డి,సింగిల్ విండో చైర్మెన్ సుగుణాకర్ రెడ్డి,ఆంజనేయ స్వామి దేవస్థాన చైర్మన్ కోలిపాక శంకర్,హుజురాబాద్ మండల అధ్యక్షుడు కిరణ్ కుమార్,హుజురాబాద్ పట్టణ,మండల మహిళా అధ్యక్షురాలు పుష్పలత,రాధ,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాహుల్, ,సొల్లు బాబు,లావణ్య, లక్ష్మారెడ్డి,బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోస్కుల శ్రీనివాస్, మిద్దోడి రాజు. మాజీ ఎంపీటీసీ సభ్యులు దండ శోభ-విక్రమ్ రెడ్డి,మాజీ కౌన్సిలర్ రాజేంద్ర ప్రసాద్,వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవర్ధన్,ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి,మైనారిటీ నాయ కులు ,అఫ్సర్,ఉస్మాన్ పాష,వివిధ విద్యాసం స్థల ప్రిన్సిపల్ లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**విద్యారంగ సమస్యలపై కృషి చేస్తా..నరేందర్ రెడ్డి..**

ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి కోరారు. ఎన్నో ఏళ్లుగా విద్యారంగంలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానని,లైబ్రరీల విషయంలో ప్రణాళికతో ముందుకు వెళ్తానని అన్నారు. హుజురాబాద్ లైబ్రరీకి 70000 తో షెడ్డు వేయడం జరిగిందని,12 సంవత్సరాలుగా గురుకులాల్లో జరగని బదిలీలు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినాక జరిగినాయని ఇది రేవంత్ రెడ్డి పనితీరుకు నిదర్శనమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యూనివర్సిటీలకు తగినన్ని నిధులు కేటాయించడంతోపాటు విద్యా వ్యవస్థను చక్కదిద్దుతున్నారని అన్నారు. ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత గుర్తు ఒకటో నెంబర్ పై వేసి ఆశీర్వదించాలని కోరారు.

**పట్టభద్రులకు, ప్రభుత్వానికి వారధిగా ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి**

**విద్యావేత్తగా సామాన్య ప్రజలకు సేవ.**

**.మెజారిటీతో మండలికి వెళ్ళడం ఖాయం. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వొడితల ప్రణవ్**

## జాతీయ స్థాయి వాలీబాల్ శిక్షణకు ఎంపిక వాలీబాల్ క్రీడాకారిణి సోనియా

**గాంధారి ఫిబ్రవరి (జనం సాక్షి)**



స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రతి ఏడాది నిర్వహించే 6 వారాల క్రీడ శిక్షణలో భాగంగా గాంధారి మండల పెట్ సంగం గ్రామ పంచాయతీ పరిధిలోని ధన్ సింగ్ తండాకు, చెందిన జరప్లా సోనియా, ఈనెల 15 రోజుల పాటు బెంగుళూర్ లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ క్రీడా ప్రాధికార సంస్థ లో నిర్వహించే శిక్షణ కూ ఎంపిక అయింది. వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మణ్ రాథోడ్ తెలిపారు. జాతీయ స్థాయి వాలీబాల్ క్రీడాకారిణి అయిన సోనియా ఇటీవలే వ్యాయామ విద్య పూర్తి చేసింది. జాతీయ స్థాయి కోచ్ కావడమే లక్ష్యం అని ఆమె పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు, విద్యార్థిని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

## అబాకస్లొ మెరిసిన శ్రేష్ఠ కిడ్స్ ప్లే స్కూల్ విద్యార్థినిలు



**మంథని, (జనంసాక్షి):**

పెద్దపల్లి జిల్లా మంథని పట్టణానికి చెందిన శ్రేష్ఠ కిడ్స్ ప్లే స్కూల్ విద్యార్థిని శ్రీనిజకు జిల్లాస్థాయి అబాకస్ పోటీలలో మొదటి బహుమతి, ఒకటో తరగతి చదువుతున్న విద్యార్థిని హిమాన్సి తృతీయ బహుమతి సాధించారు. ఆదివారం కరీంనగర్ వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల నిర్వహించిన రైసిల్ నాలెడ్జ్ ఎడ్యుకేషన్ సొల్యూషన్ ఆధ్వర్యంలో అబాకస్ వేదిక్ మ్యాథ్స్ కాంపిటీషన్ నిర్వహించారు. ఈ పోటీలలో శ్రేష్ఠ కిడ్స్ ప్లే స్కూల్ విద్యార్థినిలు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి బహుమతులు కైవసం చేసుకున్నారు. బహుమతులు సాధించిన విద్యార్థులను శ్రేష్ఠ కిడ్స్ ప్లే స్కూల్ కరస్పాండెంట్ సిరిపురం బిందు, ప్రిన్సిపాల్ వేల్పుల మౌనిక ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అభినందించారు.

# గ్రామాలలో మౌళిక వసతుల కల్పనపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి




**అబ్కారి, పర్యాటక, సంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు**

**గ్రామాల అభివృద్ధి తోనే దేశాభివృద్ధి సాధ్యం : ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

**వనపర్తి బ్యూరో ఫిబ్రవరి 09 (జనంసాక్షి)**

రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలు, గ్యారెంటీల అమలుతో పాటు గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తుందని రాష్ట్ర అబ్కారి, పర్యాటక, సంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం వనపర్తి నియోజకవర్గం పెద్దమందడి మండలంలోని పలు గ్రామాల్లో స్థానిక శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి తో కలిసి రూ. 18.71 కోట్ల నిధులతో బీటీ, సీసీ రోడ్లు, డ్రైయినేజీలు సహా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి తోనే దేశాభివృద్ధి సాధ్యం అని తెలిపారు. గ్రామాలలో మౌళిక వసతుల కల్పన పై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలలో పారిశుధ్యం, రోడ్డు రవాణా సౌకర్యాలను మెరుగుపర్చడం ద్వారా జీవన ప్రమాణాలు సుస్థిరమవుతాయన్నారు. ఎమ్మెల్యే మేఘరెడ్డి వీరాయ పల్లి గ్రామంలో మాట్లాడుతూ వచ్చే డిసెంబర్ చివరికల్లా ఒక్క పెండింగ్ పనులు లేకుండా అభివృద్ధి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. ఇల్లులేని ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్ళు, రేషన్ కార్డులు మంజూరు చేయిస్తానని హామీనిచ్చారు. ముందుగా, పెద్దమందడి మండల పరిధిలో ని చిలకటోని పల్లి గ్రామంలో రూ. 9.5 లక్షల వ్యయంతో నిర్మించనున్న సైడ్ డ్రైనేజీ పనులకు శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి శంఖుస్థాపన చేశారు. అనంతరం వెల్టూర్ గ్రామ పంచాయతీలో రూ. 15 లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రెయిన్ పనులకు శంఖుస్థాపన చేశారు. గట్ల ఖానాపూర్ లో రూ. 3.20 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అల్వాల్ మంగంపల్లి బి.టి రోడ్డు, రూ. 10 లక్షల వ్యయంతో డ్రైన్ నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేశారు.
రూ. 4.50 కోట్ల అంచనా వ్యయంతో అమ్మ పల్లి నుండి పెద్దమందడి వయా సోలార్ ప్లాంట్ వరకు వేయనున్న బి.టి. రోడ్డు పనులకు, గ్రామంలో రూ. 10 లక్షలతో సీసీ రోడ్ పనులకు ఆబ్కారీ పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్థానిక శాసన సభ్యులతో కలసి శంఖుస్థాపన చేశారు. మదిగట్ల గ్రామ పంచాయతీలో రూ. 15 లక్షల వ్యయంతో నిర్మించనున్న సి.సి రోడ్డు కు మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే మేఘరెడ్డి శంఖుస్థాపన చేశారు. అనంతరం, మొజర్ల గ్రామ పంచాయతీలో మంత్రి జూపల్లి, తూడి మేఘా రెడ్డి అంబేద్కర్ విగ్రహానికి, మహాత్మ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. మోజర్ల గ్రామంలో రామలింగేశ్వర స్వామి దేవాలయంలో రూ. 5 లక్షల వ్యయంతో నిర్మించిన కామన్ సెంటర్ ను ప్రారంభోత్సవం చేశారు. అల్వాల గ్రామపంచాయతీలో అల్వాల నుండి పెద్దమందడికి రూ. 4.75 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బి.టి రోడ్డు, గ్రామ పంచాయతీలో రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రైన్ పనులకు ఎమ్మెల్యే శంఖుస్థాపన చేశారు. ఆ తర్వాత చిన్న మందడి గ్రామ పంచాయతీలో రూ. 10 లక్షలతో నిర్మించనున్న సి.సి. రోడ్డు, రూ. 5 లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రైన్ పనులకు ఎమ్మెల్యే శంఖుస్థాపన చేశారు. వీరాయ పల్లి గ్రామంలో రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రైన్, సి.సి రోడ్డు పనులకు ఆర్డీఓ, గ్రామ రాజకీయ ప్రతినిధులతో కలిసి శంఖుస్థాపన చేశారు. పామిరెడ్డీ పల్లి గ్రామ పంచాయతీలో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించనున్న సి.సి.రోడ్లు, డ్రైన్ పనులకు శంఖుస్థాపన ఎమ్మెల్యే మేఘా రెడ్డి శంకుస్థాపన చేశారు. పామిరెడ్డి పల్లి, జంగమయపల్లి – బలిజపల్లి గ్రామాల్లో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించనున్న సి.సి రోడ్లు, డ్రెయినేజీ పనులకు భూమి పూజ చేశారు. జంగమాయ పల్లి నుండి మమ్మయపల్లి వరకు రూ. 1.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బి.టి రోడ్డు పనులకు శాసన సభ్యులు శంఖుస్థాపన చేశారు. దొడగుంట పల్లి గ్రామ పంచాయతీలో రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సి.సి.రోడ్లు, డ్రైన్ పనులకు శంఖుస్థాపన ఎమ్మెల్యే మేఘా రెడ్డి శంకుస్థాపన చేశారు.
అంకాయ పల్లి తండా నుంచి దొడగుంట పల్లి వరకు రూ. 1.20 కోట్ల తో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా అంకయపల్లి తండా లో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసారు. అదేవిధంగా పెద్దమందడిలో రూ. 5 లక్షల తో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జగత్ పల్లి గ్రామ పంచాయతీలో రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సి.సి.రోడ్లు, డ్రైన్ పనులకు శంఖుస్థాపన ఎమ్మెల్యే మేఘా రెడ్డి శంకుస్థాపన చేశారు. మణిగిల్ల గ్రామ పంచాయతీలో రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సి.సి.రోడ్లు, డ్రైన్ పనులకు శంఖుస్థాపన ఎమ్మెల్యే మేఘా రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, పెద్దమందడి ఎమ్మార్వో సరస్వతి, ఎంపీడీవో సద్గుణ, సింగిల్ విండో డైరెక్టర్ సాయి చరణ్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ డీఈ లక్ష్మీనారాయణ, ఏఈలు, ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నాసా ప్రాజెక్టులో నారాయణ విద్యార్థుల ప్రభంజనం




**హయత్ నగర్, ఫిబ్రవరి 9 (జనం సాక్షి)**

హయత్ నగర్ నారాయణ పాఠశాలల విద్యార్థులు అన్ని రంగాలలో తమ ప్రతిభను విశ్వవ్యాప్తంగా కీర్తి ప్రతిష్ఠలను చాటుతూ, నారాయణ విద్యాసంస్థల పెంపొందిస్తున్నారు. 2024 లో లైవ్ ఇన్ ఎ హెల్త్ స్పేస్ డిజైన్ పోటీలు ప్రపంచవ్యాప్తంగా నిర్వగహించగా బంగ్లాదేశ్, బల్గేరియా, కెనడా, ఐస్లాండ్, ఇండియా, ఇండోనేషియా, పాకిస్తాన్, పెరూ, రోమేనియా, టర్కి, యునైటెడ్ స్టేట్స్ 11 దేశాలకు చెందిన 9,028 మంది విద్యార్యులు పాల్గొనేందుకు 1641 ఎంట్రీలలో రావడం జరిగింది. ఈ పోటీల్లో సృజనాత్మకత వినూత్న పని ఎన్.ఎస్.ఎస్.ఎ (నాసా) ప్రాజెక్టులో హయత్ నగర్ బ్రాంచ్ నారాయణ స్కూల్ 8 వ తరగతి లార్జ్ గ్రూప్ విద్యార్థులు డి. లక్ష్మి ప్రణతి, వర్షన్, చిత్ర ఎన్, హర్షిత్, జి.రిషి–సింగ్, వి. వి. చంద్రబోస్, జి.గౌతమ్ రెడ్డి, జె. సాయి చరన్, స్వాస్థ్య ప్రాజెక్టు పేరుతో, డి.లక్ష్మిల ప్రనతి అంతరిక్ష పోషణ్ అనే ప్రాజెక్టును రూపొందించారు. ఇందుకుగాను నారాయణ పాఠశాల విద్యార్థులకు 2024 లైవ్ ఇన్ ఏ హెత్తి స్పేస్ డిజైన్ పోటీల్లో ద్వితీయ బహుమతిని సాధించారు. ఏడవ తరగతిన చెందిన విద్యార్థులు .వి. క్రిశాల్ రెడ్డి, వి. రిషన్ రెడ్డి , వి. రిచి రెడ్డి, ఎం. అక్షిత, జి. మాన్విత పి. మోక్షిత సాయి, కె. మానస్వి చంద్రుడు ప్రాజెక్టు పేరుతో సృజనాత్మకత వినూత్న కార్యక్రమం ఎన్.ఎస్.ఎస్ (నాసా) ప్రాజెక్టులో అత్యద్భుత ప్రతిభ కనబరచి 11 దేశాల నుండి వచ్చిన విద్యార్థుల నుండి పోటీ తట్టుకొని నిలిచి ద్వితీయ బహుమతి విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా విజయం సాధించిన విద్యార్థులను
జి.ఎం గోపాల్ రెడ్డి , ఎ.జి.యం రవీంద్రబాబు, ఆర్ అండ్ డి శివరంజని, కో ఆర్డినటర్ సృజన్, నారాయణ స్కూల్ ప్రిన్సిఫాల్ లావణ్య లు విద్యార్థులను ఘనంగా సత్కరించి అభినంధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లోనూ ప్రతిభ దాగి ఉంటుందని, వారి నైపున్యాన్ని బయటికి తీస్తే వారు ప్రతిభావంతులుగా మారుతారని అన్నారు. నారాయణ పాఠశాలల విద్యా సంస్థ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వారిని ప్రతిభావంతులుగా తిర్చిదిద్దుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డీన్ నాజిర్, ఉపాధ్యాయ బృందం, సిబ్బంది, తదితరులు పాల్గోన్నారు.

# కోటగుళ్లలో సండే సందడి



**వివిధ జిల్లాల నుండి తరలివచ్చిన విద్యార్థులు ఉదయం నుండి సాయంత్రం వరకు కొనసాగిన పర్యాటకుల తాకిడి**

**గణపురం, ఫిబ్రవరి 09 ( జనం సాక్షి):**

మండల కేంద్రంలోని కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళ లో ఆదివారం వివిధ జిల్లాల నుండి పాఠశాల విద్యార్థులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంది. సెలవు దినం కావడంతో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు బస్సులు వ్యాన్ల లో కోటగుళ్ళకు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఆలయ చరిత్రను శిల్పసంపద విశిష్టతను తమ విద్యార్థులకు వివరించారు. అదేవిధంగా మంగపేట ఉన్నత పాఠశాల విద్యార్థులతో పాటు ఎంఈఓ పి.మేనక ఉపాధ్యాయ బృందం వారి విద్యార్థులతో కలిసి కోట గుళ్ళ నుసందర్శించారు.

## డ్రెస్ కోడ్ పాటించని నాయకులు,భక్తులు



**కాళేశ్వరం, ఫిబ్రవరి 09,(జనం సాక్షి)**

దక్షిణ కాశీగా పేరుగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరం ఆలయ గర్భ గుడిలోకి స్వామి వారి దర్శనం, అభిషేకం చేసుకునేందుకు వెళ్లే భక్తులు తప్పనిసరిగా లొంగి పంచ డ్రెస్ కోడ్ పాటించాలి. అయితే రాష్ట్ర మంత్రులు వచ్చిన నేపథ్యంలో వారితో వచ్చిన కొందరు నాయకులు, భక్తులు డ్రెస్ కోడ్ పాటించకుండా ఆలయ గర్భగుడిలోకి ప్రవేశించి స్వామివారికి అభిషేకం చేశారు. ఈ విషయంపై స్థానిక గ్రామస్తులు ,దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అధికారులను అర్చకులను ప్రశ్నించడం కనిపించింది. ఇప్పటికైనా ఆలయ ఈవో గర్భగుడి లోనికి ప్రవేశించే ఏ భక్తుడైన డ్రెస్ కోడ్ పాటించే విధంగా చూడాలని ప్రజల కోరుతున్నారు.

# కాళేశ్వరంలో మహా కుంభాభిషేక మహా ఘట్టం




**చూసి తరించిన భక్త జనం**

**శివ నామ స్మరణతో మారుమ్రోగిన దేవాలయం**

**జయ జయ శంకర ... హర హర శంకర అంటూ భక్తుల పూజలు**

**కాళేశ్వరం, ఫిబ్రవరి 09,(జనం సాక్షి)**

గోదావరి ప్రాణహిత సరస్వతి నదుల త్రివేణి త్రివేణి సంగమం... దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయంలో మహా కుంభాభిషేక మహోత్సవ మహా ఘట్టం ఆదివారం ఘనంగా జరిగింది. 42 సంవత్సరముల తర్వాత మహా కుంభాభిషేక మహాక్రతువుకు ఆదివారం వేదికయింది. గంగా యమునా సరస్వతి సంఘమైన ప్రయాగరాజ్ లో మహాకుంభమేళ జరుగుతున్న తరుణంలోనే కాళేశ్వరంలో త్రివేణి సంగమంలో మహాకుంభాభిషేక ఘట్టం ఆవిష్కృతమైంది. ఆదివారం ఉదయం సరిగ్గా 10:42 సుముహూర్తాన మహా కుంభాభిషేక ఘట్టానికి రుత్వికులు శ్రీకారం చుట్టారు. 7 నుండి 9వ తేది వరకు మూడు రోజుల పాటు జరిగిన క్రతువులో 3వ రోజు కుంభాభిషేక మహోత్సవ ఘట్టంలో భాగంగా విశేష పూజలు చేశారు. శత చండీ పారాయణం, సహస్రఘట్టాభి షేకం తదితర ప్రత్యేక పూజలను నిర్వహించారు. శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామివారికి సహస్ర ఘట్టాలతో విశేష అభిషేకాన్ని ఘనంగా జరిపారు. ఆదివారం ఉదయం 10 గంటల 42 నిమిషాలకు వేద పండితులు మంత్రోచ్చారణ మధ్య శృంగేరి పీఠానికి సంబంధించిన తపోవన పీఠాధిపతి శ్రీ సచ్చిదానంద సరస్వతిచే కుంబాభిషేక మహోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ,ఐటీ శాఖ మంత్రి మరియు స్థానిక ఎంఎల్ఏ దుడ్డిల్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ , దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్, భూపాలపల్లి ఎమ్మెల్యే గంగ సత్యనారాయణరావు,జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు హాజరయ్యారు. దేవాదాయ శాఖ ఆర్ జె సి రామకృష్ణ రావు, డి సి లు, ఎ సి లు,ఆలయ కార్యనిర్వాహణ అధికారి మహేష్ తో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కాలేశ్వరంలో మహా కుంభాభిషేకం కార్యక్రమంలో భాగంగా శనివారం శ్రీ శ్రీ శ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామీజీ ముక్తేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ముందుగా ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం కాలేశ్వరం ముక్తేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆలయంలో విశేష పూజలు చేశారు. రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ళ శ్రీధర్ బాబు , పొన్నం ప్రభాకర్లు ఆలయానికి విచ్చేసి ముందుగా యాగశాల వద్ద స్వామీజీ ఆశీస్సులు తీసుకోని కుంభములకు పూజ చేసి పూర్ణాహుతి లో పాల్గొన్నారు. అనంతరం కాళేశ్వర ముక్తేశ్వర స్వామి వారలకు అభిషేకం నిర్వహించారు. కుంభాభిషేకమ్ పూర్తయిన పిదప ఆలయ ఆవరణలోని కళ్యాణ మండపం వద్ద బ్రహ్మశ్రీ బాచంపల్లి సంతోష్ కుమార్ శర్మ భక్తులను ఉద్దేశించి ప్రవచనం ఇచ్చారు. ఈ కార్యక్రమం విజయవంతం
చేసినందుకు శ్రీశ్రీశ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామి వారు రాష్ట్ర ప్రభుత్వానికి ,దేవాదాయ శాఖ అధికారులకి,జిల్లా అధికారులకి, ఆలయ అర్చకులు, సిబ్బందికి ఆశీస్సులు అందచేశారు.

# గీతంలో ముగిసిన ప్రమాణ-2025





**అలరించిన సాంకేతిక-సాంస్కృతికోత్సవాలు**

**విద్యార్థులలో మిన్నంటిన కోలాహలం**

**పటాన్చెరు ఫిబ్రవరి 9 (జనంసాక్షి)**

హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న వార్షిక సాంకేతిక–సాంస్కృతికోత్సవాలు ఆదివారం నిర్వహించిన ఈడీఎం – డీజే నైట్ తో విజయవంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన పలు కార్యక్రమాలలో విశ్వవిద్యాలయంలోని వివిధ విభాగాల విద్యార్థులు తమ ప్రతిభ, నైపుణ్యాలను ప్రదర్శించి, ప్రేక్షకుల మన్ననలను చూరగొనడమే గాక, బోలెడంత ఆత్మవిశ్వాసాన్ని ప్రోదిచేసు కున్నారు. ప్రారం భోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన సంగారెడ్డి జిల్లా ఎస్పీ సిహెచ్.రూపేష్, ఆత్మీయ అతిథిగా పాల్గొన్న ఎస్ వై ఎన్ వై సి ఎస్గ్రూపు ముఖ్య కార్యనిర్వహణాధికారి, వ్యవస్థాపకుడు శ్రహంజ్ ప్రమాణ–2025ను లాంఛనంగా జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించి, విద్యార్థులను ఉన్నతాశయాల వైపు ప్రేరేపించేలా ప్రసంగించారు. మూడు రోజుల పాటు జరిగిన ఈ వేడుకలలో విద్యార్థుల ప్రతిభ, నైపుణ్యాలను వెలికితీసేలా పలు కార్యక్రమాలను నిర్వహించారు. పలు కార్యశాలలు, ఆటో ఎక్స్ పో. బ్యాటిల్ ఆఫ్ బ్యాండ్స్ తో పాటు వివిధ పోటీలు, ర్యాంప్ వాక్, నృత్యాలు, పాటల పోటీలను నిర్వహించారు. ఇవన్నీ విద్యార్థులలో నిబిడీకృతంగా ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ఉపకరించాయనడంలో సందేహం లేదు. కళాకారుల ప్రతిభా ప్రదర్శన విభాగంలో నికితా గాంధీ, మంగ్లీ తమ హుషారు పాటలతో ప్రేక్షకులను మంత్రమగ్ధులను చేశారు. ఇక చివరి రోజు ప్రపంచ ప్రసిద్ధ జూలియా బ్లిస్, పీఆర్ వో బ్రదర్స్ యొక్క అద్భుతమైన ఈడీఎం– డీజే నైట్ ప్రదర్శనతో ప్రమాణ–2025 విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమం విద్యార్థులందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి వారి గమనాన్ని కొత్త కోణంలోకి తీసుకెళ్లింది. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీలు, ఇతరత్రా కార్యక్రమాలలో జంట నగరాలలోని పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు కూడా పాల్గొని తమ ప్రతిభా పాఠవాలను ప్రదర్శించారు. గీతం హైదరా బాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు పర్యవేక్షణలో రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఆధ్యాపక సలహాదారు ప్రొఫెసర్ పి త్రినాథరావు, డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ లైఫ్ ప్రతినిధి రాహుల్ మండల్, పలువురు అధ్యాపకులు, ప్రమాణ కోర్ కమిటీ సభ్యులు ఈ వేడుకలను పర్యవేక్షించి, విజయ వంతంగా పూర్తయ్యేలా కృషిచేశారు.

# కులగణన సర్వే తప్పుల తడక

**రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర**



**హైదరాబాద్ (జనంసాక్షి)**

రాష్ట్ర ప్రభుత్వం జరిపించిన కులగణన సర్వేలో తమ సామాజిక వర్గం జనసంఖ్యను తక్కువ చేసి చూపడాన్ని మున్నూరుకాపులు తీవ్రంగా ఖండించారు. జనాభాలో అత్యధికులుగా ఉన్న తమను తక్కువ చేసి చూపి ప్రభుత్వం అవమానించిందని, అగౌరవపర్చిందని, అణచివేతకు పాల్పడుతుందని మున్నూరుకాపు ప్రముఖులు ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పూరితంగా జరిపించిన సర్వేకు వ్యతిరేకంగా హైదరాబాద్ నగరంలో 10లక్షల మందితో భారీ బహిరంగ సభను నిర్వహించాలని మున్నూరుకాపు ప్రముఖులు నిర్ణయించారు. మున్నూరుకాపు అపెక్స్ కౌన్సిల్ పిలుపు మేరకు"కులగణన ఫలితాలు–జరిగిన తప్పిదాలు"అనే అంశంపై మున్నూరుకాపు ప్రముఖులు సికింద్రాబాద్ లో ఆదివారం సాయంత్రం అత్యవసరంగా సమావేశమయ్యారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, డాక్టర్ కోవా లక్ష్మణ్, మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తదితర ప్రముఖులు ఈ కులగణన సర్వేను తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని, వెంటనే రీసర్వే జరిపించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. అపెక్స్ కౌన్సిల్ కన్వీనర్ సర్దార్ పుటం పురుషోత్తమ రావు అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో కేంద్ర మంత్రి సంజయ్ మాట్లాడుతూ,మున్నూరుకాపు సామాజిక వర్గం రాష్ట్రంలో అత్యధికులుగా ఉన్నందునే బీజేపీ, కాంగ్రెస్ లు రాష్ట్ర పార్టీ అధ్యక్షులుగా పలుమార్లు మున్నూరుకాపు నాయకులను నియమించడం జరిగిందన్నారు. ఈ సభకు ముందు మున్నూరుకాపులను కార్యోన్ముఖులను చేసేందుకు,మరింత ఉత్సాహాన్ని నింపేందుకు పలు కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆ తర్వాత మనకు నష్టం చేయాలని చూసిన పాలకులకు దడ పుట్టేలా 10లక్షల మందితో భారీ బహిరంగ సభ జరుపుదామన్నారు. సమావేశంలో రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ,సందర్భం వచ్చినప్పుడల్లా మనమందరం మరింత ఐకమత్యంతో ముందుకు సాగుతూ పాలకులపై వత్తిడి పెంచాల్సిన అవసరం ఉందన్నారు. మన జనాభా తక్కువ చేసి చూపిన ఈ కులగణనను అంగీకరించే ప్రసక్తే లేదని, వెంటనే రీ సర్వేకు ముక్తకంఠంతో డిమాండ్ చేద్దామన్నారు.

# నేడు జరిగే ప్రజావాణి (గ్రీవెన్స్) కార్యక్రమం రద్దు ..

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద.**

**వరంగల్ ప్రతినిధి : ఫిబ్రవరి 09(జనంసాక్షి)**



ఫిబ్రవరి 10వ తేదీ వరంగల్ జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తెలంగాణ లెజిస్లేటివ్ కౌన్సిల్ టీచర్ కన్స్టిట్యూన్సీ ఎన్నికలో పరిపాలన పరమైన కారణాల దృష్ట్యా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ప్రకటనలో తెలిపారు. వరంగల్ జిల్లా ప్రజలు ఇట్టి విషయాన్ని గమనించి జిల్లా నలుమూలల నుండి ప్రజలు ఫిర్యాదులు ఇచ్చుటకు కలెక్టరేట్ కార్యాలయానికి రావద్దని, కలెక్టర్ ఆ ప్రకటన లో తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
10 ఫిబ్రవరి 2025

# ఫ్యాక్టరీని రద్దు చేయకుంటే ప్రాణత్యాగానికైనా సిద్ధమే..



- రాజకీయాలతో మాకు సంబంధం లేదు
- ఇథనాల్ పరిశ్రమ రద్దు కావడమే మా లక్ష్యం
- 18వ రోజుకు చేరిన దీక్ష

**రాజోలి, ఫిబ్రవరి 09 (జనంసాక్షి) :** మానవ మనుగడకు విషం చిమ్మే ఇథనాల్ పరిశ్రమలను రద్దు చేయాలని పెద్ద ధన్వాడ శివారులో రిలే నిరాహార దీక్ష ఆదివారనికి 18వ రోజుకు చేరుకుంది. ఈ రిలే నిరాహార దీక్షకు మద్దత్తుగా ఆయా గ్రామాల మహిళలు మద్దత్తు తెలిపి నిరసన తెలిపారు. ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా పరిశ్రమ నిర్మాణం ప్రభుత్వం వ్యవహరిస్తే పెద్దఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. విషవాయువుల వ్యర్థాలు తుంగభద్ర నదిలో కలిస్తే అలంపూర్ నియోజకవర్గం మరియు రాయలసీమ ప్రాంతానికి ప్రజలకు భవిష్యత్‌లో తాగునీరు కూడా పూర్తిగా కలుషితమయ్యే అవకాశం ఉందన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్న కంపెనీ నిర్మాణాన్ని అనుమతులు వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. నాలుగు నెలలుగా తాము శాంతియుతంగా పోరాటం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రాజకీయాలతో తమకు సంబంధం లేదని, ఇథనాల్ పరిశ్రమ రద్దు కావడమే తమ ఎజెండా అని అన్నారు. పచ్చని పంట పొలాల్లో ఫ్యాక్టరీని నిర్మించడం వలన రైతులు అనేక విధాలుగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ఫ్యాక్టరీ రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ రిలే నిరాహార దీక్షకు మద్దత్తుగా బిఆర్ఎస్వి జిల్లా అధ్యక్షుడు కుర్వ పల్లయ్య మద్దత్తు తెలిపి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కళావతి, నరసమ్మ, చిన్నమ్మ, రాణమ్మ, చాకలి బజారమ్మ, రంగమ్మ, చాకలి, లలితమ్మ పెద్దయ్య, మోహన్ రావు, మహేశ్వర రావు, శ్రీనివాసులు, బ్రహ్మయ్య బజరన్న, వడ్ల కృష్ణయ్య, ఎల్లప్ప, శీను, తిరుమలేష్, మాణిక్యం, సుధాకర్, మార్కు, శివ, ఖలీల్ విష్ణువర్ధన్ రెడ్డి, నారాయణ, గిడ్డారెడ్డి, సత్యారెడ్డి, సుధాకర్ రెడ్డి, వెంకటేష్, కార్తీక్,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## యువతిపై ఆటో డ్రైవర్ అత్యాచారయత్నం

- నిందితుడి అరెస్టు

**కొత్తగూడెం, ఫిబ్రవరి 9 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఓ యువతి ఆటో డ్రైవర్ చేతిలో దారుణమైన అనుభవాన్ని ఎదుర్కొంది. నిందితుడు ఆమెను మోసపుచ్చి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. అయితే, ఆమె సాహసంతో అతని చెర నుంచి తప్పించుకొని తన బంధువులకు విషయం తెలియజేయడంతో నిందితుడిని పట్టుకోవడానికి వారు రంగంలోకి దిగారు. పోలీసుల వివరాల ప్రకారం.. కరకగూడెం గ్రామానికి చెందిన ఓ యువతి, కొత్తగూడెం రామా టాకీస్ ప్రాంతంలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లేందుకు శనివారం కొత్తగూడెం బస్టాండ్‌కు వచ్చింది. యువతి పూర్తిగా మాట్లాడలేని పరిస్థితిలో ఉండటంతో, ఆమె అడ్రస్ ఆటో డ్రైవర్‌కు అర్థంకాలేదు. పక్కన ఉన్న మరో ఆటో డ్రైవర్ ఆమె వద్ద ఉన్న సెల్ నంబర్‌కు కాల్ చేసి అడ్రస్ తెలుసుకొని, కుమార్ అనే ఆటో డ్రైవర్‌కు చెప్పాడు.

ఆమె ఆటోలో ఎక్కిన వెంటనే, అందులో మరో వ్యక్తి ఇప్పటికే ఉన్నాడు. ఆమెను చెప్పిన గమ్యస్థానానికి కాకుండా, హేమచంద్రాపురం రైల్వే గేట్ సమీపంలోని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లాడు. యువతి తనకు ఎక్కడికి తీసుకెళు _న్నారని సైగలతో ప్రశ్నించగా, డ్రైవర్ కుమార్ మరియు అతని సహచరుడు ఆమెపై అత్యాచారయత్నం చేశారు. సాహసంతో తప్పించుకున్న యువతి: వారి నుంచి తప్పించుకున్న యువతి రైల్వే గేట్ వైపు పరుగెత్తి అక్కడ ఉన్న రైల్వే ఉద్యోగికి సైగల ద్వారా తనకు ఎదురైన సంఘటన వివరించింది. యువతి వద్ద ఉన్న సెల్ నంబర్‌కు ఫోన్ చేసి బంధువులకు సమాచారం ఇచ్చారు. తన బంధువుల సహాయంతో యువతి పోలీసులకు సమాచారం అందించింది. బస్టాండ్ పరిసరాల్లోని సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించి, నిందితుడిని గుర్తించారు. ముందుగా అడ్రస్ కోసం కాల్ చేసిన ఆటో డ్రైవర్ ద్వారా కుమార్ యొక్క వివరాలను కూడా సేకరించారు. దీంతో పట్టణంలోని సూపర్‌బజార్ నుంచి మెయిన్ హాస్పిటల్ వెళ్తున్న సమయంలో నిందితుడిని గుర్తించారు. పోలీసుల కనిపించడం చూసిన కుమార్ పారిపోవడానికి యత్నించాడు. ఈ క్రమంలో రెండు కార్లు, ఒక ఆటోను ఢీకొట్టినా, చివరికి స్థానికుల సహాయంతో అతన్ని పట్టుకుని పోలీసులకు అప్పగించారు.ప్రస్తుతం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నారు.

## నెలాఖరుకు బీజేపీకి కొత్త అధ్యక్షుడు?

**హైదరాబాద్, ఫిబ్రవరి 9 (జనంసాక్షి) :** బీజేపీ హైకమాండ్ తెలంగాణపై ఫోకస్ చేసింది. ఈనెలారులోగా కొత్త అధ్యక్షుడ్ని ప్రకటించాలని నిర్ణయించింది. రేపో మాపో పార్టీ పరిశీలకులు ఢిల్లీ నుంచి తెలంగాణకు రానున్నారు. 2029 ఎన్నికల్లో తెలంగాణలో కాషాయి జెండా ఎగురవేయాలనేది కమలనాథుల ఆలోచన. అందుకు సంబంధించి అన్ని అస్త్రాలను సిద్ధం చేస్తోంది. మరి బీజేపీ సింగిల్ గా వెళ్తుందా? లేకుంటే టీడీపీ–జనసేనతో పొత్తు పెట్టుకుని ముందుకు వెళ్తుందా అనేది ఆసక్తికరంగా మారింది. ఢిల్లీలో విజయం సాధించడంతో ఫుల్‌జోష్‌లో ఉంది బీజేపీ. ఈ నేపథ్యంలో తెలంగాణలో మెల్లగా పావులు కదుపుతోంది. 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణపై ఫోకస్ చేసింది. అందుకు ఇప్పటి నుంచే వ్యూహాలు రచించే పనిలో నిమగ్నమైంది. తెలంగాణలో పార్టీ బలాబలాల గురించి డీటేల్స్ తెప్పించుకుందని సమాచారం. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్ దెబ్బకు డీలా పడింది బీఆర్ఎస్ పార్టీ. ఆ తర్వాత జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కనీసం ఖాతా తెరవలేదు. రెండు దశాబ్దాల తర్వాత పార్లమెంటులో ఆ పార్టీకి స్థానం లేకుండా పోయింది. అయినప్పటికీ తాము బలంగా ఉన్నామంటూ మీడియా ముందు ఆ పార్టీ నేతలు ఒకటే రీసౌండ్. మరి ఏమనుకుందో తెలీదుగానీ త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకుంది. కీలక నేతలకు కేసులు వెంటాడుతున్నాయి. ఏం చెయ్యాలో తెలియక కేడర్ దిక్కు తోచని పరిస్థితిలో ఉంది. ఇక బీజేపీ.. మూడు అడుగులు ముందుకు.. నాలుగు అడుగులు వెనక్కి అన్నచందంగా మారింది. బీఆర్ఎస్ లోటును అంది పుచ్చుకోలేక పోతోంది. సింపుల్‌గా చెప్పాలంటే తెలంగాణలో రాజకీయ శూన్యత కనిపిస్తోంది. సరైన ప్రతిపక్ష లేకుండా పోయింది. ఆ లోటును భర్తీ చేసుకోవాలనే పనిలో నిమగ్నమైంది బీజేపీ. అందుకోసం ఇప్పటి నుంచే వ్యూహాలను రచిస్తోంది. తెలంగాణ బీజేపీ నుంచి హైకమాండ్‌కు నివేదిక చేరిందట. వచ్చే ఎన్నికలకు సింగిల్‌గా వెళ్లేకంటే రెండు లేదా మూడు పార్టీలతో కలిసి వెళ్తే వచ్చే ఎన్నికల్లో మంచి ఫలితాలు వస్తాయన్నది ప్రధాన పాయింట్. టీడీపీ గురించి ఎలాగూ తెల్సిందే.

## న్యాయవాదులు ఒత్తిడి రహిత జీవితాన్ని అలవర్చుకోవాలి








- అడ్వకేట్ జనరల్ ఎ. సుదర్శన్ రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 9 (జనంసాక్షి) :** న్యాయవాదులు జీవితంలో ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలంటే ఒత్తిడి, బలహీనత, భావోద్వేగాలకు దూరంగా ఉండాలని అడ్వకేట్ జనరల్ ఎ. సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కేర్ హాస్పిటల్ హైటెక్ సిటీ, టీసీఓఎస్, టీఓఎస్ఏ, అడ్వకేట్ వాలంటీర్లు బేసిక్ లైఫ్ సపోర్ట్, కార్డియోపల్మోనరీ రిససిటేషన్ అనే అంశంపై న్యాయవాదులకు వర్క్‌షాప్, శిక్షణా తరగతులను నిర్వహించారు. వర్క్‌షాప్‌కు ఏజీ సుదర్శన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై న్యాయవాదులు ఒత్తిడి లేని జీవితాన్ని ఎంచుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. న్యాయవాదిగా ఉండటం వల్ల కోర్టులో కేసులకు సంబంధించి ప్రతిరోజూ కొత్త సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని, న్యాయస్థానాల్లో కేసులను న్యాయబద్ధంగా విచారించాలంటే ఒత్తిడి, భావోద్వేగాల ప్రభావాన్ని ఎలాగైనా నివారించాలని ఏజీ సుదర్శన్‌రెడ్డి న్యాయవాదులకు ఉద్బోధించారు. వర్క్‌షాప్‌లో తెలంగాణ బార్ కౌన్సిల్ కార్యవర్గ సభ్యుడు శ్రీ బన్నూరు కొండారెడ్డి మాట్లాడుతూ కార్డియాక్ అరెస్ట్ కారణంగా పెరుగుతున్న మరణాల సంఖ్య గురించి ఇటీవలి నెలల్లో న్యాయవాదులు, మరణాలపై విచారం వ్యక్తం చేశారు. బిఎల్ఎస్ సిపిఆర్‌పై వర్క్‌షాప్ నిర్వహించేందుకు చొరవ తీసుకున్న కేర్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ మరియు వైద్యులు, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కేర్ హాస్పిటల్ హైటెక్ సిటీ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ వేల్పుల జగన్ మోహన్ రెడ్డి, టీఓఎస్ఏ ప్రెసిడెంట్, ఆర్థోపెడిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ వై. తిమ్మారెడ్డి, తెలంగాణ హైకోర్టు జీపీ ఫర్ హోమ్ శ్రీ మహేష్ రాజే, ఏఎంఏసీఎస్ డైరెక్టర్లు తోర్నాల గిరి, ఆర్ముల మహేశ్వర్, ఇతర వైద్య నిపుణులు ఆరోగ్యం, ఒత్తిడి లేని జీవితం గురించి నొక్కిచెప్పారు. అనంతరం వర్క్‌షాప్‌లో శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

# కొహెడలో హైడ్రా కూల్చివేతలు

- అక్రమ కట్టడాలను తొలగించిన హైడ్రా

**హైదరాబాద్, ఫిబ్రవరి 9 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ మండలంలోని కొహెడ గ్రామంలో హైడ్రా ఆదివారం కూల్చివేతలు జరిపింది. సర్వే నంబర్ 951, 952 లోని గ్రామపంచాయతీ లేఔట్లో తమ ప్లాట్లను సమ్మిరెడ్డి బాల్‌రెడ్డి ఆక్రమించి.. రహదారులు లేకుండా అడ్డుగోడలు కట్టారని రాధే ధామం లే ఔట్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో పాటు పలువురు ప్లాట్ ఓనర్ల ఫిర్యాదు మేరకు హైడ్రా చర్యలు తీసుకుంది. కోహెడ గ్రామంలోని సర్వే నెం.951, 952లోని భూమి కి సంబధించిన ధ్రువపత్రాలను పరిశీలించగా.. 1986లో భూ యజమానులు కె. రాములు, పెద్దయ్య, ఈసయ్య గ్రామ పంచాయతీ లేఔట్ వేసినట్టు నిర్ధారించారు. సమ్మిరెడ్డి బాల్‌రెడ్డి భూమిని స్వాధీనం చేసుకుని, ఫాం హౌస్ నిర్మించడంతో పాటు..లే ఔట్‌లోని పలు ప్లాట్లను సొంతం చేసుకుని... దాని అంతర్గత రహదారులను బ్లాక్ చేసినట్టు తేలింది. సంబంధిత అన్ని పత్రాలతో హాజరు కావాలని కావాలని ఇరు పక్షాలకు హైడ్రా నోటీసులు జారీ చేసింది. ఈ నెల 8వ తేదీన ఇరు పక్షాలు హాజరు కాగా.. రెవెన్యూ, మున్సిపల్ అధికారుల సమక్షంలో పత్రాల పరిశీలించారు. ఫామ్‌హౌస్, షెడ్, కాంపౌండ్ వాల్, ఫెన్సింగ్ నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేవని..




తుర్కయాంజల్ మున్సిపల్ అధికారులు ధ్రువీకరించారు. లే ఔట్ వేసి తమకు ప్లాట్లుగా అమ్మిన తర్వాత సమ్మిరెడ్డి ఈ భూమిని కొన్నట్టు రికార్డులు సృష్టించారని ప్లాట్ ఓనర్ల అససియేషన్ ప్రతినిధుల ఆరోపించారు. ఇరుపక్షాలతో పాటు రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో విచారించారు. సమ్మిరెడ్డి బాల్‌రెడ్డి నిర్మించిన ఫాంహౌస్‌తోపాటు.. ఏర్పాటు చేసిన ప్రహరీ, ఫెన్సింగ్ కూల్చివేతకు హైడ్రా కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం పోలీసు బందోబస్తు మధ్య కొహెడలో హైడ్రా కూల్చివేతలు కొనసాగాయి.



# సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయంపై దృష్టి

- ప్రధాని మోడీ అదే సూచించారు
- రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మెన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9 (జనంసాక్షి) :** సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయంపై దృష్టిపెట్టాలని ప్రధాని మోడీ తనకు సూచించారని రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మెన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. ఢిల్లీలో ఓ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు ప్రధాని మోడీని కలిసారు. రైతులకు అండగా వారు ఉండాలని కోరుకుంటూ ఆకు పచ్చని శాలువాతో మోడీని సత్కరించారు. శాలువా చూడగానే రైతుల తరపున కాబట్టి స్వీకరిస్తున్నానని తెలిపారు. ఈ సమయం లో ప్రధాని 'నేచురల్ ఫార్మింగ్ మీ ప్రాంతం లో ఎలా ఉంది? మీరు ఏమైనా చేస్తున్నారా? ఒక్క సారి గుజరాత్ గవర్నర్‌ను కలిసి మాట్లాడండి, నేచురల్ ఫార్మింగ్ ని ఉద్యమంలా ముందుకు తీసుకువెళ్లాలి' అని మోడీ వెంకటేశ్వరరావుకు సూచించారు. రైతునేస్తం ఫౌండేషన్ నేచురల్, ఆర్గానిక్ వ్యవసాయంపై అవగాహన కోసం చేస్తున్న శిక్షణా తరగతులు , ప్రచురించిన పుస్తకాలు, చిరు ధాన్యాలు, మిద్దె తోటల పెంపకం గురించి ప్రత్యేకంగా నిర్వహిస్తున ప్రచార,విస్తరణ , చైతన్య, అవగాహన శిబిరాలు గురించి మోడీకి వివరించారు. ప్రధాని సూచించినట్లు తన పరిధిలో సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయం విస్తరణకు తప్పక కృషి చేస్తానని వెంకటేశ్వరరావు తెలిపారు. దీనిలో భాగంగా ఇప్పుడు చేస్తున్న కార్యక్రమాలను మరింత గా నిర్వహిస్తామని వివరించారు.

## డాక్టర్ బాలుకు జాతీయ సేవా పురస్కారం

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 9 (జనం సాక్షి):** జయ జయ సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో చిలకలూరిపేటలో నిర్వహించిన జాతీయ సేవా పురస్కారం 2025 ను డాక్టర్ బాలు కు ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు,ఆంధ్రప్రదేశ్ పర్యావరణ నిర్వహణ కార్పోరేషన్ చైర్మన్ పొలంరెడ్డి దినేష్ రెడ్డి లు అందజేయడం జరిగింది.ఆపదలో ఉన్నవారికి సకాలంలో రక్తాన్ని అందజేస్తూ,వ్యక్తిగతంగా 75 సార్లు రక్తదానం చేయడమే కాకుండా,తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం నాలుగు వేల యూనిట్ల రక్తాన్ని సేకరించి, ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కించుకున్నందుకు గాను ఈ పురస్కారాన్ని డాక్టర్ బాలు పొందడం జరిగింది.




# బైపోల్‌కు సిద్ధమే..

- స్టేషన్ గన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**వరంగల్, ఫిబ్రవరి 9 (జనంసాక్షి) :** స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ సుప్రీంకోర్టులో ఉందన్నారు. న్యాయస్థానం తీర్పు ఎలా వచ్చినా శిరసావహిస్తానని మనసులోని మాట బయపెట్టారు. ఒకవేళ ఉప ఎన్నికలు వస్తే ఎదుర్కోవడానికి తాను సిద్ధంగా ఉంటానని వ్యాఖ్యానించారు. ఈ విషయంలో పారిపోయే పరిస్థితి అస్సలు లేదని కుండబద్దలు కొట్టేశారు. వరంగల్‌లో ఆదివారం ఉదయం మీడియాతో మాట్లాడిన కడియం శ్రీహరి, బీఆర్ఎస్ నుండి వెళ్లిన వారిపై కేటీఆర్ తీవ్ర విమర్శలు చేయడంపై మండిపడ్డారు. తమను అనేముందు ఒక్కసారి బీఆర్ఎస్ వెనక్కి తిరిగి చూసుకోవాలన్నారు. పదేళ్లలో 36 మంది ఎమ్మెల్యేలను పార్టీలోకి తీసుకొని మంత్రులు చేసింది మీరు కాదా అంటూ ప్రశ్నించారు.ఫిరాయింపులను ప్రోత్సహించి, రాజకీయ పార్టీలను అసెంబ్లీలో లేకుండా చేసింది ఎవరని సూటిగా ప్రశ్నించారు. ఇవాళ సుద్ద పూసలన్నట్లుగా ఈ రోజు మాట్లాడుతున్నారా? మీరు చేస్తే సంసారం.. ఇతరులది వ్యభిచారమా అంటూ కాస్త రుసరుసలాడారు. అసలు ఫిరాయింపుల మీద మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదన్నారు. ఢిల్లీ ఫలితాలు బీజేపీ ఊహించినట్లుగా వచ్చాయని తెలిపారు. బీజేపీ గెలిస్తే కేటీఆర్ ఎందుకు సంతోషం పడుతున్నారో అర్థం కాలేదన్నారు. ఢిల్లీలో ఆప్ ఓటమికి బీఆర్ఎస్ కారణమన్నారు. మొదటిసారి ప్రభుత్వంలో బాగానే పని చేశారని, రెండోసారి అధికారం రాగానే బీఆర్ఎస్ దోస్త్ దెబ్బకొట్టిందన్నారు. లిక్కర్ స్కామ్‌లో సీఎం సహా ముగ్గురు జైలుకు వెళ్లారని, అందువల్లే ఆప్ ఓడిపోయింద న్నారు. ఆప్–కాంగ్రెస్ కలిసి పోటీ చేస్తే ఫలితాలు మరోలా ఉండేవన్నారు. ఘనపూర్ నియోజకవర్గం అభివృద్ధి, ప్రజలకు ఇచ్చిన మాటను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ సహకారం కోసం పార్టీ మారానని తెలిపారు. నా నిర్ణయాన్ని ప్రజలు స్వాగతించి ఎంపీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో ఘనపూర్ నుంచి గెలిపించారన్నారు. సభ్యత సంస్కారం లేకుండా మాట్లాడేవాళ్లకు ప్రజలు ఏనాడో సమాధానం చెప్పారని మనసులోని మాట బయటపెట్టారు. సిగ్గులేకుండా మాట్లాడేవాళ్ళకు ఏం చెప్పినా అర్థం కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటే గిట్టనివారు ఘనపూర్‌లో అభివృద్ధి ఏం జరగలేదని మాట్లాడు తున్నారని అన్నారు. చేతగానివారు, చేవలేని అవినీతి పరులు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఘనపూర్ నియోజకవర్గానికి ఎక్కువ నిధులు వచ్చాయన్నారు. రేపో మాపో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అభివృద్ధి పనులకి శంకుస్థాపన జరగనున్నట్లు తెలిపారు. నా ఎజెండా అభివృద్ధి అని, ఈ విషయంలో ఎవరెన్ని విమర్శలు చేసినా పట్టించుకోనన్నారు.



## వరల్డ్ కన్స్యూమర్ రైట్ నేషనల్ డిప్యూటీ చెర్మన్ గా భూక్య జంపన్న



**ములుగు ప్రతినిధి, ఫిబ్రవరి 09 (జనంసాక్షి) :** ప్రపంచ వినియోగదారుల హక్కుల సమావేశం ఆదివారం రోజున ఉమ్మడి వరంగల్ జిల్లాలో జరిగింది. ముఖ్యఅతిథిగా వ్యవస్థాపకులు,చైర్మన్ నల్లమస శ్రీకాంత్ గౌడ్ హాజరయ్యారు. శాంతోష్ అధ్యక్షతన సమావేశమయ్యారు. వరల్డ్ కన్స్యూమర్ రైట్ గురించి భూక్య జంపన్న మాట్లాడుతూ నాణ్యత లోపించిన వస్తువులు కొనుగోలు చేసి వాడడం వలన పాయిజన్ అయ్యే అవకాశం ఉంది అలా అమ్మిన వారిని వినియోగదారుడు ప్రశ్నించాలి. ఒక వస్తువు పట్ల ప్రశ్నించినప్పుడే నాణ్యత లోపించకుండా ఉంచడం జరుగుతుంది. ప్రపంచ వినియోదారులలో హక్కులు అవకాశం కల్పించినందుకు జాతీయ ప్రపంచ వినియోదారుల హక్కుల సంఘం కమిటీ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370